





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 307 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 13 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME : 11 ISSUE :307 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 13 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# పోలీసు రాజ్యమా?..
# బాబు నియంతృత్వ రాజ్యమా?

- రాష్ట్రంలో జరుగుతున్న అణచివేతలపై వైయస్ జగన్ ఆగ్రహం
- ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోంది
- పోలీసులతో అధికార దుర్వినియోగం చేయిస్తూ అసమ్మతి గళాలను నులిమేస్తున్నారు
- వేధింపులు ఎదురైనా సరే ప్రజల సమస్యలపై పోరాడుతూనే ఉంటాం
- వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్ ట్వీట్

పెన్ పవర్ డెస్క్:చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో జరుగుతున్న అణచివేతలపై వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రశ్నించే గొంతులను నులిమేస్తున్నారంటూ శనివారం తన ఎక్స్ ఖాతాలో ఆయన ఓ పోస్ట్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం, నిరసనలు తెలియజేడం, సమావేశాలు నిర్వహించుకోవడం.. బలమైన పునాదులు. అలాంటిది పునాదులను ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం నాశనం చేసే ప్రయత్నంలో ఉందని వైయస్ జగన్ మోహన్‌రెడ్డి మండిపడ్డారు.



ఎక్స్ వేదికగా వైయస్ జగన్..

పోలీసులు, మీడియా యంత్రాంగాలను ఉపయోగించి ప్రశ్నించే గొంతులను చంద్రబాబు ప్రభుత్వం నొక్కేసే ప్రయత్నం చేస్తోంది. ప్రశ్నించడానికి, నిరసన తెలపడానికి, సమావేశం కావడానికి ఉన్న హక్కులు ప్రజాస్వామ్యానికి పునాదులు. ఇవి ప్రజలకు తమ సమస్యలను స్వేచ్ఛగా వ్యక్తపరచడానికి, ప్రభుత్వాలకు తమ బాధ్యతను గుర్తు చేయడానికి ఉన్నాయి. అయితే ఏపీలో అలాంటి వాటిని చంద్రబాబు ప్రభుత్వం కఠినంగా అణచివేస్తోంది.

ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకుని ప్రభుత్వం నుండి సమాధానం కోరుకునే అవకాశం ఉండాలి

అయితే ఆంధ్రప్రదేశ్ లో ప్రజాస్వామ్య ప్రాథమిక హక్కులు భంగం కలుగుతోంది

చంద్రబాబు నిరంకుశ పాలనలో అడ్డగోలుగా అణచివేయపడుతోంది

పోలీసులతో అధికార దుర్వినియోగం చేయిస్తూ అసమ్మతి గళాలను నులిమేస్తున్నారు

పోలీసు రాజ్యమా? నియంతృత్వ రాజ్యమా? అన్నట్టుగా మారింది

చట్టానికి లోబడి నిరసనలు తెలిపినా.. అణచివేతలు, అక్రమ కేసులు ఎదుర్కోవాల్సి వస్తోంది

ఇది ప్రజాస్వామ్యం మీద జరుగుతున్న దాడి

ప్రతిపక్షం, ప్రజలు, నిరసనకారుల గొంతును రాష్ట్రంలో నులుమేస్తున్నారు

పోలీసు వ్యవస్థను అడ్డంపెట్టుకుని నియంతృత్వ పాలనతో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ప్రజలు, ప్రతిపక్షం చట్టబద్ధమైన సమస్యలను లేవనెత్తిన ప్రతిసారీ..

వివరాలు 2లో..

# రాష్ట్రంలో కల్తీ మద్యం చావులకు
# చంద్రబాబే కారణం

- మండిపడ్డ మాజీ మంత్రి మేరుగు నాగార్జున
- తాడేపల్లి లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి, బాపట్ల జిల్లా పార్టీ అధ్యక్షుడు మేరుగు నాగార్జున
- డిస్టిలరీల నిర్వాహకులంతా టీడీపీ వారే
- మద్యం తయారీకి యథేచ్ఛగా స్పిరిట్ వాడకం
- కల్తీ మద్యాన్ని బ్రాండెడ్ మద్యంగా విక్రయం
- ప్రతి మూడు బాటిల్స్‌లో ఒక బాటిల్ కల్తీ మద్యమే
- టీడీపీ నాయకుల ధన దాహానికి అమాయకుల ప్రాణాలు బలి
- మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆగ్రహం



పెన్ పవర్ డెస్క్: రాష్ట్రంలో కల్తీ మద్యం సిండికేట్లను తెరవెనుక నడిపిస్తున్న సీఎం చంద్రబాబు ధనదాహానికి అనేక మంది అమాయకుల ప్రాణాలు బలవుతున్నాయని వైయస్ఆర్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. తాడేపల్లి వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి చెందిన వారి గుప్పిట్లోనే మద్యం తయారీ డిస్టిలరీలు ఉన్నాయని, వాటి ద్వారా కల్తీ మద్యంను రాష్ట్రంలో ఏరులై పారిస్తున్నారని అన్నారు. ఏపీలో విక్రయిస్తున్న ప్రతి మూడు బాటిళ్ళలో ఒక బాటిల్ కల్తీ మద్యంగా ఉందంటేనే ఈ రాష్ట్రంలో నారా వారి కల్తీ సారా ఎంతగా చెలామణి అవుతుందో అర్థం చేసుకోవచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఆయనేమన్నారంటే...

**కల్తీ మద్యం దందా వెనుక టీడీపీ కీలక నేతలు**

రాష్ట్ర వ్యాప్తంగా కల్తీ మద్యం దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది.

వివరాలు 2లో..

# ఈ నెల 15, 16వ తేదీల్లో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన

- ఢిల్లీలో సీఎం చంద్రబాబు రెండ్రోజుల పర్యటన
- కేంద్రమంత్రులతో భేటీలు
- రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు, కేంద్ర నిధులపై చర్చ
- ఈ నెల 17న రాష్ట్రానికి తిరిగి రాక



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ నెల 15, 16వ తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ సహా వేర్వేరు కార్యక్రమాలకు

వివరాలు 2లో..

# "చీకట్లో" వ్యాఖ్యల ఫలితం... పేర్ని నానిపై కేసు నమోదు



- చిక్కుల్లో పడిన వైసీపీ నేత పేర్ని నాని
- టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావు ఫిర్యాదుతో అవనిగడ్డలో కేసు నమోదు
- వైసీపీ సమావేశాల్లో తీవ్ర వ్యాఖ్యలు చేసిన పేర్ని నాని
- రెచ్చగొట్టేలా ఉన్నాయంటున్న టీడీపీ నేతలు

పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని చిక్కుల్లో పడ్డారు. ఆయనపై అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పామర్రు, అవనిగడ్డ నియోజ కవర్గాల్లో జరిగిన వైసీపీ సమావేశాల్లో ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఈ కేసుకు కారణం. టీడీపీ నేత

వివరాలు 2లో..

# కుర్చీ దొరకడం అంత ఈజీ కాదు..



- కుర్చీ కోసం మేం ఆరాటపడుతుంటే మీరేమో కుర్చీ దొరికినా కూర్చోవట్లేదు
- బెంగళూరు అడ్వొకేట్ల సమావేశంలో డీకే వ్యాఖ్యలు
- సీఎం కుర్చీ వివాదం నేపథ్యంలో వైరల్‌గా మారిన కామెంట్స్

వివరాలు 2లో..

# విదేశీ డిగ్రీలతో అప్పులపాలు కావొద్దు



- హైదరాబాదులోని నల్సార్ లా యూనివర్సిటీ 22వ స్నాతకోత్సవం
- ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్
- విదేశీ డిగ్రీలు ప్రతిభను పెంచుతాయనేది అపోహ మాత్రమేనని వెల్లడి
- భారతదేశం నాణ్యమైన న్యాయ విద్యను అందిస్తుందని ఉద్ఘాటన

పెన్ పవర్ డెస్క్: హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్స వం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నరసింహ, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ యూనివర్సిటీ ఛాన్సలర్ జస్టిస్ సుజయ్ పాల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.సీజేఐ గవాయ్ తన ప్రసంగంలో న్యాయరంగంలోకి ప్రవేశిస్తున్న యువ న్యాయవాదులకు మరియు విద్యార్థులకు కీలక సలహాలు ఇచ్చారు. విదేశీ డిగ్రీల కోసం

వివరాలు 2లో..

# నా కుమారుడు అమెరికా ప్రెసిడెంట్ కావాలనేది నా కోరిక

- తన కుమారుడు అమెరికాలో పుట్టి పెరిగాడన్న పాల్
- మస్క్ తో కలిసి పనిచేసే అవకాశాలున్నాయని వ్యాఖ్య
- నర్సు నిమిష ప్రియకు క్షమాభిక్ష పెట్టాలని విన్నపం



పెన్ పవర్ డెస్క్:అమెరికాను కాపాడేందుకు మూడో పార్టీ కావాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. మస్క్ తో కలిసి పనిచేసే అవకాశాలున్నాయని చెప్పారు.

వివరాలు 2లో..

# అనుమతులు లేకుండా యూనివర్సిటీ ప్రారంభించడం పెద్ద తప్పు

- వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ వర్సిటీ విద్యార్థుల సమస్యలపై షర్మిల ఆందోళన
- సీఓఏ అధికారులను కలిశానని షర్మిల వెల్లడి
- సమస్య పరిష్కారం కాకపోతే ఢిల్లీ వెళతామని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కడపలోని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..

# జగన్ మనసులోని మాటలనే పేర్ని నాని, ప్రసన్న మాట్లాడుతున్నారు

- జగన్ ను ప్రజలు లేవకుండా చేశారన్న దేవినేని ఉమ
- సింగయ్య భార్యను బెదిరించి తప్పుడు ప్రకటన ఇప్పించారని మండిపాటు
- విజయసాయి భగవద్గీత శ్లోకాలు వల్లిస్తున్నారని ఎద్దేవా



పెన్ పవర్ డెస్క్:151 సీట్లు గెలిచామనే మదంతో జగన్ ఇష్టానుసారం వ్యవహ రించారని... దీంతో 11 సీట్లతో ప్రజలు ఆయనను లేవకుండా చేశారని టీడీపీ నేత దేవినేని ఉమ ఎద్దేవా చేశారు. చీకట్లో కన్నుకొట్టే తప్పుడు పనులు చేయడం వల్లే ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు.

వివరాలు 2లో..

# శ్రీవారి భక్తులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ



- ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నామన్న ఆనం
- 160 ఆలయాల్లో భక్తుల దర్శనాన్ని సులభతరం చేశామని వెల్లడి
- నాణ్యమైన ప్రసాదాలను అందిస్తున్నామన్న మంత్రి

వివరాలు 2లో..

# సిట్ విచారణకు డుమ్మా కొట్టిన విజయసాయిరెడ్డి

- లిక్కర్ స్కామ్ కేసులో నేడు విచారణకు హాజరుకావాల్సిన విజయసాయి
- ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలు ఉన్నాయంటూ సిట్ కు సమాచారం పంపిన వైనం
- విచారణకు వచ్చే తేదీని తెలియజేస్తానన్న విజయసాయి



పెన్ పవర్ డెస్క్:ఏపీ లిక్కర్ స్కామ్ కేసు విచారణకు మాజీ రా జ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి డుమ్మా కొ ట్టారు. ఈ ఉదయం 10 గంటలకు సిట్ ముందు విచారణకు విజయసాయి హాజరు కావాల్సి ఉంది. అయితే, ఈరోజు విచారణకు తాను హాజరుకా లేనని సిట్

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# పత్తాలేకుండా పోయారే

వైసీపీ నేత ఆదిమూలపు సురేష్ ను ఎక్కడైనా చూశారా? కనిపించారా? ఏమయిపోయారు? పార్టీ అధికారం నుంచి వైదొలగిన తర్వాత ఈయన గారు ఎటు వెళ్లారో తెలియడం లేదు పార్టీకి కూడా అందుబాటులో లేకుండా పోయారు. వైసీపీ హయాంలో పూర్తి కాలం మంత్రిగా పనిచేసినా అధికారం కోల్పోయిన తర్వాత మాత్రం కనిపించకుండా పోవడం క్యాడర్ లో కూడా ఒకింత అసహనం పెరిగిపోయింది. ఆదిమూలపు సురేష్ వరసగా మూడు నియోజకవర్గాల్లో పోటీ చేసి మరో రికార్డును సొంతం చేసుకున్నారు. ఆదిమూలపు సురేష్ దక్షిణ మధ్య రైల్వేలో ఐఆర్ఎస్ అధికారిగా పనిచేశారు. తర్వాత వీఆర్ఎస్ తీసుకుని రాజకీయాల్లోకి వచ్చారు. 2009 లో కాంగ్రెస్ తరుపున యర్రగొండపాలెం నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

**మూడు సార్లు గెలిచినా...**

అనంతరం ఆదిమూలపు సురేషన్ వైసీపీలో చేరి జగన్ వెంట నడిచారు. జగన్ 2014 ఎన్నికల్లో ఆదిమూలపు సురేష్ ను సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేయించారు. అప్పుడు అధికారంలోకి రాలేదు. 23 మంది ఎమ్మెల్యేలు పార్టీని వీడి వెళ్లినప్పటికీ ఆదిమూలపు సురేష్ మాత్రం జగన్ చేతిని వదలలేదు. అదే సురేష్ కు బలంగా మారింది. 2019 ఎన్నికలకు వచ్చేసరికి సంతనూతలపాడు నుంచి ఆదిమూలపు సురేష్ ను మళ్లీ యర్రగొండపాలెంకు జగన్ షిఫ్ట్ చేశారు. సంతనూతలపాడులో గెలిచే అవకాశాలు లేవని సర్వే నివేదికలు రావడంతో ఆదిమూలపు సురేష్ ను తిరిగి యర్రగొండపాలెంకు పంపారు. అక్కడి నుంచి విజయం సాధించారు. జగన్ తొలి కేబినెట్ లో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. రెండున్నరేళ్ల తర్వాత జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఆదిమూలపు సురేష్ ను జగన్ కేబినెట్ లో కొనసాగించారు. అయితే ఈసారి విద్యాశాఖ కాకుండా మున్సిపల్ శాఖకు మార్చారు.

**అధినాయకత్వం తలంటడంతో...**

తన సొంత జిల్లా అయిన కడపకు ఆయనను ఇన్‌ఛార్జి మంత్రిగానూ జగన్ నియమించారు. అలా ఆదిమూలపు సురేష్ కు జగన్ అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. అయితే 2024 ఎన్నికల్లో పోటీ చేసిన కొండపి నియోజకవర్గానికి ఆదిమూలపు సురేష్ ఇష్టం లేకుండానే వెళ్లారు. అక్కడ ఓటమి పాలు కావడంతో అక్కడ క్యాడర్ కు కూడా అందుబాటులో లేరు. ఇక 2024 ఎన్నికల్లో యర్రగొండపాలెం నుంచి తాటిపర్తి చంద్రశేఖర్ వైసీపీ నుంచి గెలవడంతో అక్కడకు కూడా వెళ్లే పరిస్థితి లేదు. కానీ తనకు ఇష్టమైన యర్రగొండ పాలెంలో ఆదిమూలపు సురేష్ వేలు పెడుతుండటం, స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వర్గాన్ని తయారు చేయడంతో పార్టీ నాయకత్వం పిలిచి అక్షింతలు వేసిందట. ఈసారి సురేష్ ను మళ్లీ ఎక్కడకు షిఫ్ట్ చేస్తారో తెలియని పరిస్థితుల్లో ఆయన ఎటూ కాకుండా.. ఎవరికి కనపడకుండా హైదరాబాద్ కే పరిమితమయ్యారని తెలుస్తోంది.

# రాష్ట్రంలో కల్తీ మద్యం చావులకు చంద్రబాబే కారణం

- మొదటి పేజీ తరువాయి

టీడీపీ మద్యం సిండికేట్ ముఠాలు తయారు చేస్తున్న కల్తీ మద్యం తాగి మద్యానికి అలవాటున్నవారు ఉన్నట్టుండి తీవ్ర అనారోగ్యం బారిన పడి ఏమైందో తెలుసుకునే లోపే మృత్యు కౌగిట్లోకి చేరిపోతున్నారు. ప్రమాదకర స్పిరిట్‌లో కారమిల్, రంగు నీళ్లు కలిపి బ్రాండెడ్ మద్యంగా విక్రయిస్తూ మందుబాబుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. రాష్ట్రంలో 3,396 ప్రైవేటు మద్యం దుకాణాలన్నీ టీడీపీ సిండికేట్ గుప్పిట్లోనే ఉన్నాయి. ఇక వాటికి అనుబంధంగా దాదాపు 75 వేల బెల్ట్ దుకాణాలను కూడా సిండికేట్ నిర్వహిస్తోంది. ఆ మద్యం దుకాణాలు, బెల్ట్ షాపుల్లో కల్తీ మద్యాన్ని బ్రాండెడ్ మద్యంగా విక్రయిస్తున్నారు. ఏసీ బ్లాక్, ఓల్డ్ అడ్మిరల్, ఎస్పీవై 999 తదితర బ్రాండెడ్ మద్యం పేరుతో కల్తీ మద్యాన్ని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. కల్తీ మద్యం తాగి ఇటీవల పలువురు హఠాత్తుగా తీవ్ర అనారోగ్యం బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. ఆ చావులకు టీడీపీ కల్తీ మద్యం సిండికేట్ కారణమన్న వాస్తవాన్ని చంద్రబాబు సర్కారు కప్పి పుచ్చుతోంది. కల్తీ మద్యం తయారీకి కీలకమైన స్పిరిట్‌ను అక్రమంగా సరఫరా చేస్తున్న టీడీపీ పెద్ద తలకాయల జోలికి ఎక్సైజ్ శాఖ వెళ్లకుండా సీఎం చంద్రబాబు అండగా ఉండి కాపాడుతున్నాడు. అనకాపల్లి, పశ్చిమ గోదావరి, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్ కడప తదితర జిల్లాల్లో నిర్వహించిన దాడులతో కల్తీ మద్యం రాకెట్ దందా వెనుక టీడీపీ కీలక నేతలు, ప్రజాప్రతినిధుల కుటుంబాలే ఉన్నట్టు స్పష్టమైంది.

**రాష్ట్రంలో దాదాపు డజను కల్తీ మద్యం యూనిట్లు**

స్పిరిట్ కొనుగోలుపై కేంద్ర ప్రభుత్వం నుంచి నియంత్రణ ఉంటుంది. పరిశ్రమలు కూడా ఓ పరిమితికి మించి కొనుగోలు చేయకూడదు. అయితే కోవిడ్ వ్యాప్తి సమయంలో శానిటైజర్ల తయారీ కోసం ఆ పరిమితిని తొలగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం కోవిడ్ పరిస్థితులు లేనప్పటికీ స్పిరిట్‌ను భారీగా కొనుగోలుకు అనుమతిస్తున్నారు. దీన్నే టీడీపీ మద్యం సిండికేట్ తమ దందాకు అవకాశంగా మలుచుకుని కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుల్లోని స్పిరిట్ తయారీ పరిశ్రమల నుంచి డిస్టిలరీల పేరిట అవసరానికి మించి భారీ ఎత్తున కొనుగోలు చేస్తున్నాయి. అలా సేకరించిన స్పిరిట్‌ను అక్రమంగా కల్తీ మద్యం యూనిట్లకు తరలిస్తున్నాయి. రెండు మూడు జిల్లాలకు ఒక యూనిట్ చొప్పున రాష్ట్రంలో దాదాపు డజను కల్తీ మద్యం యూనిట్లను నెలకొల్పి కల్తీ మద్యాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఏరులై పారిస్తున్నారు. యానాంతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడుకు కూడా కల్తీ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. టీడీపీ సిండికేట్ కి అధికారిక నెట్‌వర్క్ ఉండటంతో కల్తీ సరుకును యథేచ్ఛగా బ్రాండెడ్ మద్యంగా విక్రయిస్తున్నారు. ప్రతి మూడు బాటిల్స్‌లో ఒక కల్తీ మద్యం బాటిల్ ని విక్రయిస్తున్నారు. ఓల్డ్ అడ్మిరల్, ఏసీ బ్లాక్ విస్కీ, ఏస్పీవై 999 పేరుతో ఈ కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. మద్యం ప్రియుల ప్రాణాలను ఫణంగా పెట్టి టీడీపీ మద్యం సిండికేట్ ఒక్క ఏడాదిలో రూ.వేల కోట్ల దోపిడీని సాగించింది.

**ఏడాదిలోనే రూ.5,280 కోట్ల విలువైన కల్తీ మద్యం విక్రయం**

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2024%–%25లో మద్యం అమ్మకాల ద్వారా రూ.28,500 కోట్ల ఆదాయం వచ్చి%శ%ది. 2025–26లో రూ.35 వేల కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం క్వార్టర్ బాటిళ్లలో మూడోవంతు కల్తీ మద్యం విక్రయించినట్లు అంచనా వేస్తున్నారు. ఆ ప్రకారం దాదాపు 48 కోట్ల క్వార్టర్ బాటిళ్ల మేర కల్తీ మద్యాన్ని విక్రయించారు. ఒక్కో క్వార్టర్ బాటిల్‌ను రూ.110 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ లెక్కన ఒక్క ఏడాదిలోనే రూ.5,280 కోట్ల విలువైన కల్తీ మద్యాన్ని తాగించి సొమ్ము చేసుకున్నారు.

## పోలీసు రాజ్యమా?.. బాబు నియంతృత్వ రాజ్యమా?

- మొదటి పేజీ తరువాయి

నిర్బంధం, వేధింపులు, తప్పుడు కేసులు కనిపిస్తున్నాయి. గుంటూరు మిర్చి యార్డ్ పర్యటన నుంచి బంగారుపాళ్యం పర్యటన.. దాకా ప్రతీసారి తప్పుడు కేసులు పెట్టారని మండిపడ్డారాయన.

గుంటూరు మిర్చియార్డులో రైతుల పరామర్శకు వెళ్లినప్పుడు ఒక కేసు నమోదు చేశారు

రామగిరిలో టీడీపీ గూండాల దాడిలో చనిపోయిన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తే తోపుతుర్తి ప్రకాష్ రెడ్డి మీద అక్రమ కేసు పెట్టారు

పొదిలిలో పొగాకు రైతులను పరామర్శించేందుకు వెళ్తే మూడు కేసులు పెట్టి 15 మందిని అరెస్టు చేశారు

పల్నాడులో పోలీసు వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించటానికి వెళ్తే ఐదు కేసులు నమోదు చేశారు

131 మందికి నోటీసులు జారీ చేశారు, సినిమా పోస్టర్ ప్రదర్శించిన యువకుడిని జైల్లో పెట్టారు

తప్పుడు కేసులు, అరెస్టులు, మీడియా అసత్య కథనాలతో చంద్రబాబు ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కే ప్రయత్నం చేయొచ్చు. కానీ, వేధింపులు ఎదురైనా సరే రాష్ట్రంలో ఉన్న ఏకైక ప్రతిపక్షంగా ప్రజల సమస్యలపై పోరాడుతూనే ఉంటాం అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

## కుర్చీ దొరకడం అంత ఈజీ కాదు..

'మేం (రాజకీయ నాయకులు) కుర్చీ కోసం ఆరాటపడుతుంటే మీరు (అడ్వొకేట్లు) మాత్రం కుర్చీ ఖాళీగా ఉన్నా కూర్చోవడంలేదు' అంటూ కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. కర్ణాటక ముఖ్యమంత్రి పీఠం కోసం కొంతకాలంగా వివాదం రేగుతున్న విషయం తెలిసిందే. డీకే శివకుమార్ సీఎం పదవిని ఆశిస్తుండగా.. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన సీటును వదులుకోవడానికి ఇష్టపడడంలేదు. ఈ విషయంపై ఇటీవల డీకే వర్గం ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలతో కర్ణాటక కాంగ్రెస్ లో దుమారం రేగుతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కుదిరిన ఒప్పందం ప్రకారం త్వరలోనే ముఖ్యమంత్రి మార్పు జరుగుతుందని డీకే వర్గం నేతలు అంటున్నారు. అయితే, ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టం చేశారు.

ఈ వివాదం ఇలా కొనసాగుతుండగా తాజాగా శుక్రవారం బెంగళూరులో

అడ్వొకేట్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కెంపెగౌడ జయంతి వేడుకలకు డీకే శివకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీకే మాట్లాడుతూ.. సభలో చాలా కుర్చీలు ఖాళీగానే ఉన్నప్పటికీ లాయర్ మిత్రులు కూర్చోవడంలేదని అన్నారు. కుర్చీ విలువ బహుశా మీకు తెలిసి ఉండకపోవచ్చని, ఖాళీగా కనిపిస్తే వెంటనే కూర్చోవాలని వ్యాఖ్యానించారు. తాము కుర్చీ కోసం ఎంతగానో ఆరాటపడతామని చెబుతూ మీరు మాత్రం ఇతరుల కోసం కుర్చీని త్యాగం చేస్తున్నారని చెప్పారు. దీంతో సభలో నవ్వులు విరిసాయి. కర్ణాటక సీఎం కుర్చీని దృష్టిలో పెట్టుకునే డీకే ఈ వ్యాఖ్యలు చేశారని స్పష్టంగా తెలిసిపోతోందంటూ రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## విదేశీ డిగ్రీలతో అప్పులపాలు కావొద్దు

- మొదటి పేజీ తరువాయి

అప్పులు చేయవద్దని న్యాయ విద్యార్థులను మరియు వారి కుటుంబాలను ఆయన హెచ్చరించారు, భారతదేశం నాణ్యమైన న్యాయ విద్యను అందిస్తుందని నొక్కి చెప్పారు. విదేశీ డిగ్రీలు ప్రతిభను పెంచుతాయనేది అపోహ అని, ఒకరి ప్రతిభ వారి పని ద్వారా నిరూపించుకోవాలని ఆయన అన్నారు. విదేశీ డిగ్రీల కోసం కుటుంబాలపై అప్పుల భారం మోపవద్దని ఆయన సూచించారు. న్యాయ వృత్తిలో అంకితభావం మరియు ప్రజాసేవ యొక్క ప్రాముఖ్యతను కూడా ఆయన నొక్కి చెప్పారు. ఇక, నేడు న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా సీజేఐ గవాయ్ తన ప్రసంగంలో హైలైట్ చేశారు, భారతదేశం వివిధ న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంటుందని, న్యాయవాదులు మరియు న్యాయసేవలో ఉన్నవారు అందరి మాటలను జాగ్రత్తగా వినడం చాలా ముఖ్యం అని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో కృత్రిమ మేధస్సు (ఏఐ)ని ఉపయోగించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, దీనిని సరిగ్గా ఉపయోగించుకుంటే తీర్పులను వేగంగా అందించడంలో సహాయపడుతుందని సీజేఐ తెలిపారు.

## నా కుమారుడు అమెరికా ప్రెసిడెంట్ కావాలనేది నా కోరిక

- మొదటి పేజీ తరువాయి

మస్క్ దగ్గర డబ్బు ఉంది, తనకు ఫాలోయింగ్ ఉందని అన్నారు. తన కుమారుడు అమెరికాలోనే పుట్టి పెరిగాడని... తన కుమారుడు అమెరికాకు ప్రెసిడెంట్ కావాలనేదే తన కోరిక అని చెప్పారు.యెమెన్ లో పని చేస్తున్న కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్షపైనా కేఏ పాల్ స్పందించారు. ఈ నెల 16న ఆమెకు శిక్షను అమలు చేయబోతున్నారు. తన వ్యాపార భాగస్వామి తలాల్ అబ్దో మెహదీని 2017లో ఆమె హత్య చేశారు. 2020లో ఆమెకు ఉరిశిక్ష విధించారు. ఫైనల్ అప్పీల్ 2023లో రిజెక్ట్ అయింది. ఆమెకు క్షమాభిక్షను ప్రసాదించాలని పాల్ కోరారు. నిమిష ప్రియకు క్షమాభిక్ష పెట్టాలని యెమెన్ ప్రధానికి లేఖ రాశానని

పాల్ తెలిపారు. ప్రియ ఎన్నో కష్టాలు పడిందని... ఆమె బిజినెస్ పార్ట్ నర్ ఆమెకు నరకం చూపించాడని చెప్పారు. ఆయన నుంచి ఎలా తప్పించుకోవాలో అర్థం కాక ఆయనను హత్య చేసిందని... ఆమె చేసిన హత్యను ఖండిస్తున్నానని... కానీ, ఆమెకు క్షమాభిక్ష పెట్టాలని కోరారు. ఆమెకు క్షమాభిక్ష పెడితే యెమెన్ ప్రెసిడెంట్ ని నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేస్తామని చెప్పారు. యెమెన్ లో మహిళలకు రక్షణ లేదని విమర్శించారు.

## శ్రీవారి భక్తులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ

- మొదటి పేజీ తరువాయి

**పెన్ పవర్ డెస్క్:**తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి భక్తులకు మెరుగైన సేవలను అందించేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. టీటీడీలోని పలు విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని ఆనం చెప్పారు. సీఎం ఆమోదం పొందిన తర్వాత ఆ నిర్ణయాలను అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 160 ఆలయాల్లో భక్తులకు దర్శనాన్ని సులభతరం చేశామని, నాణ్యమైన ప్రసాదాలను అందిస్తున్నామని చెప్పారు. 300 ఆలయాలకు ధూప, దీప, నైవేద్యాలకు నిధులు మంజూరు చేశామని తెలిపారు. 200కు పైగా ఆలయాల పునర్నిర్మాణం కోసం కామన్ వెల్ఫేర్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేశామని వెల్లడించారు.

## సిట్ విచారణకు డుమ్మా కొట్టిన విజయసాయిరెడ్డి

- మొదటి పేజీ తరువాయి

అధికారులకు విజయసాయి సమాచా రం అందించారు. తనకు ముందుగా నిర్ణయిం చుకున్న కార్యక్రమాలు ఉన్నందువల్ల విచారణకు హాజరుకాలేకపోతున్నానని... విచారణకు వచ్చే తేదీని తెలియజేస్తానని చెప్పారు. ఈ కేసుకు సంబంధించి ఏప్రిల్ 18న విజయసాయి తొలిసారి సిట్ విచారణకు హాజరయ్యారు. ఆ సందర్భంగా కుంభకోణంలో కీలక సూత్రధారులు, పాత్రధారుల పేర్లను ఆయన వెల్లడించారు. ఇప్పటి వరకు ఈ కేసులో మొత్తం 11 మందిని సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. వీరంతా ప్రస్తుతం రిమాండ్ లో ఉన్నారు.

మరోవైపు, ఈ ఉదయం విజయసాయి చేసిన ట్వీట్ వైరల్ గా మారింది. ఎవరైతే కర్మను చేస్తారో వారు అనుభవించక తప్పదు అనేవిధంగా భగవద్గీత శ్లోకాన్ని ఆయన పోస్ట్ చేశారు.

## అనుమతులు లేకుండా యూనివర్సిటీ ప్రారంభించడం పెద్ద తప్పు

- మొదటి పేజీ తరువాయి

విజయవాడలో కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీఓఏ) అధికారులతో భేటీ అయిన షర్మిల, విద్యార్థుల భవిష్యత్తు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆమె ఎక్స్ లో స్పందించారు. "కడప వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థుల పక్షాన సీఓఏ అధికారులను విజయవాడలో కలవడం జరిగింది. గత ప్రభుత్వ హయంలో సీఓఏ అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేశారు. ఇప్పుడు విద్యార్థులకు సర్టిఫికెట్లు రావడం లేదు. వందలాది మంది విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. సీఓఏ అనుమతులు లేకుండా లైసెన్సులు రావడం లేదు. విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ విద్యార్థుల కష్టాలు నేను ప్రత్యక్షంగా చూశా. ఆనాడు అనుమతులు లేకుండా యూనివర్సిటీ ప్రారంభించడం పెద్ద తప్పు. ఈ తప్పు సరిదిద్దాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది. రెండేళ్లుగా విద్యార్థులు పోరాటం చేస్తున్నా ఫలితం లేదు. వెంటనే సీఓఏ అనుమతులు తీసుకొని విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరాం. ఢిల్లీ స్థాయిలో సీఓఏను కలుస్తాం అని హెచ్చరించాం. ఒక నెల గడువు ఇచ్చాం. అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ తప్పును సరిద్దుతున్నాం అని హామీ ఇచ్చారు. నెల రోజుల్లో వైఎస్ఆర్ యూనివర్సిటీ విద్యార్థుల సమస్య పరిష్కారం కాకపోతే ఢిల్లీకి వెళతామని కాంగ్రెస్ పార్టీ తరపున హెచ్చరిస్తున్నాం" అని షర్మిల స్పష్టం చేశారు.

## "చీకట్లో" వ్యాఖ్యల ఫలితం... పేర్ని నానిపై కేసు నమోదు

- మొదటి పేజీ తరువాయి

కనపర్తి శ్రీనివాసరావు ఈ వ్యాఖ్యలపై ఫిర్యాదు చేశారు. పేర్ని నాని వ్యాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆరోపించారు. పేర్ని నాని తన ప్రసంగంలో, "రప్పా రప్పా అని కేకలు వేయడం కాదు... చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి. ఏదైనా చేయాలంటే నిశ్శబ్దంగా చేయండి, అరవకండి" అని అన్నారు. ఈ వ్యాఖ్యలను రహస్యంగా రాజకీయ హింసకు ప్రోత్సాహించేలా ఉన్నాయని టీడీపీ నాయకులు ఆరోపించారు. ఈ ప్రసంగం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అవనిగడ్డ నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులు తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ ఉద్రిక్తతలను పెంచి, హింసను రెచ్చగొట్టే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. కనపర్తి శ్రీనివాసరావు తన ఫిర్యాదులో పేర్ని నానిని 'రైస్ స్కామ్‌స్టర్'గా పేర్కొన్నారు, ఆయన వ్యాఖ్యలు సమాజంలో అరాచకాన్ని సృష్టించవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేసులో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

## జగన్ మనసులోని మాటలనే పేర్ని నాని, ప్రసన్న మాట్లాడుతున్నారు

- మొదటి పేజీ తరువాయి

తాజాగా పేర్ని నాని కూడా అలాంటి వ్యాఖ్యలే చేస్తున్నారని... ఏదైనా చేయాలంటే చీకట్లో కన్నుకొడితే అయిపోవాలని కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. సొంత పార్టీ కార్యకర్త సింగయ్యను కారుతో తొక్కించిన జగన్... ఆ తప్పును కప్పిపుచ్చేందుకు సింగయ్య భార్యను బెదిరించి తప్పుడు ప్రకటన ఇప్పించారని దేవినేని అన్నారు. సోదరి వరుస అయ్యే మహిళా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పట్ల ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను జగన్ ఖండించకుండా సమర్థించారని మండిపడ్డారు. జగన్ మనసులోని మాటలనే పేర్ని నాని, ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడుతున్నారని అన్నారు. కర్మఫలం అంటూ విజయసాయిరెడ్డి భగవద్గీత శ్లోకాలు వల్లిస్తున్నారని.... నీ దగ్గర పని చేసిన అధికారులే సిట్ విచారణలో నీ గుట్టు విప్పుతున్నారని దేవినేని ఉమా అన్నారు.

## ఈ నెల 15, 16వ తేదీల్లో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన

- మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు, కేంద్ర నిధులపై సీఎం వారితో చర్చించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మంత్రులు అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్, మన్సుఖ్ మాండవీయ, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ తదితరులతో సీఎం తన ఢిల్లీ పర్యటనలో భేటీ కానున్నారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం– బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా వేర్వేరు అంశాలపై సీఎం కేంద్ర మంత్రులతో చర్చించనున్నారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన పనుల గురించి కూడా ఆయా మంత్రిత్వ శాఖతో సీఎం చర్చలు జరుపనున్నారు. జులై 15వ తేదీ ఉదయం అమరావతి నుంచి ఢిల్లీ వెళ్లనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్యాహ్నం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు. అదే రోజు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, ఢిల్లీ మెట్రో రైల్ ఎండీలతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం లైబ్రరీలో జరుగనున్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని సీఎం ప్రసంగించనున్నారు. జులై 16వ తేదీన కేంద్ర కార్మిక ఉపాధి కల్పనా మంత్రి మన్సుఖ్ మాండవీయతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. అనంతరం నార్త్ బ్లాక్ లో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

# పెన్ పవర్

## ఉభయ గోదావరి

కాకినాడ । డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూ॥ గోదావరి । ప॥ గోదావరి । ఏలూరు


## రావులపాడులో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా...

### ఐషర్ వ్యాన్ స్వాధీనం, కేసు నమోదు



**రావులపాలెం, పెన్ పవర్ జూలై 12 :** రావులపాలెం మండలం రావులపాడు గ్రామ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. హెచ్‌పీ పెట్రోల్ బ్యాంక్ సమీపంలో వాహన తనిఖీల సమయంలో సుమారు 600 కిలోల పిడిఎస్ బియ్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలించేందుకు వినియోగిస్తున్న ఏపీ 25 ఎక్స్ 2735 నెంబర్ గల ఐషర్ వ్యాన్ను కూడా పోలీస్ అధికారులు అట్టడిగా పట్టుకున్నారు. ఈ ఘటనపై స్పందించిన రావులపాలెం ఎస్సై, బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. బియ్యం ప్రభుత్వ పథకానికి చెందినదని, దాన్ని మార్కెట్లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ ఘటనపై మరింత సమాచారం కోసం దర్యాప్తు కొనసాగుతోంది.

## భారీగా నగదు, బంగారం అపహరణ

### - భయాందోళనలోరవీంద్ర కాలనీ ప్రజలు





**సీతానగరం, పెన్ పవర్, జూలై 12 :** సీతానగరం మండలం లోని ఒకఇంటిలో ఎవరులేని సమయంలో భారీ చోరీ చోటు చేసుకొంది. రఘుదేవపురం గ్రామ పంచాయితీ పరిధిలో రవీంద్ర కాలనీలో శనివారం ఒకసారిగా ప్రజలు ఉలిక్కి పడే సంఘటన చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రవీంద్ర కాలనీ నివాసం ఉంటున్న సురవరపు మణికంఠ తండ్రి పేరు రాజారావు చెందిన ఇంటిలో బారి మొత్తంలో చోరీ జరిగింది. జూన్ 28న తన అక్క నిడదవోలులో నివాసం ఉంటున్నారు. దానితో రెండు వారాలనుండి ఇంటికి తాళం వేసి నిడదవోలు వెళ్ళారు. శనివారం తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటిలో సామాన్లు చిందరవందరగా ఉండగా బీరువా తాళం సైతం తెరచి ఉండడంతో ఉల్లికి పడ్డ మణికంఠ పోలీసులకు సమాచారం అందించారు. దీనిలో బెడ్ రూమ్, దేవుడు గదిలో ఉన్న 4 కాసుల బంగారం బిస్కట్, 90 తులాలు వెండి, 3 లక్షల 90 వేల రూపాయల నగదు పోయింది అని తెలిపారు. దీనితో ఎస్సై డి.రామ్ కుమార్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీను, కానిస్టేబుల్ మణిబాబు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. అలాగే క్లూస్ టీమ్ కూడా ఆధారాలు సేకరణ చేసింది. దీనితో ఒక్కసారిగా రఘుదేవ పురం గ్రామ ప్రజలు ఉలిక్కి పడ్డారు.

## ఎమ్మెల్యే బండారును కలిసిన ఆలమూరు ఏఎంసీ ఛైర్మన్



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 12 :** ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి జనసేనకు కేటాయించగా ఛైర్మెన్‌గా కొత్తపల్లి వెంకటలక్ష్మి, వైస్ ఛైర్మన్‌గా టిడిపికి చెందిన కేతా రాంబాబు ను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సిఫార్సు చేసిన విషయం విదితమే. ఈ మేరకు శనివారం నూతనంగా నియామకం జరిగిన ఆలమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొత్తపల్లి వెంకటలక్ష్మి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుని మర్యాదపూర్వకంగా కలిశారు.నియమకానికి సహకరించిన ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేసి వారి పట్ల గౌరవాన్ని విధేయతను కనబరిచారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యానందరావు ఏఎంసీ ఛైర్మన్, కమిటీ సభ్యులను అభినందించి పూల బొకేలు ఇచ్చి శాలువతో సత్కరించారు. బాధ్యతతో సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఒక వైపు ఆకలి కేకలు-మరోవైపు దాహం కేకలు

- జీతాలు చెల్లించేవరకు సమ్మె విరమించేది లేదన్న సిబ్బంది...
- సమ్మె కారణంగా త్రాగునీరు లేక ప్రజలు దాహంతో తల్లడిల్లుతున్న పరిస్థితి...
- పిల్లలు, వృద్ధులు తీవ్ర అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి...
- అధికారులు స్పందించకపోతే బహిరంగ ఆందోళనకు సిద్ధం..
- నీటి కొరత వల్ల ప్రజల ఆరోగ్యంపై ముప్పు..
- అధికారులు స్పందించాలి-సమస్యకు తక్షణ పరిష్కారం కావాలి..






**దేవీపట్నం,పెన్ పవర్,జూలై12 :** సత్యసాయి మంచినీటి పథకంలోని అవినాభావంగా ఉన్న రెండు విభిన్న సమస్యలు ప్రస్తుతం దేవీపట్నం మండల ప్రజలను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఒక్కవైపు సత్యసాయి త్రాగునీటి పథకంలో పని చేస్తున్న సిబ్బంది 20 నెలలుగా జీతాలు అందక పోవడంతో తమ కుటుంబాల పోషణకు తీవ్రంగా ఇబ్బందులు పడుతుండగా,మరోవైపు వారి సమ్మె కారణంగా త్రాగునీరు అందక ప్రజలు దాహంతో అల్లాడిపోతున్నారు. ఇప్పటికే జీతాలు ఇవ్వక పోవడాన్ని నిరసిస్తూ సత్యసాయి సిబ్బంది ధర్నా చేపట్టి తమ ఆందోళనను తెలియ జేస్తున్నారు. జీతాలు ఇవ్వకపోతే విధులకు హాజరుకావడం సాధ్యం కాదు. మాకు న్యాయం జరిగే వరకూ సమ్మె విరమించేది లేదని వారు స్పష్టం చేస్తున్నారు. తమపై నెలలు గడిచినా ప్రభుత్వం గానీ, సంబంధిత అధికారులు గానీ స్పందించక పోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉంటే,త్రాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొంతమంది గ్రామస్తులు ప్రైవేట్ నీటి ట్యాంకర్లపై ఆధారపడుతున్నా,చాలా మంది ఆర్థికంగా వెనుకబడినవారు ఉండటంతో ఆ అవకాశమూ లేదు.జనం పసిగుడ్డలతో ఇంటి ముందే నీళ్ళ కోసం ఎదురు చూస్తున్నారు. కనీసం తాగేందుకు శుద్ధమైన నీరు లేక పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారు అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని చెరువులు, వాగులు పొడి గాలులతో ఎండిపోయాయి. ఆలస్యం అయితే దాహంతో పాటు రోగాలు వ్యాపించే అవకాశం ఉందని ఆరోగ్య శాఖ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అధికారు లను హెచ్చరించారు, తక్షణమే సత్యసాయి సిబ్బందికి జీతాలు చెల్లించి సమ్మెను విరమింప చేయాలని, లేకపోతే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆగదని హెచ్చరిస్తున్నారు. సమస్య పరిష్కారం ఎప్పుడు? ఇప్పుడు ప్రశ్న ఒకటే 20 నెలలుగా జీతాలు లేని సిబ్బందికి న్యాయం ఎప్పుడు? త్రాగునీరు లేక అల్లాడుతున్న ప్రజలకు ఊరటనివ్వే నిర్ణయం ఎప్పుడు? బాధితులు ఎదురు చూస్తున్నారు... అధికారుల స్పందన కోసం.

## అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా తాడేపల్లిగూడెం అభివృద్ధి

### - గోపాలపురం ఎమ్మెల్యే శాసనసభ్యులు వెంకట్రాజు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్,జులై 12 :** అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర విప్ తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ఉభయగోదావరి జిల్లాల శాసనసభ్యులకు ఆదర్శప్రాయులని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శనివారం ఆయన తాడేపల్లిగూడెం పట్టణం 32వ వార్డ్ కడకట్లలో శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, దాతల సహకారంతో నిర్మిస్తున్న జడ్పీ హైస్కూల్ ఓపెన్ ఆడిటోరియం, జడ్పీహెచ్ఎస్ స్కూల్ ఆవరణంలో వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, క్రికెట్ స్టేడియం పనులను ఎమ్మెల్యే వెంకటరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యంత్రాలతో ఆధునిక పద్ధతులతో జాతీయ స్థాయిలో క్రీడాభివృద్ధికి నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తీర్చిదిద్దుతున్న తీరును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మారు తున్న జీవనశైలిలో ప్రతి మనిషికి శారీరక శ్రమ అవసరమని తద్వారా మానసిక ప్రశాంతత, వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించు కుని మానవ శరీరాన్ని దృఢంగా చేసుకోవచ్చని అన్న కృత నిశ్చయంతో బొలిశెట్టి శ్రీనివాస్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. ప్రస్తుత యాంత్రిక ప్రపంచంలో శారీరక క్రీడలు ఎంతగానో ద్రోహదపడతాయని ఆయన అన్నారు. దానికి తగినట్టుగా నియోజకవర్గంలో స్విమ్మింగ్ పూల్, క్రికెట్ స్టేడియం వంటి క్రీడాభి వృద్ధిని చేస్తున్నారని అన్నారు. గ్రామీణ నేపథ్యం నిండుకున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇటువంటి క్రీడ అభివృద్ధి పట్ల స్థానిక ఎమ్మెల్యే చూపుతున్న చొరవ ప్రతి ఒక్కరికి ఆదర్శం అన్నారు. గతంలో మున్సిపల్ ఛైర్మన్ గా చేసిన అనుభవాలను ఎమ్మెల్యే బొలిశెట్టి రంగరించి



ఈ ప్రాంతంపై ఉన్న అభిమానంతో అనేక అభివృద్ధి పనులను చేస్తున్నారని అన్నారు. ఈ అభివృద్ధి పనులను చూసి తాను స్ఫూర్తి పొందుతున్నానని తమ నియోజకవర్గంలో కూడా ఈ విధమైన అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన చేసే విధంగా స్ఫూర్తి కల్పిస్తున్నారన్నారు.

## బార్లపూడి క్రాంతి రంగప్రవేశం

- ప్రత్తిపాడు జనసేనలో కొత్త శక్తికి నాంది?
- స్వతంత్ర స్వరం-రాజకీయ వారసత్వాన్ని ప్రజాధర్మంగా మలుస్తున్న క్రాంతి
- అన్నకు ప్రత్యర్థిగా చెల్లెలే..? కుటుంబ రాజకీయాల్లో మార్పు సంకేతాలు
- "నన్నెవరూ ఆపలేరు"-బహిరంగంగా హెచ్చరించిన బార్లపూడి క్రాంతి





**ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 12 :** ప్రత్తిపాడు నియోజకవర్గ రాజకీయాల్లో కీలక మలుపు తిరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రముఖ కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం కుమార్తె బార్లపూడి క్రాంతి జనసేన తరపున రాజకీయ రంగప్రవేశం చేయ నున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రత్తిపాడు జనసేన ఇన్చార్జ్ బాధ్యతలను ఆమె భుజాల మీద వేసే అవకాశ ముందని సమాచారం, ఇది పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజానికి దారి తీస్తోంది. ముద్రగడ కుటుంబానికి చెందినా, బార్లపూడి క్రాంతి ఇప్పటివరకు స్వతంత్ర స్వరాన్ని పాటిస్తూ, పవన్ కళ్యాణ్ పట్ల విశ్వాసాన్ని చాటుకున్నారు. "విమర్శలు కాదు, సహకారమే అవసరం" అనే ఆమె గత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిత్వానికి అద్దం పడతాయి. ఇప్పుడు అదే ధైర్యం, అదే నిశ్చయంతో ప్రజల్లోకి అడుగుపెడు తున్నారన్న అభిప్రాయం నెలకొంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన గిరిబాబు ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్‌గా ఉన్న నేపథ్యంలో, ఆయనే చెల్లెలైన క్రాంతి జనసేన తరపున రంగం లోకి దిగడాన్ని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఇది ముద్రగడ కుటుంబంలో శక్తి కేంద్రీకరణ మార్పుకు సంకేతంగా అభిప్రాయపడుతు న్నారు. తాజాగా పెద్ద శంకర్ల పూడిలో మీడియా సమావేశంలో పాల్గొన్న బార్లపూడి క్రాంతి, తనపై వస్తున్న బెదిరింపులపై స్పందించారు. "ప్రజలే నా శక్తి. నన్ను ఆపే అధికారం ఎవరికీ లేదు" అని ధైర్యంగా ప్రకటించిన ఆమె వ్యాఖ్యలు, ఆమెలో దాగి ఉన్న రాజకీయ నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయి. జనసేనలో క్రాంతి రాక-కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం పెద శంకర్లపూడి గ్రామ సర్పంచ్ సూర్నిడి సురేష్ తెలిపిన మేరకు, బార్లపూడి క్రాంతి రాజకీయ అరం గేట్రం నేపథ్యంలో కార్యకర్తల్లో మళ్లీ జోష్ పెరిగింద న్నారు. జనసేన తరపున ఆమె బాధ్యతలు చేపడితే, నియోజకవర్గం మొత్తంలోనూ అభిమానం పొందే నాయకురాలిగా నిలిచే అవకాశం ఉందని తెలిపారు.

## పేర్ని నాని వ్యాఖ్యలపై మంత్రి సుభాష్ ఫైర్



రామచంద్రపురం, పెన్ పవర్,జూలై 12 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పేర్ని నాని వ్యాఖ్యలపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర స్థాయిలో స్పందించారు. శనివారం రామచంద్రపురం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "పేర్ని నానికి వయసు వచ్చిందేమో కానీ బుద్ధి రాలేదు. లోకేష్‌ను హేళనగా సంబోధించడం తగదు. కుక్కలకు పిహెచ్‌డీ చేయడంలో నువ్వే దిట్ట" అంటూ మండిపడ్డారు.వైసీపీ కార్యక్రమాల్లో హింసను ప్రోత్సహించే వ్యాఖ్యలు చేస్తున్నారని, ప్రజాస్వా మ్యంలో ఈ తీరును సహించబోమని హెచ్చరించారు.మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు చేస్తూ, "ఒక్క ఛాన్స్ అని వచ్చి, చేతగాని చవట దద్దమ్మగా నిలిచారని" ఎద్దేవా చేశారు.కొడాలి నానిపై కూడా ఘాటు వ్యాఖ్యలు చేస్తూ, "చీరలు, జాకెట్లు కాదు, బనీలు, డ్రాయర్లే సరిపోతాయి" అంటూ విరుచుకుపడ్డారు.వైసీపీ చేస్తున్న "పిచ్చి కార్యక్రమాలు" ప్రజల్ని మోసం చేయడానికే అనే ఉద్దేశ్యంతో జరుగుతున్నాయని ఆయన విమర్శించారు.

## గోదావరి నదిలో స్నానాలు, చేపల వేట నిషేధం


### - పామర్రు పోలీసుల హెచ్చరిక



**కె.గంగవరం పెన్ పవర్ జులై 12 :** కె.గంగవరం మండలం పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో గోదావరి నది తీర ప్రాంతాల్లో నీటి ప్రవాహం తీవ్రముగా పెరిగిన నేపథ్యంలో భద్రతా కారణాల చేత నదిలోకి దిగి స్నానాలు చేయడం, లేదా సందర్శనార్థం నదిలోకి ప్రవేశించడం పూర్తిగా నిషేధించబడినది.ఇలా నదిలోకి ప్రవేశించే గ్రామస్తులు లేదా సందర్శకులు ఎవరైనా చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి వస్తుందని రామ చంద్రపురం డీఎస్పీ రఘువీర్ హెచ్చరించారు. గోదావరి లంక ప్రాంతాల్లో ఉన్న పశువులు, మేకలు మరియు ఇతర జీవులను వెంటనే ఏటిగట్టు వద్దకు తరలించి జాగ్రత్తగా సంరక్షించాలన్నారు.చేపల వేటకు వెళ్లకూడదని, వెళ్లిన పక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలందరూ భద్రతా నిబంధనలను గౌరవిస్తూ సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సీఐ వెంకట నారాయణ, పామర్రు ఎస్సై జానీబాషా,ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్, వీఆర్వో స్వామి నాయుడు పాల్గొన్నారు.

## ఇంటి దొంగను పట్టేసిన పోలీస్..

### 50 లక్షల చోరీ సొత్తు స్వాధీనం : ఎస్పీ కృష్ణారావు వెల్లడి




**అమలాపురం పెన్ పవర్ జూలై 12 :** ఇంటిలో నమ్మకంగా ఉంటూ దాదాపు 50 లక్షల రూపాయల విలువైన బంగారాన్ని దోచుకున్న ఇంటి దొంగను పెట్టేశారు. ఇంట్లో పని చేస్తూ ఈ నేరానికి పాల్పడ్డాడు. వారం రోజుల్లోనే ఆ దొంగను పట్టుకుని రామచంద్రపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు వివరాలను డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కృష్ణారావు పాత్రికేయులకు వివరించారు. రామచంద్రపురం జడ్పీ స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న దొంతంశెట్టి శ్రీనివాస్ రామదుర్గ వీధి, శోభా హాస్పిటల్ వెనుక నివాసం ఉంటున్నాడు. ఈ నెల 3 వ తేదీన ఫిర్యాదుదారుడు దొంతంశెట్టి శ్రీనివాస్ తన భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా విశాఖపట్నం వెళ్లి 7 వ తేదీన రామచంద్రపురానికి తిరిగి వచ్చాడని ఎస్పీ తెలిపారు. తన సేవకురాలి ద్వారా కొంతమంది తెలియని నేరస్థులు ఇంటి తలుపును పగలగొట్టారని తెలుసుకున్నాడు. ఇంటి ప్రధాన ద్వారం స్క్రూడ్రైవర్‌తో తెరిచి, తలుపు హ్యాండిల్ తీసివేసి, లోపలికి ప్రవేశించాడని ఎస్పీ తెలిపారు. ఇంటిలో 50 లక్షల బంగార ఆభరణాలను దొంగిలించినట్లు ఫిర్యాదు చేసినట్లు అయన తెలిపారు. దర్యాప్తు చేయగా ఇంటిలో పని చేసే దేవగుప్తం వీరభద్రరావు పై అనుమానం వచ్చింది. అతని అదుపులోనికి తీసుకుని ప్రశ్నించగా బంగారం గుట్టురట్టు అయింది. అతని వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ కృష్ణారావు తెలిపారు. రామచంద్రపురం డి.ఎస్.పి రఘువీర్ నేతృత్వంలో రామచంద్రపురం సిఐ వెంకటనారాయణ, క్రైమ్ సీఐ గజేంద్ర కుమార్, రామ చంద్రపురం ఎస్సై నాగేశ్వరరావు ఏఎస్ఐ బాలకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ వీరబాబు కానిస్టేబుల్ సూరిబాబు ఏసు కుమార్ లోవరాజు అర్జున్ జాఫర్ హుస్సేన్ లు ఈ నేరాన్ని చేదించారని వారిని తాను అభినందిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

## మృతుడి కుటుంబ బాధ్యతను తీసుకున్న డిటిఓ శ్రీనివాస్

### - నిత్యావసరాల వితరణ చేసిన డిటిఓ





**అమలాపురం, పెన్ పవర్ జూలై 12 :** సఖినేటిపల్లి మండలంలోని పల్లిపాలేనికి చెందిన మృతుడు కామాని దుర్గాప్రసాద్ కుటుం బానికి జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాస రావు ఆరు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను అందజేశారు. ఈ నెల ఆరున మృతుడి తల్లి ఆదిలక్ష్మిని ఆయన ఇంటి వద్ద పరామర్శించి, ఆర్థిక సాయం చేశారు. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా కుటుంబ పోషణ కష్టతరమవు తోందంటూ ఆమె కన్నీటిపర్యంత మైంది. ఈ నేపథ్యంలో ఆరు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను డీటీఓ సమకూర్చి ఆమెకు అందజేశారు.

## హైవేపై రెండు వాహనాలు ఢీ



**అడ్డతీగల, పెన్ పవర్, జూలై 12 :** అడ్డతీగల మండలం పైడి పుట్ట గ్రామం సమీపన నేషనల్ హైవే ఈ 516 మీద శనివారం ఉదయం రెండు కార్లు ఎదురెదురుగా రావడంతో అదుపుతప్పి ఒకదానికి ఒకటి ఢీ కొనడం జరిగింది. వివరాల్లోకెళ్తే రాజమండ్రి నుంచి అడ్డతీగల వైపు వస్తున్న వాహనం, అడ్డతీగల నుండి గంగవరం వైపు వెళ్తున్న వాహనం, ఒకదానికొకటి ఢీకొనడం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో రెండు కార్లకు పాక్షికంగా దెబ్బతిన్నాయని, కారులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. దీంతో నేషనల్ హైవే పై ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, సంఘటన స్థలానికి హుటిన అడ్డతీగల ఎస్సై బి. వినోద్ కుమార్ వారి సిబ్బందితో పాటు వచ్చి పాక్షికంగా దెబ్బతిన్న వాహనాలు రెండిటిని పక్కకు తీయడం జరిగింది, దీంతో హైవే మీద వచ్చే వాహనదారులకి ఎటువంటి ఇబ్బంది కలగలేదని అక్కడ ఉన్న వాహనదారులు తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్కో క్రికెట్ జట్టు కెప్టెన్‌గా అడబాల

### - క్రికెటర్‌గా రాణిస్తున్న లైన్ మెన్



**ఆలమూరు, పెన్ పవర్,జూలై12 :** ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్కో, జెన్కో, డిస్కం క్రికెట్ జట్లు కెప్టెన్‌గా తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల లైన్ మెన్ అడబాల శ్రీ రామకృష్ణ ఎంపిక య్యారు. ఈ మేరకు ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఉత్తర్వులు ఇచ్చింది. మొత్తం 20 మందిని జట్టుకు ఎంపిక చేయగా అందులో కెప్టెన్‌గా అడబాల, వైస్ కెప్టెన్‌గా విశాఖపట్నం చెందిన టి.అభిషేక్ ను ఎంపిక చేశారు. ఆలమూరు మండలం చెముడులంక (గాంధీనగరం) గ్రామానికి చెందిన ఈయన బాల్యం నుంచి క్రికెట్‌లో రాణించేవారు. లైన్ మెన్ ఉద్యోగం వచ్చినప్పటికీ ఒకపక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోపక్క ఈ క్రీడలో ప్రాక్టీస్ చేస్తూ వస్తున్నారు. నాలుగు పదుల వయసు వచ్చినప్పటికీ బౌలింగ్, బ్యాటింగ్ లలో తనదైన ప్రతిభ కనబరుస్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున రాష్ట్ర జట్టుకు ఎంపికై ఇప్పటివరకు అనేక బహుమతులను అందుకుని జిల్లాకు పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టారు. ఇప్పుడు ఏకంగా రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఎంపికై జిల్లాకు మరింత గుర్తింపును తీసుకొచ్చారు. తనను కెప్టెన్‌గా ఎంపిక కావడంలో సహకరించిన వారందరికీ రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా రాష్ట్ర స్థాయిలో జట్టును విజయాలవైపు పయనించేందుకు కృషి చేస్తానని రామకృష్ణ తెలిపారు.

## పెదగార్లపాడు గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యం



**గంగవరం, పెన్ పవర్, జూలై 12 :** అల్లూరి సీతారామరాజు జిల్లా, గంగవరం మండలం, దొర మామిడి పంచాయతీ పరిధిలోని పెదగార్లపాడు గ్రామానికి చెందిన కోసు సుబ్బారావు దొర ఈ నెల 7వ తేదీ నుండి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. తాజాగా అతను రాజ మండ్రి పరిసర ప్రాంతంలో కనిపించు న్నట్టు కొంత సమాచారం అందినప్పటికీ, ఇప్పటివరకు ఆచూకీ లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో సుబ్బారావు దొర ఆచూకీ తెలిసిన వారు వెంటనే కుటుంబ సభ్యులను సంప్రదించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. సమాచారం తెలిసినవారు 7993773261, 6300047709. ఫోన్ నెంబర్లు తెలపాలని కుమారులు వెంకన్న దొర, సింగరయ్య దొర, నరసన్న దొర, శివకుమార్ దొర కోరారు.

## నేడు సిరిగిందలపాడులో ప్రత్యేక వైద్య శిబిరం

### రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామీ పరిజ్ఞేయనంద మహారాజ్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూలై 12 :** రంపచోడవరం మండలం, సిరిగిందలపాడు గ్రామంలోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో ఈనెల 13న ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించబడనున్నట్లు రామకృష్ణ మిషన్ రాజమహేంద్రవరం కార్యదర్శి స్వామీ పరిజ్ఞేయనంద మహారాజ్ తెలిపారు. ఈ సందర్భంగా పరమహంస యోగానంద నేత్రాలయ, వేమగిరి వారి ద్వారా కంటి వైద్య శిబిరం నిర్వహించబడి, ఉచిత కంటి పరీక్షలు, అవసరమైతే మందులు, కళ్లజోళ్ళు మరియు కంటి ఆపరేషన్లు (కాటరాక్ట్) చేయడం జరుగుతుందన్నారు. కంటి ఆపరేషన్ చేయించుకునే వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు మరియు తెల్ల రేషన్ కార్డు వెంట తీసుకురావలని స్వామీజీ సూచించారు. అలాగే మూర్ఛ వ్యాధి నిపుణులు డాక్టర్ గోపాలం శివన్నారాయణ ఆధ్వర్యంలో ఫిట్స్ (మూర్ఛ) వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఫిట్స్ రోగులకు నాలుగు నెలల పాటు సరిపడా మందులు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. అదనంగా, సాధారణ రోగములు, బీపీ, షుగర్ పరీక్షలు కూడా చేపట్టబడనున్నాయి. ఈ అవకాశాన్ని స్థానికులు, గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని స్వామీ పరిజ్ఞేయనంద మహారాజ్ కోరారు.

## జగన్మోహిని కేశవ స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం



**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 12 :** ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసి యున్న పురాతనమైన శ్రీ జగన్మోహిని కేశవస్వామి, గోపాలస్వామి ఆలయంలో శనివారం విశిష్ట పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించబడ్డాయి. ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అర్చనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించి స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తుల నమ్మకానికి కేంద్రంగా నిలిచిన ఈ ఆలయం, శనివారాలు, పర్వదినాలలో విశేష భక్తజనసందోహాన్ని ఆకర్షి స్తోంది. ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం హైదరాబాద్‌కు చెందిన కొడుకుల నరసింహా రావు శర్మ, శశిరేఖ దంపతులు. 50,000 రూ,విరాళంగా ఆన్‌లైన్ ద్వారా సమర్పించారు. వారి సేవా దృక్పథాన్ని గుర్తించిన ఆలయ అధికారులు, అర్చకులు వారిని ఆశీర్వదించగా ఆలయ అధికారి ఏ.శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం, చరిత్రకలిగిన పుస్తకం, శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించారు.

## గండి పోచమ్మ ఆలయంలో వరద హెచ్చరిక స్టిక్కర్లు

### - ఎస్‌డీపీఓ సూచనలతో పోలీసుల ముందస్తు చర్యలు










**దేవీపట్నం,పెన్ పవర్,జూలై12 :** దేవీపట్నం మండలంలోని ప్రసిద్ధ గండి పోచమ్మ ఆల యంలో భద్రతా చర్యలుగా పోలీసులు స్టిక్కర్లు ఏర్పాటు చేశారు. రంపచోడవరం ఎస్‌డీపీఓ సూచనల మేరకు ఆలయ ప్రాంగణంలో పలు కీలక ప్రాంతాల్లో ఈ హెచ్చరిక స్టిక్కర్లను అతికించారు. గతంలో ఆలయం వరద నీటిలో మునిగిపోయిన సందర్భాలను ప్రస్తావిస్తూ, భక్తులకు అవగాహన కలిగించేలా ఈ చర్యలు చేపట్టారు. గోదావరిలో వరద ఉధృతి రోజు రోజుకు పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్త మయ్యారు. వరద ముప్పు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రజలకు ముందుగానే సమాచారం ఇవ్వాలన్న ఉద్దేశంతో ఈ స్టిక్కర్ల ఏర్పాటు జరిగింది. ఆలయానికి వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని,అధికారులు సూచనలు పాటించాలని సూచించారు. ఈసందర్భంగా ఎస్సై షరీఫ్ మాట్లాడుతూ... గతంలో వచ్చిన భారీ వరదలతో ఆలయం పూర్తిగా మునిగిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఏవైనా అత్యవసర సూచనలు వచ్చినపుడు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది అని అన్నారు. గోదావరి వరద ప్రభావం కోసం ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వటం కోసం కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. భద్రత కోసం చేపట్టిన ఈ చర్యలను గ్రామస్తులు,భక్తులు అభినందిస్తున్నారు. ఆలయాన్ని దర్శించుకునే ముందు హెచ్చరికలు చదవడం వల్ల ముప్పును ముందే అంచనా వేయగలమని పేర్కొన్నారు. గ్రామస్థులు, భక్తులు పోలీసుల చర్యలను స్వాగతిస్తున్నారు.

## ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలు

### - సెలవు రోజుల్లో పాఠశాల కొనసాగింపు

### - పాఠశాలలు తీరుతో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి



**సీతానగరం, పెన్ పవర్, జూలై12 :** సీతానగరం మండలం లోని రెండు ప్రముఖ ప్రైవేటు పాఠశాలలు యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలు కొనసాగిస్తున్నారని పలువురు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి, విద్యార్థులు సెలవు రోజులలో ఆటపాటలతో కొంత మానసికంగా శారీరకంగా దృఢపరచుకోవడం కోసం ప్రభుత్వం సెలవు దినాలు ప్రకటిస్తుండగా అవేవీ పట్టించుకో కుండా సదరు స్కూల్ యాజ మాన్యం మాత్రం ర్యాంకు నెపంతో స్కూలు పేరు ప్రఖ్యాతులు మరియు, నూతన అడ్మిషన్లు పెంచుకోవడానికి విద్యార్థుల మానసిక స్థితిని పెట్టి పరుస్తూ విద్యార్థుల జీవితాన్ని ఫణంగా పెట్టి వారి మానసికంగా కృంగతీస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు, నిబంధనల ప్రకారం రెండో శనివారం ఆదివారం సెలవు దినాలుగా ప్రతి పాఠశాల పాటించాలని ప్రభుత్వ నియమ నిబంధనలు ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తు న్నారని, ప్రభుత్వ విద్యాశాఖ నిబంధనలు పాటించని ప్రైవేటు యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు శాఖపరమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుకుంటున్నారు.

## ప్రభుత్వ హాస్టళ్లలో హెల్త్ క్యాంపులు



**గోకవరం, పెన్ పవర్, జులై 12 :** కొత్తపల్లి పిహెచ్ సి వైద్యాధికారిణి డా. నిఖిత ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది మండలంలోని ప్రభుత్వ హాస్టళ్ళను స్సందర్శించి హెల్త్ క్యాంపులు నిర్వహించారు. స్థానిక సంజీవయ్యనగర్ లోని సాంఘిక సంక్షేమ హాస్టల్, మండలకార్యాలయాల ప్రాంగణంలోని ఎస్ టి పోస్టుమెట్రిక్ బోయ్స్ హాస్టల్, పద్మప్రియ థియేటర్ వద్ద గల ఎస్ టి గర్ల్స్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ను సందర్శించి విద్యార్థినీ విద్యార్థులకు వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. హాస్టల్స్ నందు పారిశుభ్రత పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం హాస్టల్ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, త్రాగునీటి పరిశుభ్రత, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, మరుగుదొడ్ల వాడకం, పరిశుభ్రత వంటి అంశాలపై ఆరోగ్యవిద్య జరిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్స్ రామకృష, సూర్యం, శంభుడు వైద్యసిబ్బంది ఎమ్ఎల్ హెచ్ పి. మౌనిక, అనూష, హెల్త్ అసిస్టెంట్ పవన్, ఏఎన్ఎమ్ నాగలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

## మత్తు నుండి విద్యాశాఖ మేల్కొనాలి : ఎస్ఎఫ్ఐ



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జులై 12 :** విద్యా శాఖ మత్తు నుండి మేలుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పతివాడ నాగేంద్రబాబు ఎద్దేవా చేశారు. పట్టణంలో ఉన్న సెంట్ ఆన్స్ విద్యాసంస్థ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా రెండవ శనివారం ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిన రోజున విద్యార్థులను పాఠశాలకు రమ్మని పాఠశాలను యధావిధిగా నిర్వహించడాన్ని ఎస్ఎఫ్ఐ చెప్పు పట్టింది. ఈ మేరకు కమిటీ అడ్డుకుంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పతివాడ నాగేంద్రబాబు మాట్లాడుతూ పట్టణంలో ఉన్న సెంట్ ఆన్స్ విద్యా సంస్థలు ఏ విధమైన ప్రభుత్వ నిబంధనలు పాటించ కుండా పాఠశాలను యధావిధిగా నిర్వహించ డాన్ని ఆయన మండిపడ్డారు.

అంతే కాకుండా ఈ విషయం గురించి సెంట్ ఆన్స్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని ప్రశ్నించగా వారు చెప్పిన విచ్చలవిడి సమాధానాన్ని విని ఆయన వారిపై మండి పడ్డారు. స్థానిక విద్యాశాఖ అధికారులకు కంప్లైంట్ చేసినా నిమ్మకు నీరు ఏత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సెలవు ప్రకటించిన దినాల్లో స్కూలు తెరవడాన్ని స్థానిక విద్యాశాఖ అధికారులకు తెలిసే జరుగుతుందని ఆయన అన్నారు. ఈ విధమైన విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలను నిర్వహించిన లేదా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వెళ్లిన వారి పై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే స్థానిక విద్యాశాఖ అధికారుల తీరు పై జిల్లా కలెక్టర్ కు, జిల్లా విద్యాశాఖ అధికారుల వరకు తీసుకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకురాలు బి.సింధు, పట్టణ కమిటీ అధ్యక్షుడు రవి, నాయకులు కేశవ, గణేష్, భాను, సుజాత, ధనుష్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న రామాలయం టెంపుల్ ఈవో రమాదేవి

### నిరుపేద బిసి మహిళ నివసించే హక్కు, జీవించే హక్కును కాలరాస్తున్న అధికారులు

### అధికారులే ప్రాథమిక హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారు



**ఎటపాక, పెన్ పవర్, జూలై 12 :** ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో వంద సంవత్స రాలుగా జీవిస్తున్న బీసీ మహిళా కుటుంబాన్ని నిర్దాక్షణంగా ఆమె కట్టుకుంటున్న ఇంటి నుంచి గెంటివేసే ప్రయత్నం చేసిన అధికారుల చర్యలను దళిత సంక్షేమ సంఘం వ్యస్థాపక అధ్యక్షుడు ముద్దా.పిచ్చయ్య తీవ్రంగా ఖండించారు. నిరుపేద బీసీ మహిళ ఎన్నో ఏళ్లుగా ఆ గ్రామం మధ్యలో వాళ్ళ తాతలు తండ్రులు నివసించిన ఆ స్థలంలో రెండు సంవత్సరాల క్రితం అగ్ని ప్రమాదం వలన తన ఇల్లు కాలిపోతే అదే స్థలంలో నిర్మించుకుందామని ప్రయత్నం చేస్తే దేవ స్థానం అధికారులు ఆ ఇంటి నిర్మాణాన్ని అడ్డుకోవడం సమంజసంగా లేదు. కూలి పనులు చేసుకుంటూ జీవించే నిరుపేద మహిళ అనే కనికరం లేకుండా అధికారులు దౌర్జన్యం చేయడం చాలా దారుణం. నిజంగా ఆ భూమి దేవస్థానానికి సంబంధించినదైతే ఆ స్థలంలో ఇంటి నిర్మాణం జరుపుతున్నప్పుడే నోటీసు ఇయ్యవలసిన అవసరం ఉంది, కానీ ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఆ మహిళపై దురుసుగా ప్రవర్తించడం దారుణం.

భారత రాజ్యాంగం ప్రకారం ఎవరైనా ఎక్కడైనా స్వేచ్ఛగా నివసించే జీవించే హక్కు ఉంది. భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులైనటువంటి నివసించే జీవించే హక్కులను అధికారులు కాల రాస్తారా అని ప్రశ్నిస్తున్నాం. నివసించే హక్కును జీవించే హక్కును అడ్డుకోవడం అనేది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుంది. ఆ మహిళకు 2007 సంవత్సరంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గృహ నిర్మాణ శాఖ ఇల్లును మంజూరు చేసింది. దాదాపుగా ఆ గ్రామంలో గృహ నిర్మాణ శాఖ ద్వారా 152 గృహాలు ప్రభుత్వమే మంజూరు చేసినట్లు తెలుస్తుంది. అప్పటి మంత్రి సంభాని చంద్రశేఖర్ ఆ గ్రామంలో శంకుస్థాపన చేయడం కూడా జరిగింది. అటువంటప్పుడు ఆమె నివసించే ఇంటి స్థలం దేవస్థానానికి ఎట్ల చెందుతుంది అని మేము ప్రశ్నిస్తున్నాము. ఒకవేళ దేవస్థానం భూమి అయితే చట్టపరంగా గాని న్యాయస్థానముల ద్వారా గాని స్వాధీన పంచుకోవాలి. అలా కాకుండా ప్రజలపై బల ప్రయోగం చేయటం చట్ట విరుద్ధం. అధికారులు సమగ్ర విచారణ జరిపి నిజా నిజాలు బయటకు తీయవలసిన అవసరం ఉంది.

### కోతులగుట్టలోని కొమరం భీం విగ్రహాన్ని


## ధ్వంసం చేసిన దుండగలపై కఠిన చర్యలు తీసుకోవాలి

### ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్



**ఎటపాక, పెన్ పవర్, జూలై 12 :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కొమరం భీం విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన ఘటనపై వివరాలను వెల్లడించారు. కూనవరం మండలం కోతులగుట్ట లోని ఆదివాసి అమరవీరుడైన కొమరం భీమ్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడానికి ఆదివాసి సంక్షేమ పరిషత్ (274/16) తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. దుండగుల ప్రతాపం అమరవీరుల విగ్రహాలపై కాదని ధైర్యం ఉంటే ముఖాముఖిగా ఆదివాసిలతో తలపడాలని ఆయన సవాల్ విసిరారు. ఈ విషయంపై గౌరవ పోలీస్ శాఖ వారు తక్షణమే స్పందించి దుండగులను పట్టుకొని వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అమరవీరుల విగ్రహాలపై దాడి చేసి ఆదివాసీలను భయపెట్టలేరని ఆదివాసి పోరాటాలను ఆపలేరని, ఇటువంటి తాటాకు చప్పుళ్ళకు ఆదివాసులు భయపడరని హెచ్చరించారు. అయితే కొమరం భీం విగ్రహాన్ని ధ్వంసం చేయటం అంటే ఆదివాసుల ఆత్మగౌరవాన్ని కించపరచడమే అని ఆదివాసులపై దాడి చేయడమే అని దీన్ని ఆదివాసిల, ఆదివాసి సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని ప్రభుత్వం మరియు అధికారులు దీనిపై స్పందించకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన అన్నారు. దుండగులకు బహుశా కొమరం భీమ్ చరిత్ర తెలియదు అనుకుంటా ఆయన వీరోచిత పోరాట పటిమ ఆయన ఆశయ సాధనాలు ఇంకా సజీవంగానే ఉన్నాయని ఒక్కసారి కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమంలోకి దిగామంటే ఇకపై ఏజెన్సీలోని ఆదివాసి దుండగులకు పుట్టగతులు ఉండవని, ఖబర్దార్ దుండగుల్లారా అని హెచ్చరించారు. ఆదివాసీల సహనాన్ని పరీక్షించొద్దని నిజం ఎంతోకాలం తాగదని త్వరలోనే దుండగులు ఎవరో తెలుస్తుందని ఆ తర్వాత పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోకుంటే దశలవారు ఉద్యమం తప్పదని అన్నారు. ఇప్పటికైనా ఆదివాసీలు మేలుకోవాలని అమరవీరుల విగ్రహాలు కూల్చి ఆదివాసుల ఆత్మగౌరవాలను దెబ్బతీసే దుండగులపై ఉద్యమ సమరసింహం మోగించాలని పిలుపునిచ్చారు.

## మురమళ్ళ శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కి విరాళం



**అమలాపురం పెన్ పవర్ జూలై 12 :** మురమళ్లలి: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న ఐ.పోలవరం మండలం మురమళ్ల శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కి శనివారం భక్తుడు విరాళం అందించారు. రాజమండ్రి నివాసి ఉయ్యూరు వీర వెంకట సత్య సుబ్బారావు రు .27 వేలు (ఇరవై ఏడు వేల రూపాయలు) శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కి అందించారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో దాతకు ప్రత్యేక దర్శనం అందించారు. ఆలయ సహాయ కమీషనర్ కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణలి దాతను అభినందించారు.

# శ్రీ పోలేరమ్మ అమ్మవారికి ఆషాడం సారె

## శాకంబరి దేవిగా పోలేరమ్మ అమ్మవారు భక్తులకు దర్శనం





**ఆలమూరు, పెన్ పవర్,జూలై 12 :** ఆషాఢమాసం పురస్కరించుకుని ఆలమూరు మండలం మడికి గ్రామదేవతైన శ్రీ పోలేరమ్మ అమ్మవారికి మడికి గ్రామ ఆడపడుచుల ఆధ్వర్యంలో ఆషాఢ సారె కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆషాడ మాసం విదియ శనివారం శ్రావణ నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ పోలేరమ్మ అమ్మవారు భక్తులకు శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంతోపాటు గర్భాలయం అంతరాలయం వివిధ రకాల 15 వందల కిలోల కూరగాయలు పండ్లతో పాటు సుగంధ పుష్పాలతో పర్వతనేని పద్మావతి, కర్రీ గంగరాజు సౌజన్యంతో 100 మంది మహిళలు అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్థానిక బాల వినాయకుని ఆలయం నుండి పసుపు, కుంకుమ,గాజులు, పుష్పాలు, వస్త్రాలు, చలిమిడి, పండ్లతోపాటు ఇతర సుగంధ ద్రవ్యాలు, పదార్ధాలను తీసుకుని మేళతాళాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ గ్రామోత్సవం నిర్వహించి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఉదయం నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఆడపడుచులు అమ్మవారి ఇంటికి చేరుకొని పోలేరమ్మ అమ్మ వారికి ఆషాడ పవిత్రసారెను సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు నందిగామ నాగేంద్ర శర్మ మాట్లాడుతూ ఒకప్పుడు కరువుకాటకాల సమయంలో దేవతల ఆరాధనను మన్నించిన దేవి శతాక్షితా అవతరించి జీవరాశులన్నింటికి అవసరమైన ఆహారం, కూరగాయలు, పాడి పంటలు. జీవజలాలన్నింటినీ ఆమె శరీరం నుంచి విడుదల చేసి కాపాడిందని, ప్రజలకు కావాల్సిన శాకాలను సృష్టించినందుకు ఆమెను శాకంబరిగా కొలుస్తారని అన్నారు. ఆషాడమాసంలో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించడం ఆనవాయితీ అన్నారు. కొత్తపల్లి శ్రీను, కొత్తపల్లి కోటేశ్వరరావు (చంటి), యడవల్లి లలిత, యనమదల అన్నపూర్ణ, ఉండమట్ల అమ్మాజీ, చెల్లో బేబీ, కొత్తపల్లి ధనలక్ష్మి, పార్వతినేని వీర వెంకట రామారావు, గళ్ళ నాగ, కుక్కునూరు భాను, కుడిపూడి కుమారి, చెల్లబోయిన ముత్యవేణి, వనం కుమారి, రామాంజనేయ భజన సమాజం వారు అమ్మవారి శాకంబరీ అలంకరణకు తమ సహాయ సహకారాలు అందించారు.

### సీపీఐ పట్టణ కార్యదర్శిగా మండల నాగేశ్వరరావు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూలై 12 :** సీపీఐ తాడే పల్లిగూడెం నూతన పట్టణ సమితి కార్యదర్శిగా మండల నాగేశ్వరరావు నియమితుల యారు. ఐదుగురుతో మహాసభలో కమిటీ ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కార్య దర్శిగా మండల నాగేశ్వరరావు, సమితి సభ్యులుగా ఎన్.నాగ లక్ష్మి, వడ్డాది మేరీ, దాస్యం రాము,తూము సత్యనారాయణ ఎన్నికయ్యారు.

## వాగ్ధానాల అమలుకు సీపీఐ ఉద్యమించాలి

### - సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జూలై 12 :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన వాగ్ధానాల అమలుకు సీపీఐ శ్రేణులు నిర్విరామంగా ఉద్యమించాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. శనివారం తాడేపల్లిగూడెం కపర్ధి భవన్ లో జరిగిన సీపీఐ తాడేపల్లిగూడెం 18 వ మహాసభలో భీమారావు మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలిస్తామని, విదేశాల్లో వున్న నల్లధనం వెనక్కి తెచ్చి ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాలో 15 లక్షలు జమచేస్తామని, వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామంటూ ఇంకా అనేక వాగ్ధానాలు గుప్పించి అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు గడుస్తున్నా ఏ ఒక్క వాగ్ధానం అమలు చేయలేదన్నారు. దేశ సంపదగా వున్న లక్షల కోట్ల రూపాయలు విలువైన ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ లాంటి బడా పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తూ దేశానికి తీరని ద్రోహం



చేస్తున్నార న్నారు. మతతత్వాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య మత విద్వేషాలు పెంచుతూ దేశంలో అశాంతికి ఆజ్యం పోస్తున్నారన్నారు. లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలులో చిత్తశుద్ధి కొరవడిందన్నారు. పేదల స్వంత ఇంటి కల నెరవేరుస్తామని,ఇరవై లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, మహిళలకు ఉచిత బస్సు పథకం,నిరుద్యోగ భృతి అంటూ అనేక వాగ్ధానాలు చేసి వాటి అమలులో మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. ప్రభుత్వాల మోసపూరిత వాగ్ధానాలపై ప్రజల్లోకి వెళ్ళి వారిని చైతన్యం చేసి ప్రజా పోరాటాలకు సన్నద్ధం చేయాలని భీమారావు కోరారు. సీపీఐ పట్టణ సమితి సభ్యురాలు ఎన్. నాగలక్ష్మి మహాసభకు అధ్యక్షత వహించారు. తొలుత సీపీఐ పతాకాన్ని పార్టీ సీనియర్ సభ్యుడు అల్లం రాము ఆవిష్కరించారు.సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి మాట్లాడారు.

### శ్రీశిర్డీసాయి విద్యార్థులకు

## ఎమ్మెల్యే బండారు అభినందన



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 12 :** హ్యూమానిటీస్ , లిబరల్ ఆర్ట్స్ కోర్సులకు పేరుగాంచిన అజీమ్ ప్రేమ్‌జీ (బెంగళూరు) విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం కోసం (2024 - 25)నకు (5సంవత్సరముల కోర్సు) చెముడులంక ఈశ్వర్ విద్యాలయ మహిళా కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు 60% స్కాలర్షిప్ తో ఆకుల శ్రీవల్లి, 100% స్కాలర్షిప్ తో సాధనాల నాగప్రవల్లిక ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విద్యార్థినులను అభినందించి, మెమెంటో అందజేశారు. అజీమ్ ప్రేమ్ జీ విశ్వవిద్యాలయం వంటి అతి పెద్ద విశ్వ విద్యాలయంలో సీటు సంపాదించిన ప్రతి విద్యార్థినికి ఉన్నత భవిష్యత్ ఉంటుందని అలాంటి విద్యార్థినులను తయారు చేస్తున్న ఈశ్వర్ విద్యాలయం ఔన్నత్యాన్ని ఆయన ప్రశంసించారు. కాంపిటేటివ్ ఎగ్జామ్స్ లో మరిన్ని విజయాలతో విద్యార్థినులు ముందడుగు వేయాలని చైర్మన్ ఉమారాణిని, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

## శ్రీ లక్ష్మీ నృసింహ నిత్యాన్నదానంనకు లక్ష విరాళం

అమలాపురం /సఖినేటిపల్లి, పెన్ పవర్ జులై 12: అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయములో నిర్వహించే నిత్యాన్నదానట్రస్ట్ నకు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు కు చెందిన తోట యుగనాగ శ్రీనివాస్, నాగగోపాల శ్రీహారిక దంపతులు 1,01,116. వేల రూ.లు విరాళముగా సమర్పించినారు. వారికి శ్రీ స్వామివారి దర్శనానంతరము ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ శ్రీ స్వామి వారి చిత్రపటం, ప్రసాదములను అందజేసినారు. శ్రీ స్వామివారి ప్రసాద విక్రయములు, ప్రత్యేక దర్శనములు వివిధ సేవల ద్వారా రూ. 1,30,339 లు అన్నదానం ట్రస్ట్ విరాళములు ద్వారా రూ. 2,51,629లు మొత్తం రూ. 3,81,968లు ఆదాయం వచ్చినదని, అసిస్టెంట్ కమిషనర్ వెంకట ప్రసాద్ తెలియజేశారు.



# వాడపల్లి చందన వెంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తుల సందడి







**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 12 :** గోదావరి తీరాన అద్భుతమైన భక్తి క్షేత్రంగా నిలిచిన వాడపల్లి శ్రీ చందన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులతో కళకళలాడింది. శ్రీదేవి, భూదేవి సమేత స్వయంభూ శ్రీ వెంకటేశ్వర స్వామివారు ఇక్కడ వేంచేసి యున్నారు. శనివారం ఉదయం నుండి భక్తుల ప్రవాహం ఎడతెరిపి లేకుండా సాగింది. తెలుగురాష్ట్రాలు నుండే కాకుండా ఇతర ప్రదేశాల నుండి వేలాదిమంది భక్తులు కోనసీమ తిరుమల దర్శనార్థం తరలి వచ్చారు. వేకువజామున స్వామివారి సుప్రభాత సేవ, మేలుకొలుపు, అలంకారం, హారతులు ఎంతో భక్తిశ్రద్ధలతో అర్చకులు నిర్వహిం చారు. స్వామివారి చందనపు విగ్రహం దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక పరవశంలో మునిగిపోయారు. మొదటి హారతికి హాజరైన భక్తుల ఆనందానికి అవధి లేకుండా పోయింది. వర్షం కురుస్తున్నా భక్తుల భక్తి చల్లబడలేదు. మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేస్తూ "గోవిందా గోవిందా" అంటూ భక్తులు నినాదాలు చేశారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ ఒక్కో అడుగూ భక్తితో నిండినది. క్యూ లైన్‌లో వేచి ఉన్న చిన్నారులకు ఆలయ సిబ్బంది పాలు, బిస్కెట్లు అందించారు- ఆ దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. ఆలయ అధికారులు భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని ఏర్పాట్లు చక్కగా నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం దివ్యమైన ఆనందంతో నిండిపోయింది. శనివారం ఒక రోజు స్వామి వారి ఆదాయం 62,52,971 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఉప కమిషనర్ ఎన్.ఎస్. చక్రధర్ రావు తెలిపారు. ఇది భక్తుల అపార విశ్వాసానికి నిదర్శనం అని పేర్కొన్నారు. వాడపల్లి వెంకటేశ్వరుడి కరుణా కటాక్షం పొందేందుకు వచ్చిన భక్తుల హృదయాల్లో భగవద్భక్తి పరవశించగా, కోనసీమ తిరుమల ఈ శనివారం ధన్యమైందని చెప్పవచ్చు.



### ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- టిడిపి ఉపాధ్యక్షులు తాడినరసింహారావు



**ముమ్మిడివరం పెన్ పవర్ జూలై 12 :** గత ప్రభుత్వ అనాలోచిత విధానాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు తాడి నరసింహారావు పేర్కొన్నారు. శనివారం కొమానపల్లి గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు సాంకేతిక సమస్యలతో కొన్ని సంక్షేమ పథకాలు అమలులో జాప్యం జరుగుతుందని జాప్యం లేకుండా పథకాలు సకాలంలో అందే విధంగా చూడాలని కొంతమంది నరసింహారావు దృష్టికి తీసుకురాగా స్థానిక శాసనసభ్యులు బుచ్చి బాబుకి గ్రామంలో సమస్యలను తెలియజేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని నరసింహారావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు పి.నారాయణ రావు బాలు గ్రామ కమిటీ అధ్యక్షులు కుంచనపల్లి వెంకన్న బాబు పి.కృష్ణ వర్మ కుంచనపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### కొమరం భీం విగ్రహ ధ్వంసం చేసిన

## దుండగులకు కఠిన శిక్షలు విధించాలి

- ఏపీ ఆదివాసి జేఏసీ డిమాండ్



**దేవీపట్నం, పెన్ పవర్, జూలై12 :** ఆదివాసి పోరాట యోధుడు కొమరం భీమ్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని ఏపీ ఆదివాసి జేఏసీ డిమాండ్ చేసింది.రాష్ట్ర జేఏసీ వైస్ చైర్మన్ తెల్లం శేఖర్,జిల్లా అధ్యక్షుడు రామారావు దొర మాట్లాడుతూ... ఆదివాసుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే విధంగా కొమరం భీమ్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలోని కూనవరం మండలం, కోతులు గుట్ట గ్రామంలో సచివాలయం ఎదురుగా ఉన్న కొమరం భీం విగ్రహాన్ని ఈనెల 9న రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు.అదే రాత్రి జగ్గవరం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఆదర్శ స్థూపం దగ్గర జెండా కర్రను పీకి వంద మీటర్ల దూరంలో పడేశారు.ఈ ఘటనలు ఆదివాసీ సమాజంపై జరుగుతున్న కుట్రలేనని,ఇలాంటి అసాంఘిక శక్తులను ప్రభుత్వం వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ విషయంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పెద్ద ఎజెన్సీ ఉద్యమం ప్రారంభించక తప్పదని హెచ్చరించారు.ఆదివాసుల ఆత్మగౌరవాన్ని కించపరిచే దుష్టశక్తులను సమూలంగా కంట్రోల్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

### జూలై 14న కాకినాడలో యధావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం : జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ, పెన్ పవర్, జూలై12 :** ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమం జిల్లా స్థాయిలో జూలై 14 వ తేదీన సోమవారం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10:00 గంటల నుంచి 01:00 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. అర్జీదారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి రాలే ని అర్జిదారులు, వారి యొక్క అర్జీలను మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు.అర్జీ దార్లు వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కాకినాడ జిల్లా కలెక్టర్ తెలిపారు.

### చందన అలంకరణలో వెంకటేశ్వర స్వామి



**అంబాజీపేట, పెన్ పవర్, జులై 12 :** స్థానిక కొర్లపాటి వారిపాలెంలో వేంచేసియున్న శ్రీ భూసమేత వేంకటేశ్వరస్వామికి శనివారం చందనతో ప్రత్యేక అలంకరణ చేసారు. ఉదయం నుండి స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడు వారాల వ్రత వెంకన్నగా పేరుగాంచిన కొర్లపాటి వారిపాలెం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం చందన అలంకరణ స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

# రోడ్లే విశ్రాంతి స్థలాలు.. గోవుల మిల్కీ మార్గాలు..!

- వాహనదారుల పైనే బెడులు - పశువుల నిర్లక్ష్య సంచారం ప్రమాదాలకు దారి..!
- గ్రామాల నుంచి నగరాల దాకా... గోవుల గల్లీ నుంచి మేయిన్ రోడ్డుల దాకా..!
- "ప్రజలకు ప్రమాదం - పాలకులకు స్పందనే లేదు" - స్థానికుల ఆగ్రహం..!
- పశువుల నియంత్రణపై విభాగాల సమాఖ్య అవసరం - ప్రజల విజ్ఞప్తి..!



కాజులూరు, పెన్ పవర్,జూలై 12 : "మేము రెస్ట్ తీసుకునేందుకు విశాలమైన రోడ్లే మాకు అనుకూలం ఆకలేస్తే బయటికి వెళ్తాం, కడుపు నిండితే రోడ్డుపైనే విశ్రాంతి తీసుకుంటాం!" ఇది కాజులూరు మండలంలోని గొల్లపాలెం,ఆర్యవటం గ్రామాల్లో కనిపించే గోవుల నిజమైన పరిస్థితి.ప్రజల మధ్యన, ట్రాఫిక్ మధ్యన నిర్భయంగా అడుగు లేస్తూ, రోడ్డుమీదే విశ్రాంతి తీసుకుంటూ గోవులు నడుస్తుండడం అక్కడి జనాలకు నిత్యసవాళ్లుగా మారింది. ఈ ప్రాంతాల్లో పశువులు నిర్లక్ష్యంగా రోడ్డుపైన తిరుగుతున్న కారణంగా వాహనదారులు తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి ప్రమాదకర పరిస్థితులు కూడా తలెత్తుతున్నాయి.కేవలం గ్రామాల్లోనే కాదు,నగరంలోనూ అదే పరిస్థితి నెలకొంది.కాకినాడ నగరంలోని జగన్నాథపురం మసీదు సెంటర్, వినాయక కేఫ్, వైఎస్ఆర్ విగ్రహం సెంటర్ వంటి రద్దీ ప్రాంతాల్లో కూడా గోవులు రెగ్యులర్ గెస్ట్‌లుగా మారాయి. వీటిని తరలించాల్సిన అధికారుల చేతుల ఊరిముట్టడే కనిపించదు.స్థానికులు, వాహనదారులు ఇప్పటికే అనేకసార్లు పత్రికల ద్వారా, అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ "యథా రాజా తథా ప్రజా" అన్న చాట్లానే పరిస్థితి కొనసాగుతోంది. గోవులు స్వేచ్ఛగా తిరుగుతుంటే, ప్రజలు మాత్రం ప్రమాదం ఊపిరిలో గుచ్చుకుని నడవాల్సిన పరిస్థితి.స్థానికుల వినతి:"ఇప్పటికైనా పశువులను అదుపులో పెట్టేందుకు పశుసంవర్ధక శాఖ, పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులు కలిసి పనిచేయాలి. ట్రాఫిక్ పోలీస్ శాఖ కూడా మార్గదర్శకాలు రూపొందించి అమలు చేయాలి" అని వాహనదారులు, స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## వైయస్ షర్మిలను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ శ్రేణులు



**అమలాపురం పెన్ పవర్ జూలై 12 :** విజయవాడ ఆంధ్ర రత్నం భవన్ లో రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టణ అధ్యక్షులు ఒంటెద్దు బాబి, బీసీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షులు కుడుపూడి శ్రీనివాస్ రావు, మండల అధ్యక్షులు ఏలేశ్వరపు రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి మొల్లేటి వెంకటేశ్వరరావు, చొల్లంగి దశరథ్ తదితరులు పాల్గొనట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## సుపరిపాలనలో తొలి అడుగు
## గొల్లపాలెంలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ



**కాజులూరు , పెన్ పవర్, జూలై 12 :** సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన "తొలి అడుగు" కార్యక్రమం గొల్లపాలెం గ్రామంలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేశారు. అలాగే స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గారి తండ్రి వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "వాసంశెట్టి సత్యం ఫౌండేషన్" ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలను కూడా ప్రజలకు వివరించారు. ఆరోగ్య శిబిరాలు, విద్యా సహాయం, బాధితుల సహాయానికి చేపట్టిన పనులు గ్రామస్థుల మన్ననలు పొందాయి. కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి సీనియర్ నాయకులు గుబ్బల యేసురాజు, తోట కృష్ణ, కోక హరి, వడ్డిశీను, క్లస్టర్ ఇంచార్జ్ రాజు, వడ్డాది ధరణి, కొప్పుశెట్టి లక్ష్మీనారాయణ, బొమ్మిడి సోవాలమ్మ, మాతా నాగరాజ్, రెడ్డి వెంకటేశ్వర్లు, ముద్రే నాగార్జున, పితాని శివ, పంపన కృష్ణ, యేసు, వాసు, పితాని వీరబాబు,తాతీలు,చంటి తదితరులు పాల్గొన్నారు. ప్రజల్లో ప్రభుత్వ పథకాలపై విశ్వాసం పెంచే విధంగా ఈ కార్యక్రమం సాగినట్లు కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. గ్రామస్థులు ఇచ్చిన సమస్యలపై సమగ్ర నివేదిక తయారు చేసి సంబంధిత శాఖలకు చేరవేయ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ట్రాక్టర్ తొట్టి తిరగబడి ముగ్గురికి గాయాలు
### - ఒకరి పరిస్థితి విషమం


**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 12 :** ట్రాక్టర్ కు తొట్టిని కలిపే ఇచ్ పిన్ ఊడిపోవడంతో కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ తొట్టి తిరగబడి ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం అంబాజీపేట మండలం గంగలకుర్రు గుంటమామిడి తోట మీదుగా అంబాజీపేట వైపునకు కర్రల లోడు ట్రాక్టర్ వెళుతూ ఉండటంతో చింతలపూడి కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న మలుపులో ట్రాక్టర్ తొట్టిని కలిపే ఇచ్ పిన్ ఊడిపోవడంతో పక్కనే ఉన్న కొబ్బరి తోటలోకి ట్రాక్టర్ తొట్టి బోల్తా కొట్టిందని కర్రల లోడుపై ఉన్న ముగ్గురు కూలీలకు గాయాలయ్యాయని వీరిలో ఒకరికి తీవ్రంగా గాయాలు కావడంతో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. కాగా ఈ ముగ్గురు రావులపాలెం కు చెందిన వారిగా తెలుస్తోంది.

# వట్టిగడ్డ వద్ద ఘోర ప్రమాదం
### మూడు కుటుంబాల్లో విషాదం కూలీలకు తీవ్ర గాయాలు



**రాజవొమ్మంగి, పెన్ పవర్ జూలై 12 :** ఈరోజు వట్టిగడ్డ గ్రామ శివారులోని ఎర్రంపాడు జంక్షన్ వద్ద ఘోర రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. రంపచోడవరం నుండి పాడేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు (AP35Z 0090) ఎదురుగా వస్తున్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి.దాకరాయి గ్రామానికి చెందిన పాంగి సురేశ్, మర్రి అచ్చిబాబు, కొర్రా లోవరాజు అనే ముగ్గురు రోజువారీ కూలీలు వట్టిగడ్డకు సిమెంట్ పనికి ద్విచక్రవాహనంపై (AP39AW 0352) బయలుదేరారు. యెర్రంపాడు జంక్షన్ వద్ద బస్సు ఢీకొనడంతో ముగ్గురికీ బలమైన రక్తపు గాయాలు అయినాయి. స్థానికుల సహకారంతో తక్షణమే ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై రాజవొమ్మంగి పోలీసు స్టేషన్ ఎస్సై ఇచ్చిన సమాచారం ప్రకారం బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన వాహన పొరపాటు ఎవరిది అనే విషయం స్పష్టంగా తెలియాల్సి ఉంది. బాధితులు ఆర్థికంగా వెనుకబడ్డ కుటుంబాలకు చెందినవారైన నేపథ్యంలో వైద్యం కోసం తగిన విధంగా సహాయం అందాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఈ విషయంపై స్పందించి బాధితులకు అవసరమైన మద్దతు అందించాలన్నది ప్రజల ఆకాంక్షగా కనిపిస్తోంది.

### ప్రభుత్వ రంగ సంస్థల రాష్ట్రస్థాయి సమావేశంలో
## రెండో రోజు పాల్గొన్న పి.గన్నవరం ఎమ్మెల్యే



**అమలాపురం పెన్ పవర్ జూలై 12 :** రెండో రోజు విశాఖ పట్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రభుత్వ రంగ సంస్థల సంఘాల రాష్ట్ర స్థాయి సమావేశంలో, పి.గన్నవరం నియోజకవర్గ శాసన సభ్యులు గిడ్డి సత్యనారాయణ అతిథిగా పాల్గొన్నారు. ఈ సమా వేశం రెండు రోజుల పాటు కొనసాగి, ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన అనేక కీలక అంశాలపై సమగ్రమైన చర్చలకు వేదికగా నిలిచింది. ఉద్యోగుల సమస్యలు, సంస్థల పునఃస్థాపన, మౌలిక వసతుల అభివృద్ధి,కార్మికుల హక్కుల పరిరక్షణ వంటి విషయాలపై వ్యూహాత్మకంగా చర్చలు జరగడం జరిగింది. మొదటి రోజు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రాతినిధ్యంతో సమావేశం ప్రారంభమైంది.ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలు, అభ్యర్థనలు స్పష్టంగా వినిపించగా, శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ వాటిని ఆసక్తితో విన్నారు.ఉద్యోగ భద్రత, వేతన సరళి, పదోన్నతులు,కార్మికుల సంక్షేమ పథకాల అమలులో ఎదుర వుతున్న సమస్యలపై ఆయన సున్నితంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి తగిన కార్యాచరణ తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందు ఉండేలా తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రెండవ రోజు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పనపై చర్చలు సాగాయి. ప్రభుత్వ రంగ సంస్థలను నూతన సాంకేతికతతో సమన్వయం చేయడం, స్థిరమైన మదుపు లభించేలా చేయడం, స్థానిక యువత కు ఉద్యోగావకాశాలు కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించబడింది. ఈ సందర్భంగా గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, "ప్రభుత్వ రంగ సంస్థలు దేశ ఆర్థిక రీత్యా నెమ్మదిగా కాదు, నిరంతరంగా దూసుకెళ్లే యంత్రాలవలె పని చేయాలి. వాటికి అవసరమైన మద్దతు ఇవ్వడం మన బాధ్యత," అని తెలిపారు. ఈ రెండు రోజుల సమావేశాల్లో ఆయన ప్రదర్శించిన చొరవ, నిబద్ధత, ప్రజా సంకల్పం ప్రభుత్వం, ఉద్యోగ సంఘాలు, ప్రజల మద్దతును చూరగొంది. రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్రను పటిష్టపరచాలన్న లక్ష్యంతో, ఆయన తీసుకుం టున్న చర్యలు నిజంగా అభినందనీయం అని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రికి ప్రజలే మొదటి ప్రాధాన్యత : ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 12 :** ప్రజల సంక్షేమం, అభివృద్ధే మొదటి ప్రాధాన్యతగా ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జగ్గంపేట శాసనసభ్యులు టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముసిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా విచ్చేసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలుపరిచిన హామీలు, సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో గుర్తు చేశారు. వైసీపీ విధ్వంసానికి, కూటమి వికాసానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని వ్యాఖ్యా నించారు. ప్రజల ఆశలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కాట్రావులపల్లి గ్రామాన్ని 6 కోట్ల రూపాయలతో అన్ని రంగాల్లో అభివృద్ధి సంక్షేమ అందించడానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ అహర్నిశలు పనిచేస్తున్నారని ముసిరెడ్డి నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, ముసిరెడ్డి నాగేశ్వరరావు, సుంకర సీతారామయ్య, కంటే రామారావు, ఫిషర్మెంట్ సొసైటీ చైర్మన్ కాకరపల్లి కామేష్, వెన్న వీరబాబు, బిక్కిన బాబి, డమర్ సింగ్ మధు, రాయుడు శివప్రసాద్, పోలినాటి ధర్మానందకుమారి శాస్త్రి, చిన్నాల తాతబ్బాయి, కానేటి ప్రసాద్, లంక సత్తిరాజు, పప్పు గణేష్, సూరిమిల్లి సత్తిబాబు, కాట్రావులపల్లి ఎంఎన్ఆర్ యూత్ అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# అంబాజీపేట వెంకన్నను దర్శించుకున్న పెన్నమరెడ్డి



**అంబాజీపేట, జూలై 12, ప్రభాతవార్త :** అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేం చేసియున్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని రాష్ట్ర అటవీశాఖ ఐటీ సలహా దారుడు పెన్నమరెడ్డి నాగబాబు శనివారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నాగబాబుకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదములు అందజేశారు. ఈ సందర్భంగా ఐటీ సలహా దారుడు నాగబాబు మాట్లాడుతూ కొర్లపాటివారిపాలెం వెంకన్న క్షేత్రం ఎంతో మహిమాన్వితమైనదని, గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో వెంకన్న స్వామిని దర్శించుకుని ఎన్డీఏ కూటమిని అధికారంలోకి తీసుకురావాలని స్వామివారిని దర్శించు కుని, కోరుకున్నానని తెలిపారు. మొక్కులో భాగంగా స్వామివారిని దర్శించుకున్నానని నాగబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, గణపతి వీర రాఘవులు, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, కొర్లపాటి ఢిల్లీ, అరిగెల సూరిబాబు, మేడిది శ్రీనివాసరావు, సుంకర పేరయ్య నాయుడు, దొమ్మేటి సాయికృష్ణ, పేరాబత్తుల పెద సుబ్బరాజు, మట్టపర్తి సోమేశ్వరరావు, పితాని రామకృష్ణ,పితాని వెంకటేశ్వర రావు, మేడిది చంద్రశేఖర్, కోటిపల్లి శ్రీనివాసరావు, పేరాబత్తుల సుబ్బరాజు, పత్తి దత్తుడు, వంగా చిన్న, పొట్టుపోతు సాయి, వీరా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ తూర్పు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన పి.గన్నవరం ఎమ్మెల్యే



**అమలాపురం పెన్ పవర్ జూలై 12 :** విశాఖపట్నం కలెక్టరేట్‌లో రెండు రోజుల పాటు జరుగుతున్న ప్రభుత్వ రంగ సంస్థల సమీక్ష సమావేశాల్లో పి.గన్నవరం శాసనసభ్యులు ప్రభుత్వ రంగ సంస్థల సంఘ సభ్యులు గిడ్డి సత్యనారాయణ చురుకుగా పాల్గొన్నారు. సమావేశాల అనంతరం, విశాఖ తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబుని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సమావేశం నియోజకవర్గ అభివృద్ధికి మరింత బలాన్ని చేకూరుస్తుందని నమ్మకం. ప్రజల అవసరాలను కేంద్రబిందువుగా చేసుకుని, ప్రభుత్వం అందించే అన్ని సేవలు సామాన్యుడి వరకు చేరేలా కృషి చేస్తానన్నారు.

## జోరున వానలో కూడా ఆధార్ నమోదు



**వై.రామవరం,పెన్ పవర్, జూలై 12 :** జోరున వర్షంలో కూడా ఆధార్ క్యాంప్ నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కే.బాపన్న దొర తెలిపారు. కానివాడ పంచాయతీ సచివాలయంలో ప్రత్యేకంగా నిర్వహించిన ఆధార్ నమోదు క్యాంప్ శనివారం కూడా నిర్వహించడం జరిగిందని తెలిపారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు జోరున వర్షంలో కూడా ఆధార్ నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

## పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఆన్‌లైన్ చెయ్యాలి
### - టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రవి కొండపల్లి



**టి.నరసాపురం, పెన్ పవర్, జులై 12 :** ఎర్రచెరువులో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ళ పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ కల్పించండని జల వనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడుని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రవి కొండపల్లి కోరి వినతిపత్రం సమర్పించారు. శనివారంపాలకొల్లు క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసిన కొండపల్లి రవి గత కొన్ని సంవత్సరాలుగా ఎర్రచెరువు ప్రాంతంలో 100 కుటుంబాలపైన నివాసం వుంటున్నారని వీరికి ప్రభుత్వం పక్కా గృహాలు కూడా మంజూరు చేసిందని వీరికిఇంటిపన్నులు ,కొళాయి పన్నులబిల్లులు మరియు కరెంటు బిల్లులు వున్నాయని గతంలో కొంతమంది అధికారులు వేరే సర్వే నెంబర్ వేసి తాత్కాలికంగా కొంతమందికి పట్టాలు అందజేసారని కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కొత్త గృహాల నిర్మాణం కోసం అన్లైన్ చేయగా పట్టాలు లేని కారణంగా అన్లైన్ అవడం లేదని కావున సంవత్సరాల తరబడి ఇక్కడే నివాసం వుంటున్న వీరికి శాశ్వతంగా పట్టాలు మంజూరు చేయాలని ఈ చెరువు వలన ఎవరికి ఏలాంటి ఇబ్బందులు లేవుకనుక అనుమతులు ఇవ్వాలని కోరగా మంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రవి తెలిపారు.

## నేడు గంగవరం మండలంలో మంత్రి పర్యటన

**గంగవరం, పెన్ పవర్, జూలై 12 :** ఇంటింటికి సుపరిపాలనలో లో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13న గంగవరం మండలం లోని నెల్లిపూడి బయనపల్లి పంచాయతీల్లో రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన చిన్న సూక్ష్మ మధ్యతరగతి పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు పర్యటన ప్రారంభం అవుతుందని కూటమి నాయకులందరూ పాల్గొని మంత్రి పర్యటన విజయవంతం చేయాలని టిడిపి మండల కమిటీ అధ్యక్షుడు పాము అర్జున, జనసేన అధ్యక్షుడు సిద్దు, బిజెపి అధ్యక్షురాలు నీలాలమ్మ తదితరులు కోరారు.

## చంద్రన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరవళ్లు

### - కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం
### - ఎమ్మెల్యే తనయుడు పితాని వెంకట్ సురేష్



**పెనుమంట్ర, పెన్ పవర్, జూలై 12 :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరవళ్లు తొక్కుతున్నాయని తెలుగుదేశం పార్టీ తెలుగు యువత నాయకుడు, ఎమ్మెల్యే తనయుడు పితాని వెంకట్ సురేష్ తెలిపారు. శనివారం మండలంలోని మార్టేరు, నెగ్గపూడి గ్రామాల్లో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం లో భాగంగా ఇంటి ఇంటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచు కుని అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నామని, నిధులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వంగా పనిచేస్తోందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఎన్టీఆర్ కాలనీలకు రహదారుల నిర్మాణం, ప్రతి ఇంటికి త్రాగునీరు అందించేందుకు జల మిషన్ పైప్‌లైన్ నిర్మాణం జరుగుతోందని అన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే, అంతమందికి తల్లికి వందనం అనే పథకం అమలులోకి తెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని వెంకట్ సురేష్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఆచంట నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, మండల అధ్యక్షులు వెలగల బులి రామిరెడ్డి, తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ కర్రి అచ్యుత రామారెడ్డి, గ్రామాధికారులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎస్ యు నుండి నాగరాజు బహిష్కరణ

**తాడేపల్లి గూడెం, పెన్ పవర్, జులై 12 :** పీడీఎస్యూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి పదవి నుండి చిలక నాగరాజు బహిష్కరణ చేసినట్లు రాష్ట్ర కమిటీ తెలిపింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పీడీఎస్యూ జిల్లా కార్యదర్శి కొనసాగుతున్న చిలుక నాగరాజు గత కొంతకాలంగా పీడీఎస్యూకి దూరంగా ఉంటున్నాడు. పీడీఎస్యూ భావజాలానికి వ్యతిరేకంగా పని చేస్తూ వైఎస్సార్ సీపీ పార్టీ తో అంటకాగు తున్నాడు . పీడీఎస్యూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యవర్గం నిర్మాణ పద్ధతులకు వ్యతిరేకంగా వ్యవహరించవద్దని అనేకసార్లు హెచ్చరించింది . అయినా తన పద్దతి మార్చుకోలేదు. పీడీఎస్యూ లో ఉంటూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నాడు . పీడీఎస్యూ క్రమశిక్షణ కలిగిన సంఘం జార్జ్ రెడ్డి, జంపాల, శ్రీపాద శ్రీహరి ,కొలశంకర్, సంభయ్య, వరహాలు, చేరాలు, స్నేహలత, రంగవల్లి, అజిత వంటి ఎందురో అమరవీరుల ఆశయాల సాధన కోసం గత 50 సంవత్సరాలుగా పని చేస్తున్నది. పీడీఎస్యూ నిర్మాణ అరాచకశక్తులు ని విభేదిస్తున్నది. కనుక పీడీఎస్యూ కి చిలక నాగరాజుకు ఎటువంటి సంబంధం లేదు. పీడీఎస్యూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యవర్గం తన ప్రాథమిక సభ్యత్వం నుండి తొలగిస్తూ బహిష్కరిస్తు న్నామని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌ఎండి రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## శృంగార వల్లభ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 12 :** పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవీ, భూదేవీ సమేత శృంగార వల్లభ స్వామి వారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొనేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామి వారిని దర్శించుకు నేందుకు భక్తులను అనుమతించారు. స్వామి వారిని ఈరోజు సుమారు ఇరవై ఐదు వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 2,51,920, అన్నదాన విరాళాల ద్వారా రూ. 85,129, కేశఖండన ద్వారా రూ. 6320, తులాభారం ద్వారా రూ. 400, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 30,135, మొత్తం రూ.3,73,904 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం పులిహోర ప్రసాదం, సుమారు ఐదు వేల ఐదు వందల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మీరు చేసినట్లు నేను బ్రోకర్ రాజకీయాలు చేయను

### వైసిపి నేత కరుటూరి శ్రీనివాస్



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 12 :** మీరు చేసినట్లు నేను బ్రోకర్ రాజకీయాలు చేయడం లేదని ఎన్నో ఏళ్లుగా ప్రజాసేవ చేస్తున్నానని టిడిపి వాళ్ళు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కరటూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం జగ్గంపేట వైసిపి కార్యాలయంలో కరటూరి శ్రీనివాస్, జగ్గంపేట మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గణేష్ రాజా, కరటూరి వీర్రాజు విలేకరుల సమావేశం నిర్వహించారు. కరుటూరి శ్రీను మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రజాసేవకే పరిమితమైన నాపై కొంతమంది వ్యక్తులు బురద జల్లుతున్న విషయం ఇటీవల ప్రజలకు తెలిసిందేనన్నారు. తాను పోలీస్ స్టేషన్, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలు చుట్టూ తిరిగి బ్రోకర్ రాజకీయాలు చేయనన్నారు. చేస్తే ప్రజాసేవ లేదంటే నా వ్యక్తిగత పని తప్ప ఏ విషయంలోనూ తనను తప్పు పట్టవద్దని సంబంధిత వ్యక్తులకు సవాల్ విసిరారు. గత కొన్నేళ్లుగా లయన్స్ క్లబ్ సంబంధిత ట్రస్టు, అలాగే లోక్ సత్తాలో నంబర్ గా పలు కార్యక్రమాల్లో ఎప్పటినుంచో పాల్గొని ప్రజాసేవకే అంకితమై ఉన్నానని కరటూరి శ్రీను స్పష్టం చేశారు. జగ్గంపేట మండలం వైసిపి అధ్యక్షుడు రావుల గణేష్ రాజా మాట్లాడుతూ దెయ్యాలు వేదాలు వల్లించిన్నట్లు, గులవింద పూస తన కింద ఉన్న నలుపును తెలుసుకోలేనట్లు టిడిపి నాయకులు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. మమ్ములను విమర్శించే వ్యక్తికి ధీటుగా సమాధానం చెప్పగలమన్నారు. గత కోడిపందాల విషయంలో ఎన్ని లక్షలు వెనకేసుకున్నారని, అలాగే మరలా వచ్చే కోడిపందాలకు ఇప్పటినుంచే సొమ్ము కాజేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టిన విషయం తమకు తెలుసునన్నారు. పుట్టిన గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతి ఇంటి నిర్మాణానికి వారి యొక్క ట్రాక్టర్లు ఇసుక తోలు విధానాలు అందరికీ తెలుసన్నారు. ఇంత జరుగుతున్న విలేకరుల సమావేశంలో సంబంధం లేని విషయాలు మాట్లాడటం పద్ధతి కాదన్నారు. నేను నా గ్రామంలో నాకు వీలైనంతవరకు 108 లాగా సేవ చేస్తానని నా గురించి నువ్వు మాట్లాడడానికి సరిపోవని, నా తాత, తండ్రి, నేను మా శ్రమతోనే అభివృద్ధిలోకి వచ్చామని మేము ఏ రకమైన దందాలు చేయలేదన్నారు. ఇకనైనా అవాకులు, చవాకులు తగ్గించుకుని మీ నాయకులకు చెడ్డ పేరు తీసుకురావద్దని, నీ మీద మీ టిడిపి నాయకులలోనే వ్యతిరేకత ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రామకుర్తి శ్రీరామచంద్రమూర్తి, కాపవరపు ప్రసాద్, వరుపులు సూరిబాబు, గుర్రం మహాలక్ష్మి, నకిరెడ్డి సుధాకర్, భూమాడ గణపతి, సప్ప రఘునాథ్, జల్లి ప్రవీణ్ కుమార్, రెడ్డి భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల హక్కుల సాధనకు పోరాటం చేస్తాం



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 12 :** మహిళా హక్కుల సాధనకు అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తా మని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షులు గండి పద్మ అన్నారు. ఆమె అధ్యక్షతన మండల కేంద్రమైన ఆలమూరు సమత కార్యాలయం నందు శనివారం ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రథమ మహాసభలు నిర్వహించారు. ముందుగా సమతా కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విమల, దుర్గాభవానిలు మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ఆగస్టు 15న అమలు చేస్తామని చేసిన ప్రకటనలో ఉచిత ప్రయాణం ప్రకటనను స్పష్టం చేస్తూ ప్రకటన చెయ్యాలన్నారు. అలాగే రాష్ట్రంలో మత్తు పదార్థాలు, గంజాయి విచ్చలవిడిగా అందుబాటులోకి రావడంతో నేరాలు పెరిగాయని,గత ప్రభుత్వం వైఫల్యాయాలను ఎండగట్టిన కూటమి ప్రభుత్వం అదే మార్గంలో ప్రయాణించడంతో పాలన మారిన విధానాలు మారలేదని ప్రజలు భావిస్తున్నారన్నారు. అలాగే సచివాలయంలో ప్రజలకు సేవలు అందించే గత ప్రభుత్వ విధానాన్ని కొనసాగించకూడదు అనే పద్ధతిలో ప్రస్తుత ప్రభుత్వం విధానాల వల్ల ప్రజల అవసరాన్ని క్యాష్ చేసుకొనే పద్ధతులు నెలకొన్నాయని ప్రభుత్వాన్ని ఆరోపించారు. అనంతరం మహిళా సమాఖ్య జిల్లా నూతన సమితి కార్యవర్గ సభ్యులుగా 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. వారిలో గౌరవ అధ్యక్షులుగా గండి పద్మ, జిల్లా అధ్యక్షులుగా బండారు సావిత్రి, ప్రధాన కార్యదర్శిగా పి సూర్యప్రభ,ఉపాధ్యక్షులుగా పోతుల ఝాన్సీ, సహాయ కార్యదర్శులుగా ఎస్ శారదాదేవి, ఎస్ వరలక్ష్మీ, శీలం గౌరీ పార్వతి, కోశాధికారిగా, కె పద్మ,ఆఫీస్ బేరర్లుగా,కర్రి రోజా, కేతా పద్మజ, బొంతు దుర్గ, కాగిత విలాసమ్మ, మందపల్లి సుశీల, రొట్ట రాణి, నీతిపూడి తులసి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్నికైన సభ్యులు వ్యవసాయ ఆధారిత జిల్లా లో గ్యాస్ ఆధారిత పరిశ్రమలు తీసుకురావాలని, ఆక్వా ఫిష్ కల్చర్ రంగంలో పని చేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి వారికి కార్మిక చట్టాలను అమలు చేయాలని, వాలంటీర్స్ నీ విధుల్లోకి తీసుకోవాలని, లేదా స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించాలని, ప్రత్యామాయంగా నిరుద్యోగ భృతి అందించాలని నూతన కమిటీ తీర్మానించడం జరిగింది.

## హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ

### కాకినాడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహణ
### ప్రజల ప్రశంసలు-హర్షధ్వానాలతో స్వాగతం








**కాకినాడ, జూలై 12 ,పెన్ పవర్ :** రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు, హెల్మెట్ వాడకాన్ని తప్పనిసరిగా పాటించాల్సిన అవసరంపై దృష్టి సారిస్తూ, కాకినాడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ ఏర్పాటు చేశారు. ఈ ర్యాలీ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, ఐపీఎస్ సారథ్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కాకినాడ టీవీఎస్ షోరూమ్ సిబ్బంది కూడా భాగస్వా ములయ్యారు. ర్యాలీ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ వద్ద ప్రారంభమై సర్పవరం జంక్షన్, భానుగుడి జంక్షన్, టూటౌన్ బ్రిడ్జి, జిలానీ సెంటర్, జగన్నాథపురం బలరాం సెంటర్ దాకా కొనసాగింది. ప్రధానంగా ప్రజలకువివరించబడిన అంశాలు:టూ వీలర్ వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్ చేయవద్దు. గవర్నమెంట్ జారీ చేసిన నంబర్ ప్లేట్లు మాత్రమే వాడాలి.

రాష్, నెగ్లిజెంట్ డ్రైవింగ్ నివారించాలి.మాడిఫైడ్ సైలెన్సర్లు నిషేధం,డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడకం వద్దు.ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగాపాటించాలికొత్త ఎం.వి యాక్ట్ ప్రకారం, నిబంధనలు అతిక్రమించిన వారికి భారీ జరిమానాలు విధించబడ తాయని హెచ్చరించారు. ఈ ర్యాలీ మార్గంలో ఎన్నో ప్రాంతాల్లో స్థానిక ప్రజలు హర్షధ్వానాలతో పోలీసులపై అభినంద నలు ప్రకటించడం విశేషం. కార్యక్రమాన్ని ట్రాఫిక్ సీఐలు ఎన్.రమేష్, డి.రామా రావు, ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది, టీవీఎస్ షోరూమ్ సిబ్బంది, కొంతమంది స్వచ్ఛంద ప్రజలు విజయవంతంగా నిర్వహించారు.

### విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీరు

## ఓఎన్జీసీ 10 లక్షలతో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు



**రాజవొమ్మంగి, పెన్ పవర్ జూలై 12 :** రాజవొమ్మంగి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఓఎన్జీసీ ఆర్థిక సహకారంతో రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రివర్స్ ఓస్మోసిస్ (ఆర్ఓ) ప్లాంట్‌ను ఓఎన్జీసీ అసిస్టెంట్ మేనేజర్ సంతాన్ దాస్ ప్రారంభించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆయనతో కలిసి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.బాలికల మంచినీటి కుళాయిలను జీజీఎం హ్యాండ్ హెచ్ఆర్ ఆర్.ఎస్. రామారావు, బాలుర కుళాయిలను జీఎం కొమ్ము సత్యనారాయణ ప్రారంభిం చారు. గ్రామ సర్పంచ్ వెంకట రమణి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన సంతాన్ దాస్, ఆర్.ఎస్.రామారావు మాట్లాడుతూ ఓఎన్జీసీ రాజమహేంద్రవరం యూనిట్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఈ ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేశామని చెప్పారు.

త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల కింద రూ.10 లక్షలు కేటాయించామని మండపేట, అంతర్వేది, కోనసీమ, కృష్ణా జిల్లాల్లో కూడా ఇలా స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాలను ఓఎన్జీసీ అమలు చేస్తోందని వివరించారు. విద్య, గ్రామాభివృద్ధికి ఓఎన్జీసీ సహకారం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఓఎన్జీసీ జనరల్ మేనేజర్ రూనా మజుందర్, ఫస్ట్ లేడీ ఎసెట్ సంజుక్త దాస్, హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అరిమిల్లి ఆదిలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, మండల విద్యాధికారి శ.సూరయ్య రెడ్డి, ఉపాధ్యాయులు టి.బొజ్జయ్య, శివకృష్ణ, ఎం.కొండబాబు, ఉదయ్, పాల్‌బాబు, గివింగ్ హేండ్స్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బి.కిరణ్‌బాబు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, విలేకరులు పాల్గొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఓఎన్జీసీ చేపట్టిన ఈ కార్యాచరణ హై స్కూల్ యాజమాన్యం, గ్రామస్థులు ప్రశంసలు అందుకుంది.

## పేద ప్రజలకు రహదారి నిర్మాణం ఏర్పాటు

### - టిడిపి పార్టీ మండల కమిటీ నాయకులు కార్యకర్తలు
### - టిడిపి రాష్ట్ర తెలుగు యువత నాయకులు బి.నరేష్





**వి.ఆర్.పురం పెన్‌పవర్, జూలై12 :** రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి సొంత నగదుతో శనివారం టిడిపి మండల కమిటీ నాయకులు రాజుపేట కాలనీ గ్రామ ప్రజలకు (గ్రావెల్) కంకర రహదారి నిర్మాణం పనులు చేపట్టి పూర్తి చేయడం జరిగింది.గోదావరి వరదల సమయంలో ప్రతి సంవత్సరం సుమారు 600 కుటుంబాలు ప్రజలు ఎత్తైన సురక్షితమైన ప్రాంతానికి చేరు కోవటానికి నానా ఇబ్బందులు పడుతూ చేరుకొనే వారు.ఈ విషయం తెలుసుకున్న టిడిపి మండల కమిటీ నాయకులు ఈ విషయాన్ని రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిర్యాల శిరీష,దేవి,కు తెలియ జేయడం జరిగింది.గోదావరి వరదలు సమయంలో పేద ప్రజలు ఇబ్బందులు పడకూడదు అనే మంచి ఉద్దేశంతో రహదారి పనులు ఏర్పాటు చేయండి.అంటూ టిడిపి మండల నాయకులకు రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే శిరీష,దేవి పిలుపు నిచ్చారు.రాజుపేట కాలనీ, గ్రామ ప్రజలు ఎమ్మెల్యే శిరీష,దేవి కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర తెలుగు యువత నాయకులు బొర్రా నరేష్, కుమార్, టిడిపి మండల కమిటీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


## ఆలమూరు ఏఎంసీ అభివృద్ధికి కృషి చేయాలి

### - జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీనివాస్




**ఆలమూరు, పెన్ పవర్,జూలై 12 :** స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బండారు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆ పార్టీ తరుపున మండలంలోని మడికి కి చెందిన కొత్తపల్లి వెంకటలక్ష్మిని కూటమి ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసిన విషయం విధితమే. దీంతో శనివారం ఆమె పార్టీ శ్రేణులతో కలిసి నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు నివాసానికి వాడపాలెం వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఆమెతోపాటు జనసేన పార్టీ తరఫున ఎన్నికైన ఏఎంసీ డైరెక్టర్లు జొన్నాడకు చెందిన చింతలపూడి శ్రీనివాస్ కుమార్, చొప్పెల్ల కు చెందిన తోరాటి సత్య కిషోర్, కలవచర్లకు చెందిన గుత్తుల నాగేశ్వరరావు, మూలస్థానం అగ్రహారానికి చెందిన దండా శ్రీదేవి లు నేత శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు సూరపురెడ్డి సత్య, జనసేన నేతలు కొత్తపల్లి నగేష్, సలాది జెపి, నాగిరెడ్డి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వట్రపూడి సొసైటీ కొత్త కమిటీ పదవీ బాధ్యతల స్వీకరణ



**కె.గంగవరం పెన్ పవర్ జులై 12 :** కె.గంగవరం మండలంలోని వట్రపూడి సహకార సొసైటీకి నూతనంగా ఎన్నుకోబడిన చైర్‌పర్సన్ దూడల నరేష్, వైస్ చైర్మన్ దొడ్డి పట్ల సత్య సాయిరామ్ , డైరెక్టర్ సుందరపల్లి మురళీకృష్ణ శనివారం అధికా రికంగా తమ తమ పదవులను స్వీకరించారు.ఈ సందర్భంగా సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు, గ్రామస్థులు, నాయకులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల అభివృద్ధి కోసం నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు కృషి చేస్తామని చైర్మన్ నరేష్ పేర్కొన్నారు.

## తిరుమలలో టీటీడీ ఈవో విస్తృత తనిఖీలు



**తిరుమల పెన్ పవర్ జూలై 12 :** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ ఈవో శ్రీ జె. శ్యామలరావు, అదనపు ఈవో శ్రీ సి.హెచ్. వెంకయ్య చౌదరితో శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలలోని సీఆర్వో కార్యాలయాన్ని ఆధునీకరించేందుకు చేపట్టిన ప్రణాళికలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. భవిష్యత్తులో యాత్రికుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా అధునాతన సౌకర్యాలతో సీఆర్వోను ఆధునీకరించేందుకు ఉన్న అవకాశాలను అధికారులతో ఆరా తీశారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5 భవనాన్ని పరిశీలించి వెయిటింగ్ హాళ్లు, శుభ్రత, భద్రత ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.

## ఇందుకూరు గ్రామంలో వాహనాల తనిఖీ

వాహన చట్టం నియమాలు పాటించని వారిపై చలానాలు..

దేవీపట్నం ఎస్సై షరీఫ్..







**దేవీపట్నం, పెన్ పవర్, జులై12 :** మండలంలోని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు.దేవీపట్నం ఎస్సై షరీఫ్ సారథ్యంలో ఇందుకూరు గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.వాహనదారులు ట్రాఫిక్ నియమాలను ఎంతవరకు పాటిస్తున్నారన్న అంశంపై పోలీసులు సమగ్ర తనిఖీలు చేశారు.ఈ తనిఖీల్లో భాగంగా హెల్మెట్ లేకుండా బైక్ తొక్కేవారు,బీమా చెల్లించని వాహనాలు,లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న వారు,మోటార్ వాహనాల చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు.వాహన చట్టం నిబంధనలు ఉల్లంఘించిన వారిపై స్పాట్ ఫైన్‌లు విధించడంతో పాటు వారిని సరైన నియమాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై షరీఫ్ మాట్లాడుతూ....ప్రజల ప్రాణాలు మాకు ముఖ్యం.ప్రతి ఒక్కరు వాహనాలు నడుపేటప్పుడు హెల్మెట్ ధరిచటం,వాహన చట్టం నియమాలు పాటించటం చాలా అవసరం.నియమాలు పాటించకపోతే ప్రాణాలు ప్రమాదంలో పడతాయి.ఈ తనిఖీలు మరికొన్ని రోజులు కొనసాగుతాయి అని తెలిపారు.తనిఖీల్లో భాగంగా గ్రామస్థులకు వాహన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారని,ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడవాలన్నారు. రోడ్డుప్రమాదాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ హెల్మెట్లు,సీట్ బెల్టులు ధరించడం,స్పీడ్ పరిమితిలోనే వాహనాలు నడిపించడం అవసరం అని ఆయన సూచించారు.

### స్నేహమే శాశ్వతం

### పూర్వ విద్యార్థి ఇంటి వేడుక కోసం 14 మంది పూర్వ విద్యార్థుల సమావేశం



**పెనుమంట్ర, పెన్ పవర్, జూలై 12 :** స్నేహానికి సమయం కేటాయించడం అనే మాటకు జీవం పోసేలా కేశవదాసుపాలెం హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఒక మధురానుభూతిని పంచుకున్నారు. పదవ తరగతి మిత్రుడు కొండ రాజేష్ కుమార్తె రజస్వల శుభకార్యానికి తాను సహా 14 మంది పూర్వ విద్యార్థులు హైదరాబాద్ వెళ్లినట్లు మార్టేరు గ్రామానికి చెందిన ఉండపల్లి నాగ భూషణం తెలిపారు. ఈ సందర్భంగా నాగ భూషణం మాట్లాడుతూ శనివారం తమ తమ కుటుంబాల్లో కార్యక్రమాలు ఉన్నప్పటికీ మిత్రుడి ఇంటి కార్యక్రమం కోసం వెళ్లడం అనుబంధాలకు ప్రతీకగా నిలిచిందన్నారు. మానవ సంబంధాలు రోజురోజుకీ క్షీణిస్తున్న ఈ కాలంలో ఈ సమావేశం గర్వించదగినదే అని పేర్కొన్నారు. ఆయన స్పష్టంగా పేర్కొంటూ నమ్మిన మిత్రులు మన ప్రాణం లాంటి వారు. వారికి అండగా నిలవడం మన బంధానికి అర్థం అని అన్నారు. ఈ వేడుకలో పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో హాజరై మిత్రుని కుటుంబానికి మధుర జ్ఞాపకాలు అందించారు. మిత్రుల మధ్య అగాధమైన బంధాన్ని మరోసారి గుర్తు చేసింది. మిత్రుల కలిసి రావడం, ఆనందం పంచుకోవడం ఇది నేటి తరానికి ఒక మార్గదర్శకం అనే చెప్పాలని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### - టీడీపీ నాయకుడు మేడిది శ్రీనివాస్



**పెద్దాపురం, పెన్ పవర్, జూలై 12 :** అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ నాయకుడు మేడిది శ్రీనివాస్ అన్నారు. పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ఎలాంటి రాజకీయ జోక్యం, పైరవీలు, షరతులు లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలా కాకుండా తల్లికి వందనం పథకాల ద్వారా ఇంట్లో ఉన్న ప్రతీ బిడ్డకూ విద్యా సహాయం అందిస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధితో యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

# రాష్ట్ర ప్రజలను మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

### - ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి - శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



**కిర్లంపూడి, పెన్ పవర్, జులై 12 :** రాష్ట్ర ప్రజలను అన్ని విధాలా మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని, ప్రభుత్వ వైఫల్యాలను గ్రామాల్లో ప్రజలకు వివరించడమే కాకుండా, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, ఎన్నికల్లో ప్రజలకు అమలు కాని హామీలు బాండు రూపంలో ప్రజలకు హామీలు ఇచ్చి నేటికీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో తెలియజేయాలని ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. కిర్లంపూడిలో మాజీ మంత్రి పీఏసీ సభ్యులు ముద్రగడ పద్మనాభం నివాసంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అధ్యక్షతన జరిగిన బాబు షూరిటి మోసం గ్యారంటీ ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయి సమావేశంలో బొత్స సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం పై ఉన్న వ్యతిరేకతను వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉన్న బలాన్ని, బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు.వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ మా కుటుంబం పట్ల ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలు చూపిస్తున్న ఆదరణ, అభిమానం మరవలేనిదన్నారు.మా కుటుంబం అంతా నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటుందన్నారు.కూటమి ప్రభుత్వం చేసే అరాచకాలను ప్రభుత్వ వైఫల్యాలను గ్రామాల్లో ప్రజలకు వివరించేలా నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. దాడిశెట్టి రాజా మాట్లాడుతూ మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం రాష్ట్రంలో ఒక బ్రాండ్ అని ఆయన తనయుడు గిరిబాబు కూడా నియోజకవర్గంలో కష్టపడి పని చేస్తున్నాడని కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించేలా త్వరలో కార్యచరణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తానేటి వనిత, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, తోట నరసింహం, మాజీ ఎంపీ వంగా గీత, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పెద్దాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి తోట రాంజీ అధిక సంఖ్యలో వైసిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



# వరద ముంపునకు గురవుతున్న ప్రాంతాలలో పర్యటించిన పిఓ అపూర్వ భరత్

### - ప్రజలకు కావలసిన వసతులపై ముందస్తుగా అధికారులకు దిశా నిర్దేశం - ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టిన భరత్





**కూనవరం,పెన్ పవర్,జూలై 12 :** ఎగువన గోదావరి పరివాహక ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాలకు గోదావరి,శబరి రెండు నదులు ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తుండడంతో చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ కూనవరం,విఆర్ పురం మండలాలలో పర్యటించారు. రెండు మండలాలలో ఫ్లడ్ రిలీఫ్ సెంటర్స్,ప్రైమరీ హెల్త్ సెంటర్స్ మరియు కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ సందర్శించారు. మండలంలో కుటూరు ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి అత్యవసర పరిస్థితుల్లో ప్రజల వైద్యానికి కావలసిన మందులు,ప్రస్తుతం ఉన్న స్టాకు రిజిస్టర్లు చెక్ చేశారు.వరదల సమయంలో రెండు మండలాలో వైద్యులు అందుబాటులో ఉండాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ వో పుల్లయ్యను ఆదేశించారు. కుటూరు పీహెచ్‌సికు జెనరేటర్ ను త్వరలో ఏర్పాటు చేయటం జరుగుతుందని, ఇంటెర్నెట్ సదుపాయం కల్పించడం ద్వారా అత్యవసర సమయంలో సమాచారం చేరవేయడానికి ఉపయోగపడుతుందని పిఓ భరత్ అన్నారు.కుటూరు గ్రామంలో ఉన్న జిసిసి గోడౌన్ లో ముందస్తుగా బియ్యం నిల్వ ఉంచి 5 పంచాయతీలకు వరద సమయంలో బియ్యం పంపిణీ చేయాలని పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు. చినర్కూరు గ్రామం నందు ఉన్న ఒపెన్ ఏరియాలో ఉన్న ఫ్లడ్ రిలీఫ్ సెంటర్స్ ను సందర్శించి ప్రజలకు కావలసిన అదనపు మంచినీటి పంపులు,సోలార్ లైట్లు,బియ్యం అడ్వాన్స్ స్టాక్ చేయడం జరిగిందని తెలిపారు.జగ్గవరం నందు ఉన్న వెలుగు గోడౌన్ ను సందర్శించి ముందస్తుగా బంపర్ స్టాక్ ఏర్పాటు చేయాలని పౌర సరఫరాల అధికారిని ఆదేశించారు.కోతులగుట్ట నందు ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను పిఓ సందర్శించి వరదల సమయంలో కావలసిన ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని ఆసుపత్రి సూపరిండెంట్ మహేష్ కు సూచించారు.డాక్టర్స్ కొరత ఉన్నదని చెప్పగా అడ్డతీగల మరియు చింతూరు నుండి ఇద్దరు వైద్యులను నియమించడం జరుగుతుంది అన్నారు.పైడిగూడెం నందు రిజర్వ్ ఫారెస్ట్ ఒపెన్ ఫీల్డ్ ఏరియా లో ఫ్లడ్ రిలీఫ్ సెంటర్స్ ను పరిశీలించి,రిలీఫ్ సెంటర్స్ నందు సుమారు వెయ్యి కుటుంబాలు నివాసం ఉండవచ్చునని వారికి రెండు హ్యాండ్ బోర్స్ అవసరమని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ చెప్పినారు. ఫారెస్ట్ అధికారుల అనుమతితో బోర్స్ ఏర్పాటు చేయటం జరుగుతుందని అన్నారు.పడవల యజమానులతో తాసిల్దార్ కార్యాలయం నందు పి ఓ ఏర్పాటు చేసిన సమావేశంలో వరద సమయంలో సమర్ధవంతంగా పని చేయాలని వారికి కావలసిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.వరదల సమయంలో ప్రజలు ఆందోళన చెందకుండా చూసుకోవలసిన బాధ్యత మనపై ఉందని సంబంధిత అధికారులతో అన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, బాలకృష్ణా రెడ్డి,ట్రైబల్ వెల్ఫేర్ మురళి,మండల తాసిల్దార్ కే శ్రీనివాస్,ఎంపీడీవో జగన్నాథం,ఎస్ ఐ లతాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## బాండ్(పొగాకు) గాడ్ ఫ్రే పిలిప్స్ కంపెనీకు వ్యతిరేఖం కాదు

### - వై.సి.పి మండల కమిటీ నాయకులు కార్యకర్తలు



**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.12 :** మండలంలోని రేఖపల్లి గ్రామంలో శనివారం మాదిరెడ్డి సత్తిబాబు ఇంటి వద్ద వై.సి.పి.మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు అధ్యక్షతనలో మండల కమిటి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా జీడిగుప్ప మాజీ సర్పంచ్ వై.సీ.పీ.మాజీ మండల కన్వీనర్ పొడియం గోపాల్,రావు మాట్లాడుతూ బాండ్ పొగాకు కంపెనీ ఉండడం వలన గత రెండు సంవత్సరాల నుండి చిన్న సన్నకారు రైతులు పొగాకు వ్యవసాయం పై శ్రద్ధ ఎక్కువగా చూపుతున్నారని, గుప్ప, బోరు, చెలకలు,తదితర పొలాలో కూడా పొగాకు పండించారాని,పండిన పంటను బాండ్,అగ్రిమెంట్ చేసిన రైతుల పంట మొత్తం కొన్నారని, కంపెనీ వారు పొగాకు కొనే టైంకు కొన్ని రూల్స్ పెట్టి రైతులను ఇబ్బంది పెట్టింది.

వస్తామని,ముందు గెల కోత అన్నారని,కోసి చెక్కులు తొక్కిన తరువాత రెల్లాలని రైతులను కొంత మేర ఇబ్బంది పెట్టారని, అయినప్పటికీ పొగాకు పండించిన రైతుల పొగాకు కొన్నారని, భారీగా లాభాలు రాకపోయిన నష్టాలు మాత్రం రాలేదని,అన్నారు. విషయం ఏమిటీ అంటే బాండు గాడ్ ప్రే పిలిప్స్ కంపెని పుగాకు లేని రోజులలో రాజమండ్రి నుండి పొగాకు కొనే యాజమాన్యం వచ్చి లక్షల విలువ చేసే పొగాకు ను కేవలం వంద రూపాయలు అడ్వాన్స్‌గా ఇచ్చి పుగాకు తీసుకొని వెళ్ళేవారని,ఏమిచేయాలో తెలియక వాళ్ళకు పుగాకు ఇచ్చేవారని వారన్నారు.పుగాకు అమ్మిన రైతులకు నానా ఇబ్బందులు వచ్చేవి,కొంత నగదు కూడా ఇచ్చేవారు కాదని,ప్రస్తుతం బాండ్ పొగాకు వారు మాత్రం రైతుల వద్ద నుంచి పొగాకు కొన్నా నాలుగు ఐదు రోజులకే మొత్తం నగదు ఇచ్చారని వారన్నారు.

కాబట్టి గాడ్ ప్రే పిలిప్స్ పుగాకు కంపినీకు మేము వై.సీ.పీ.మండల పార్టీగా చిన్న,సన్నకారు,రైతుల తరుపున ఒకటే చెబుతున్నాము ఈ సారైనా కంపెనీ వారు త్వరలో మండలంలో రైతులతో మీటింగ్ పెట్టి ఎలా పండిస్తే పొగాకు కొంటారు.అనే విషయాన్ని కంపెనీ విధి విధానాలు ముందు గానే చెప్పాలని,రైతులకు ఒకటి చెప్పి ఒకటి చేసి రైతులకు నష్టం కలిగే పని చెయ్య వద్దు,పొగాకు వేసిన ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా చూడాలని, కోరారు. పెట్టుబడులు ఎక్కువ అవుతున్నాయి.పండిన పంటకు మంచి గా గిట్టుబాటు ధర ఇవ్వాలని, కోరారు.ఈ కార్యక్రమం లో జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలు,ఆర్.టి.ఐ.విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ,సొసైటీ మాజీ వైస్ ఛైర్మెన్, శ్రీరామగి దేవస్థానం చైర్మన్ రేవు బాలరాజు, రైతులు వడ్డాణపు చిన రాజారావు,పెట్టా రాజు,వార్డు సభ్యులు గూటాల ఫణింద్ర, ఎస్.సి.సెల్,నాయకులు చీమల కాంతారావు, వైసిపి యూత్, నాయకులు మోడెం నరేష్,తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ, దేవాదాయ శాఖ సమన్వయ సమావేశం



**తిరుమల పెన్ పవర్ జూలై 12 :** ఆంధ్ర ప్రదేశ్ దేవాదాయ శాఖ గౌరవ మంత్రివర్యులు శ్రీ అనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఛైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు, ఈవో శ్రీ జె. శ్యామలరావు, దేవాదాయ శాఖ కార్యదర్శి శ్రీ వినయ్ చంద్ కలిసి దేవాదాయ శాఖ, టీటీడీ మధ్య పెండింగ్‌లో ఉన్న సంయుక్త అంశాలపై శనివారం మధ్యాహ్నం తిరుమల అన్నమయ్య భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవో శ్రీ వీరబ్రహ్మం, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీ రామచంద్ర మోహన్ కూడా పాల్గొన్నారు. కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధుల విడుదల, శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మిస్తున్న ఆలయాల వివరాలు, ఆలయాల పునరుద్ధరణ మరియు పరిరక్షణ, వాటి పురోగతి తదితర ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో టీటీడీ చీఫ్ ఇంజినీర్ శ్రీ సత్యనారాయణ, దేవాదాయ శాఖ ఉపకార్యదర్శి శ్రీ సుధాకర్ రావు, ఏపీ దేవాదాయ శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీ జి.వి.ఆర్. శేఖర్, పలువురు టీటీడీ మరియు దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## బాబు షూరిటీ మోసం గ్యారంటీ సభ విజయవంతం

### - వైసీపీ శ్రేణులతో కిక్కిరిసిపోయిన సభా ప్రాంగణం - సభకు విచ్చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసిన ముద్రగడ



**కిర్లంపూడి, పెన్ పవర్, జులై 12 :** మండల కేంద్రమైన కిర్లంపూడిలో మాజీ మంత్రి, పీఏసీ సభ్యులు ముద్రగడ పద్మనాభం నివాసంలో ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అధ్యక్షతన జరిగిన బాబు షూరిటీ మోసం గ్యారంటీ సభ విజయవంతం అయ్యింది. ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొచ్చ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గం నలుమూలల నుండి భారీ సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావడంతో ముద్రగడ స్వగృహం ఆవరణ అంతా వైసిపి శ్రేణులతో కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో బొత్స సత్యనారాయణ కార్యకర్తలకు, నాయకులకు బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం పై దిశా నిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలోనూ ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలన్నారు.ఈ సందర్భంగా సభ విజయవంతం కావడానికి తరలివచ్చిన వైసీపీ నాయకులకు,కార్యకర్తలుకు ముద్రగడ పద్మనాభం తోపాటు,ముద్రగడ గిరిబాబు గేటు వద్ద నిలబడి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా,మాజీ మంత్రులు తానేటి వనిత,



చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, తోట నరసింహం, మాజీ ఎంపీ వంగా గీత, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పెద్దాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి తోట రాంజీ అధిక సంఖ్యలో వైసిపి కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

# డ్రోన్ సహాయంతో ఓ పెన్ డ్రింకింగు రైడ్స్ పై డ్రోన్స్ నిఘా నిర్వహించిన పోలీసులు

**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,**

**జామి, పెద మానపురం శివారు ప్రాంతాల్లో ఓ పెన్ డ్రింకింగుపై వారిపై డ్రోన్స్ నిఘా**

క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం, జులై 12 :విజయనగరం జిల్లా జామి పోలీసు స్టేషను పరిధిలోని భీమసింగి, పెద మానపురం పోలీసు స్టేషన్ లోని మానాపురం సంత శివారు ప్రాంతాల్లో జూలై 11న ఓపెన్ డ్రింకింగు చేస్తున్న వారిపై పోలీసులు డ్రోన్స్ సహాయంతో రైడ్స్ నిర్వహించి, ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న 7గురిని అదుపులోకి తీసుకొని, వారిపై కేసులు నమోదు చేసారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ - జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై ఆకస్మికంగా దాడులు నిర్వహించేందుకు గత కొన్ని మాసాలుగా డ్రోన్స్ ను వినియోగిస్తున్నా మన్నారు. ఇందులో భాగంగా జూలై 11న సాయంత్రం జామి మండలం భీమసింగి శివార్లలోని లే-అవుట్ లోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై డ్రోన్స్తో నిఘా ఏర్పాటు చేసామన్నారు. డ్రోన్స్ ప్రయోగించి, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారినిగుర్తించి, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారిపై ఓపెన్ డ్రింకింగు కేసులను నమోదు చేసామని జిల్లా ఎస్పీ తెలిపారు. అదే విధంగా మానాపురం సంత వద్ద కూడా డ్రోన్స్ సహాయంతో ఓపెన్ డ్రింకింగ్ కు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వారిపై మూడు కేసులను నమోదు చేశామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.



నేర నియంత్రణలోను, శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్స్ ను వినియోగించాలని, శివారు ప్రాంతాలపై నిఘా పెట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు.

# సత్యసాయి సేవ సంస్థ కు విరాళం..

ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి.





గుమ్మలక్ష్మీపురం జులై 12. పెన్ పవర్.జియ్యమ్మవలస మండలం,జియ్యమ్మవలస గ్రామంలో భగవాన్ శ్రీ సత్య సాయి సేవా సంస్థ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ %డ% కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి మందిర నిర్మాణం నిమిత్తం 50,000 రూపాయలు విరాళంగా సత్య సాయి సేవా సంస్థ భజన మండలి సభ్యులకు అందించారు.ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు విరాళం ఇవ్వడం చాలా సంతోషకరమని ఆనందం వ్యక్తం చేస్తూ ఏ అవసరం వచ్చిన నాకు తెలియజేయండి నేనున్నాను అని సత్యసాయి సేవ సమస్త భజన మండలి సభ్యులతో ఎమ్మెల్యే అన్నారు.ఆమె తో పాటు ఏఎంసి చైర్పర్సన్ కద్రక కళావతి,గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, కలిసేటి కొండయ్య తెలుగుదేశం పార్టీ నాయకుడు కోల రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రఫీ ఆధ్వర్యంలో ఘనంగా 66వ వార్డు లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం



గాజువాక: పెన్ పవర్,జులై 12:జీవీఎంసీ 66 వార్డులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం 203 బూతు 205 బూతులో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ప్రజల నుండి మంచి స్పందన వస్తుందని, కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పేద ప్రజలకు అందుతున్నాయని ఆంధ్ర రాష్ట్రంలో గతంలో కన్నా ఇప్పుడు అభివృద్ధి సంక్షేమం వైపు దూసుకెళ్తుందని అన్నారు. గాజువాక నియోజకవర్గంలో పల్లా శ్రీనివాస్ నాయకత్వంలో పలు సంక్షేమ కార్యక్రమాలు ,అభివృద్ధి కార్యక్రమాలు ,గాజువాక హౌస్ కమిటీ కూడా క్లియర్ అయిందని ,అందరికీ తల్లి వందనం వచ్చిందని ,అభివృద్ధి కూడా జరుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో 66 వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ మరియు అన్సర్ వల్లి లక్ష్మి లక్ష్మణరావు సాలిహెన్ సాయిరాం వంశీ హర్షద్ బాబు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# జోసెఫ్ మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు



గాజువాక పెన్ పవర్, జులై 12:జులై 11 తేదీ సాయంత్రం సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు సిద్దార్థ నగర్ నివాసముంటున్న జోసెఫ్ మరణం టిడిపి తీరని లోటని పార్టీ శ్రేణులు వ్యాఖ్యానించాయి.ఆయన పారిదేహం జులై 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తెలుగుదేశం పార్టీ జెండా కప్పి అంత్యక్రియలకు తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి బొండా జగన్నాథం,జోసఫ్ కుమారుడు పాల్. హస్పిటల్ కమిటీ చైర్మన్ రాజన్ రాజు, సెక్రెటరీ ప్రకాష్,కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ,కదుపుట్ల శ్రీను, జాన్ రమేష్, బలిరెడ్డి నగేష్.సుందర సునీల్, దాలయ్య,టీవీఎస్ మూర్తి,యిర్ల దేవుడు,చర్చ్ పాస్టర్స్, సిద్ధార్థ నగర్ వాసులు. తదితరులు పాల్గొనడం జరిగింది.

# నిమ్మకు నీరెత్తినట్లు ఉంది సేంద్రియ పాలిటెక్నికల్ కళాశాల వ్యవహారం

ప్రభుత్వానికి చింతపల్లి అంటే చిన్న చూపా



చింతపల్లి పెన్ పవర్ జులై 12:-చింతపల్లి సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశాలు ఈ సంవత్సరం నుంచి రద్దుచేస్తున్నారు అనే సమాచారం తెలియగా ఉపాధ్యాయులు ముర్ల రమణ గెమ్మెల మోహన్ రావు పాలిటెక్నికల్ కళాశాల కి వెళ్లి వివరాలు సేకరించడం జరిగిందిస్థానిక నాయకులతో కలిసి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్యకు పరిష్కారం దిశగా ప్రయత్నం చేయాలని నిర్ణయం చేయడం జరిగింది. తదుపరి కార్యాచరణ సోమవారం ప్రారంభించాలని, రద్దు చేయబడిన కళాశాల మరలా పునరుద్ధరించే విధంగా అందరిని కలుపుకొని అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసిపోరాటం చేయాలని నిర్ణయం చేయడం జరిగింది.చింతపల్లి అసెంబ్లీ నియోజకవర్గం,ఐ టి డి ఎ కార్యాలయం,ట్రైబల్ యూనివర్సిటీ డైరీ ఫారం, పాలకేంద్రం పట్టుపురుగుల ఫారంలా ప్రభుత్వ సంస్థలు,ఒక్కొక్కటిగావేరేప్రాంతాలకుతొలగిపోతున్నాయి.కొన్ని రద్దు అవుతున్నాయి.

భవిష్యత్ లోఇంకా నష్టం జరగక ముందేచేతులు కాలక ముందే ఆకులు పట్టుకోవాలినాయకులు అనబడేవారందరుపార్టీలకు అతీతంగా కలిసి, ఏకమయ్యి,భవిష్యత్ లో నష్టం జరగకుండా చూడవలసిన బాధ్యత మనందరి పైనా ఉంది

# పార్టీ మారే ప్రసక్తే లేదు

- నిరాధార కథనాలను నమ్మవద్దు
- మాజీ రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు
- కార్యకర్తలంతా క్షేత్ర స్థాయిలో పాలన సంబంధ వైఫల్యాలు వివరించాలి
- సోషల్ మీడియాను ఆయుధంగా చేసుకుని క్రియాశీలక రాజకీయాలలో మాట తప్పిన నైజాన్ని, టీడీపీ సర్కారు మోసాన్ని ప్రజలకు వివరించాలి
- శ్రీకాకుళం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం




శ్రీకాకుళం : పెన్ పవర్,జులై 12: అత్యంత వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాను టీడీపీ ఎప్పటికప్పుడు మోసం చేస్తూనే ఉందని, ఈ ప్రాంత అభివృద్ధిపై అస్సలు దృష్టి సారించిన సందర్భం ఒక్కటంటే ఒక్కటి కూడా లేదని మాజీ రెవెన్యూ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావు ఆవేదన చెందారు. స్థానిక వైఎస్సార్ కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏడాది కాలం పాలనలో కనీసం వెయ్యి కోట్లు కూడా ఈ ప్రాంత అభివృద్ధికి కేటాయించలేకపోయారు. ఆయనకు ఈ జిల్లా అభివృద్ధి పట్టదు లేదు. మీరంతా కూటమి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అంటున్నారు. కానీ ఇది కూటమి ప్రభుత్వం కాదు టీడీపీ ప్రభుత్వం అని మాత్రమే వ్యవహరించాలి. పవన్ కళ్యాణ్ గారు గొంతు విప్పి మాట్లాడలేకపోతున్నారు. బీజేపీ అయితే ఎన్నికలకు ముందే చంద్రబాబు ప్రకటించిన మ్యానిఫెస్టోతో మాకేంటి సంబంధం అని సభాముఖంగానే వాళ్ల నాయకులు సైడ్ అయిపోయారు. అంటే ఇది టీడీపీ ప్రభుత్వం. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాల్సింది ఎవరు ? అసలు మాట్లాడాల్సింది ఎవరు ? మీరు.. మీరు అంటే కార్యకర్తలు. సోషల్ మీడియాను కేంద్రంగా చేసుకుని దాన్నొక ఆయుధంగా చేసుకుని మీరంతా పనిచేయాలి. ముఖ్యంగా గుడ్ మార్నింగులు, గుడ్నైట్ లు చెప్పడం కాదు పార్టీ విధివిధానాలు, అలానే టీడీపీ పాలన సంబంధ వైఫల్యాలు వీటి గురించి ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి. చాలా మంది వీటిపై ఇంకా దృష్టి సారించడం లేదు. పాలన పరంగా ఆ రోజు నుంచి ఈరోజు వరకూ ఏడు దశాబ్దాలకు పైగా పార్టీలకు అతీతంగా ఈ ప్రాంతం అన్యాయానికి గురి అవుతూనే ఉంది. మన దాహార్తి తీర్చే మన పంటలకు నీళ్లిచ్చే వంశధార ప్రాజెక్టు పూర్తికే యాభై ఏళ్లు పట్టిందంటే మీరంతా అర్థం చేసుకోవాలి. పాలకులకు మన ప్రాంతం అంటే ఎంతటి ప్రేమో అన్నది. అలానే ఆ రోజు కానీ ఈరోజు కానీ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పూర్తి దృష్టి సారించి ఆఫ్ షోర్, తోటపల్లి, నారాయణపురం వంటి ప్రధాన ప్రాజెక్టులకు నిధులు ఇచ్చింది వైఎస్సార్, జగన్మోహన్ రెడ్డి. వీళ్లిద్దరే ఈ ప్రాంతం కోసం నిధులు కేటాయించారు. ముఖ్యంగా మన పాలకులకు ఈ ప్రాంతంపై పట్టింపు లేదు అనేందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. నేను వ్యక్తిగత విమర్శలు చేయను విధాన సంబంధం అయిన విమర్శలు మాత్రమే చేస్తాను. పార్టీ ఆదేశిస్తే పార్లమెంట్ కు పోటీ చేస్తా. లేదా నా బదులు మరొకరికి నాయకత్వం ఇస్తే వారికి మద్దతు ఇస్తూ ప్రోత్సహిస్తూ పనిచేస్తా. నేను పార్టీ మారుతానని ఇప్పటికే పలు వార్తలు వచ్చాయి. కానీ అవన్నీ నిజం కావు. నా సైన్యాన్ని వదిలి వాళ్లతో మాట్లాడకుండా రాజకీయ రంగంలో యుద్ధం ఎలా చేయగలను. మీరంతా ఒక్కసారి ఆలోచించాలి. మీరు ప్రభుత్వానికి బాకాలు ఊదే పత్రికలను చదవవద్దు. నిరాధార కథనాలను నమ్మవద్దు. వాటి కారణంగా నిజానిజాలు తెలియవు. ఇవాళ ఒక్కో పత్రిక వెనుక ఒక్కో యాజమాన్యం ఉంది. వాళ్ల ఆలోచనలకు అనుగుణంగానే అవి నడుస్తున్నాయి. అధికారం కాకుండా నిజానిజాలు తెలుసుకుని, నిర్ధారించుకుని ప్రజల్లో చైతన్యం తీసుకుని వచ్చేందుకు కృషి చేయండి. నేను రాలేదు నేను రాలేను అని అనడం కాదు. నేను తప్పక వస్తాను. మీరు క్షేత్ర స్థాయిలో పనిచేయడం అన్నది ఎంతో ముఖ్యం. ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమంలో 1000 మందిని భాగం చేస్తే, ఎన్నికల నాటికి లక్ష మంది అవుతారు. ఆ రోజు సచివాలయ వ్యవస్థలో నిష్పక్షపాతంగా పోస్టింగులు ఇచ్చాం. కానీ ఇవాళ బదిలీల పేరిట ముడుపులు చెల్లిస్తే కానీ పని కావడం లేదు. ఆ రోజు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సచివాలయంలో ఉద్యోగ అవకాశం ఇచ్చాం. రాజకీయ అవినీతికి తావులేకుండా ఆ రోజు పనిచేశాం. కానీ ఇప్పుడు డబ్బులు చెల్లిస్తే కానీ బదిలీలు కావడం లేదు. డబ్బులు చెల్లించి పోస్టులు వేయించుకుంటున్న వైనం వెలుగు చూస్తోంది. ఎన్నికల ముందే చెప్పాం వలంటీర్లు ఎవ్వరైనా టీడీపీకి ఓటు వేస్తే బోడి గుండు మిగులుతుంది అని..ఇవాళ అదే జరిగింది. ప్రజలను నిలువునా మోసం చేసిన ఈ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదు. జగన్ మరింత బలపడితే ఈ కూటమిలో ఉన్న నాయకులు రేపటి వేళ మనతో కలిసి వస్తారు. మీరంతా కలిసి పనిచేయండి. గ్రామాలలో పార్టీ బలోపేతానికి కృషి చేయండి. ఆ రోజు టీడీపీ విడుదల చేసిన మ్యానిఫెస్టో ఏంటి అన్నది క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే తెలిసిపోతుంది. కనుక ఇందుకు అనుగుణంగా పనులు అవుతున్నాయా ? లేదా ? అన్నది గుర్తించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లండి. మీరు ఎంతమందిని చైతన్యవంతులను చేశారు.. క్షేత్ర స్థాయిలో పార్టీకి ఉన్న పట్టు ఎంత అన్నవి నివేదిక రూపంలో పార్టీకి అందజేయండి. అని మాజీ మంత్రి ధర్మాన అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్, వైఎస్ఆర్సిపి పార్లమెంటరీ పరిశీలకులు కుంభ రవిబాబు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెంటాడ పద్మావతి, గేదెల పురుషోత్తం, యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, కార్యక్రమం అధ్యక్షులు చిట్టి జనార్దన్ రావు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, పట్టణ అధ్యక్షులు సాదు వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని.అభివృద్ధిని

- కోతలు లేని సంక్షేమాన్ని అందిస్తున్న కూటమి ప్రభుత్వం భీమిలి ఎమ్మెల్యే గంటా





భీమిలి పెన్ పవర్, జులై 12. :ఎలాంటి కోతలు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు అందుకుంటోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం సాగర్ నగర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని.. చేపట్టిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో రూ. 2 వేల పెన్షన్ రూ. 3 వేలు చేస్తానని చెప్పిన జగన్మోహన్ రెడ్డి, ఏడాదికి రూ.250 చొప్పున అయిదేళ్లు తీసుకున్నారని విమర్శించారు. అలాగే ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ. 15 వేల వంతున ఇస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చాక ఒక బిడ్డకే అమ్మఒడి ఇస్తామని ప్లేట్ తిప్పేశారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం కూటమి అధికారంలోకి రాగానే రూ. 3 వేల పెన్షన్ ఒక్కసారిగా రూ. 4 వేలకు పెంచిందన్నారు. అలాగే ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తున్నామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో 42 లక్షల మందికి అమ్మఒడి ఇవ్వగా.. కూటమి ప్రభుత్వంలో 67 లక్షల మందికి తల్లికి వందనం ఇచ్చామని వివరించారు. అనంతరం షిర్డీ సాయి సాగరేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్పీలకు గంటా ట్యాబ్ లు అందజేశారు. కార్యక్రమంలో జనసేన భీమిలి ఇంచార్జ్ పంచకర్ల సందీప్, కార్పొరేటర్లు పి.వి.న రసింహం, లొడగల అప్పారావు, కూటమి నాయకులు పిల్లా వెంకట్రావు, శాఖారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.క్రెడాయ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్,అంతకుముందు ఎండాడ ఎం.కె.1 లో భవన నిర్మాణ కార్మికులకు క్రెడాయ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ను గంటా ప్రారం భించి మందులు పంపిణీ చేశారు. పలువురు క్రెడాయ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సంక్షేమ ఫలాల గురించి ప్రతి ఇంటికి వివరిస్తూ పర్యటన

- ప్రజలు వారి చెప్పిన సమస్యలు నివృత్తి
- ప్రభుత్వ విప్ పశ్చిమ నియోజకవర్గం శాసనస భ్యులు పి జి వి ఆర్ నాయుడు గణబాబు





ములగాడ, పెన్ పవర్, జులై 12 :ముఖ్యమంత్రివనారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భగంగా 58వ వార్డు శ్రీహరిపురం పాత రామాలయం వద్ద నుండి గుల్లలపాలెం వరకు వార్డు అధ్యక్షులు కోరాడ శ్రీనివాసరావు మరియు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ పోతాబత్తు ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారుకార్య క్రమానికి ప్రభుత్వ విప్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పి జి వి ఆర్ నాయుడు గణబా బు మరియు పశ్చిమ నియోజకవర్గం పరిశీలిక లు రంగనాయకులు ముఖ్యఅతిథిలుగా పాల్గొ ని మాట్లాడారు, జగన్ పాలనలో గాడితప్పిన అభివృద్ధి, సంక్షేమాన్ని కేవలం ఏడాది పాలనలోనే ప్రగతి పథంలో నడిపించామని, ఎన్నడు లేని విధంగా రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చాయని అచ్చం నాయుడు లోపలో టిడ్కో ఇల్లు లు పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు ఇవ్వడం జరుగుతుందని ఇప్పటికే 33 కెవి సబ్ స్టేషన్ కూడా ప్రారంభించామని తెలిపారు .అలాగే తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద తల్లులు ఖాతాలో జమ చేసిన ఏకైక ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వం అని నన్ను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన పశ్చిమ నియోజకవర్గం ప్రజలకు సేవ చేయడమే నా సంకల్పం అని తెలిపారు అనంతరం నియోజ కవర్గం శాసన సభ్యులు గణబాబు శ్రీహరిపురం మీదుగా కుంచమ్మ కాలనీ గుల్లలపాలెం మీదు గా ఇంటింటికి తిరిగి గడిచిన గత సంవత్సరంలో చేసిన అభివృద్ధి మరియు అందించిన సంక్షేమ ఫలాల గురించి ప్రతి ఇంటికి వివరిస్తూ పర్యటన లో ప్రజలు వారి చెప్పిన సమస్యలు నివృత్తి చేశారు అదేవిదంగా తల్లికి వందనం, పెన్షన్ లబ్ధిదారులు గణబాబు గారికి కృత్షతలు తెలియజేసారు.

ఈ యొక్క కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ శిరం ఉమా మహేశ్వరి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొప్పు ల వెలమ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరే షన్ డైరెక్టర్ సిహెచ్ రామ్మోహన్ నాయుడు యూనిట్ ఇంచార్జ లు బూత్ ఇంచార్జ్ లు, వార్డు నాయకలు క్లిష్టర్ ఇంచెర్జెస్, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

# కారంచేడు దళిత అమరవీరుల 40వ వర్ధంతి సభ



- మనువాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేయాలి.
- కారంచేడు ఉద్యమ సామాజిక కార్యకర్త భగత్ సింగ్

స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,విశాఖపట్నం, జులై 12 :మనువాద కార్పొరేట్ పాసిజానికి వ్యతిరేకంగా ప్రజా దళిత పౌర సంఘాలు సమరశీల పోరాటా లు చేయాలని కారంచేడు ఉద్యమ సామాజిక కార్యకర్త భగత్ సింగ్ పిలుపునిచ్చారు. కారంచే డు దళిత అమరవీరుల 40వ వర్ధంతి సభ సిపిఐ (యం.యల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యం లో శనివారం ఉదయం పౌర గ్రంథాలయంలో జరిగింది. సభలో ఆయన ప్రసంగిస్తూ కారం చేడులో 1985 జులై 17న దళితుల నెత్తురు ఏరులై పారిందని ఒక పథకం ప్రకారం చుట్టు పక్కల గ్రామాల కమ్మ భూస్వామ్య వర్గం అధికా రమదంతో జరిపిన దాడిలో 5గురు దళితులు అసువులు బాశారని తెలిపారు. కత్తులు బరిసె లు, గొడ్డలు, ఈటెలు, దుడ్డు కర్రలతో జులై 17న.ఉదయాన్నే మాదిగ పల్లెను చుట్టుముట్టి ఊరిపై అన్ని వైపుల నుండి వందలాది మంది ట్రాక్టర్లు, బైకులతో సమీకరించబడి భయానక దాడి చేశారని వివరించారు. తిరగబడే, తప్పిం చుకునే అవకాశం లేకుండా తమను ప్రశ్నిస్తున్న దళితవాడపై కక్షగట్టి మూకుమ్మడి హత్యా కాండ, అత్యాచారాల పరంపరకు ఆ అగ్రకుల ఉన్మాదులు పూనుకున్నారని చెప్పారు. మరె వ్వరూ తిరిగి తమ వైపు తలెత్తకూడదనే లక్ష్యం తో కుట్రపూరితంగా, ఉద్దేశ్యపూర్వకంగా హత్య లు చేయడంతో పాటు ఇళ్ళను, సామాన్లను ధ్వంసం చేశారని తెలిపారు. ఈ క్రూరమైన దాడిలో దుడ్డు రమేష్, తేళ్ల మోషే, తేళ్ల ముత్తయ్య, తేళ్ల యెహోషువ, దుడ్డు వందనం, దుడ్డు అబ్రహం చంపబడ్డారని దాదాపు 100 మందిని వెంటపడి వేటాడి తీవ్రంగా గాయపరిచి మహిళలపై అత్యాచారాలు చేశారని నాటి సంగతులను గుర్తు చేశారు. ఘటనకు ప్రధాన సాక్షిగా ఉన్న దుడ్డు వందనం తల్లి ఆలీసమ్మను 6వ వ్యక్తిని సాక్ష్యాలను లేకుండా చేయడానికి నిద్రిస్తుండగానే ఇంట్లోనే ఆమెను హత్య చేశార ని వివరించారు. ఈ హత్యాకాండకు సూత్రధారి దగ్గుబాటి చెంచురామయ్య వియ్యంకుడు కూ డా అయిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామా రావును, బాధితుల పరామర్శకు, పరిహారాల చెల్లింపుకు కూడా ఆ నాడు దళితులు అడుగు పెట్టనీయలేదన్నారు. ఆ నాటి ఉద్యమానికి దళిత సంఘాలు, అంబేద్కర్ సంఘాలు, విప్లవ పార్టీలు, విప్లవ సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు బాధిత దళితులకు అండగా నిలిచాయని తెలిపారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు వై కొండయ్య మాట్లాడుతూ కార్పొ రేట్ శక్తులు తమ ఏజెండాను శక్తివంతంగా అమలు చేయాలంటే, ప్రజల మధ్య విద్వేషాల ను సృష్టించే, వారిని విభజించే, ప్రజా పోరాటా లను దెబ్బతీయ గలిగే శక్తులను అన్వేషించా యని తెలిపారు. అందుకే కార్పొరేట్ శక్తులు మన్మోహన్ సింగ్ ని, కాంగ్రెస్ ని ఒకవైపున ప్రక్కన పెట్టి, మరోవైపున కాంగ్రెస్ పరిపాలనా కాలంలో దేశంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని తన మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేశాయన్నారు. ఆర్ఎస్ఎస్ బిజెపిలను, గుజరాత్ అభివృద్ధి నమూనాను, అప్పటికే నేరగాళ్లుగా పేరు పడ్డ నరేంద్ర మోడీ అమిత్ షాలను, ప్రత్యామ్నాయమైన తమ వారిగా ప్రకటించాయని తెలిపారు. వారి మద్దతుతో దళిత బహుజన శక్తులకు సంబంధించిన హక్కులను నీరు గార్చే కుట్రలకు పూనుకున్నారని, వీటికి వ్యతిరేకంగా ఉద్య మించాలని పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే ట్రస్ట్ చైర్ పర్సన్ గూడూరు సీతామహాల క్ష్మి మాట్లాడుతూ చాతుర్వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థలకు వ్యతిరేకంగా చరిత్రలో బుద్ధుడు, చార్వాకులు, జైన్లు, ఆధునికంలో మహాత్మ జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే, ఫాతిమా, సంత్ రవిదాస్, అయ్యంకాళీ, అయోతీ దాస్, కుసుమ ధర్మన్న, పెరియారు, సాహు మహారా జ్, అంబేద్కర్ లాంటి మహనీయులు త్యాగ పూరిత పోరాటాలు నిర్వహించారని తెలిపారు. అంబేద్కర్ భారత రాజ్యాంగ రచన ద్వారా బడుగు బలహీన వర్గాలకు అనేక హక్కులు కల్పించారన్నారు. కానీ ఈ 75 ఏళ్ల కాలంలో పాలకవర్గాలు వాటిని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యూ డెమోక్రసీ కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక దాడులు ఇటీవల కాలంలో దళితులపై పెరిగాయని తెలిపారు. భూస్వామ్య పెత్తందారి శక్తులు కార్పొరేట్ శక్తులు ఏకమై సాగిస్తున్న ఈ దాడులను ప్రతిఘటించడానికి కారంచేడు, చుండూరు తదితర సామాజిక న్యాయ పోరాటాల నుండి ప్రతిఘటన చైతన్యాన్ని స్ఫూర్తిగా స్వీకరించి ముందుకు సాగాలని కోరారు. న్యూ డెమోక్రసీ ఏరియా కమిటీ నాయకులు కె. నిర్మల అధ్యక్షత జరిగిన సభలో కె చిన్నారావు (భీం సేన వార్ అధ్యక్షులు), ఎం లక్ష్మి( పి ఓ డబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు), ఎస్ వి రమణ (దళిత విముక్తి కన్వీనర్),జీడి సారయ్య (భారత నాస్తిక సమాజం), దేవా (ప్రజాపోరు) ప్రసంగించగా అధిక సంఖ్యలో సంఘాల నేతలు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు. అరుణోదయ కళాకారులు కారంచేడు అమరుల గురించి పాడిన పాటలు, దళిత చైతన్య పాటలు సభికులను ఉత్తేజపరిచాయి.

# విద్యతో పాటు ఆరోగ్యం పైనా దృష్టి





గాజువాక: పెన్ పవర్, జులై 12: విశిష్టమైన విద్యా ప్రమాణాలతో ముందుకు వెళ్లే శ్రిష్టి వరల్డ్ స్కూల్, ఉదయం 9:00 నుండి 12:00 నిమిషాల వరకువరకు పేరెంట్- టీచర్ సమావేశంను నిర్వహించింది. ఇది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య గాఢమైన అనుసంధానాన్ని పెంపొందించే వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఉచిత దంత పరీక్ష శిబిరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది . రాయల్ డెంటల్ మరియు ఇంప్లాంట్ క్లినిక్ వ్యవస్థాపకురాలు, బంగారు పతకం విజేత డాక్టర్ తేజస్వి గ్రేడ్ 2 నుండి 5 విద్యార్థుల కోసం ఉదయం 9:30 నుండి 11:30 నిమిషాల వరకు తన సేవలను అందించారు. చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టే విధంగా ఇది ఆచరణాత్మక అవగాహన కలిగించే కార్యక్రమంగా నిలిచింది.

ఈ ఆరంభానికి ప్రేరణ ఇచ్చిన డైరెక్టర్ పి. సుశీలా రాణి కి ప్రత్యేక అభినందనలతో పాటు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మేఘనా కంభం సేవలకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.. బాల్య దశలో విద్యాభివృద్ధి కార్యక్రమాలకు ఆమె చేస్తున్న కృషి, శ్రిష్టి స్కూల్ విద్యా దృష్టికోణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతోంది.

విద్యతో పాటు ఆరోగ్యాన్ని సమపాళ్ళలో చూసే ఈ ప్రణాళికలు, శ్రిష్టి వరల్డ్ స్కూల్ యొక్క సర్వతోముఖాభివృద్ధిపై దృష్టిని ప్రతిబింబిస్తున్నాయి.

# ధర్నాలు, ర్యాలీలు,సమావేశాలకు అనుమతులు తప్పనిసరి



విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు



క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం, జులై 12 :విజయనగరం సబ్ డివిజన్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, రోడ్ షోలు నిర్వహిం చాలంటే సంబంధిత వ్యక్తులు ముందస్తుగా పోలీసుశాఖ అనుమతి పొందాలని విజయన గరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సెక్షన్ 30 పోలీసు చట్టం-1861, నెల రోజులపా టు అమలులో ఉంటుందన్నారు. ఈ చట్టం ప్రకారం విజయనగరం సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ చట్టం-1861లోని సెక్షన్ 30 ప్రకారం ఊరేగింపులు, బహిరంగ సభలు, ర్యాలీలు, ధర్నాలు మొదలైన వాటి నిర్వహణకు ముందస్తు అనుమతులు తప్పనిసరన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రశాంతత దృష్ట్యా, వివిధ రాజకీయ పార్టీలు/సమూహాలు/సంస్థలు ఊరేగింపులు, సమావేశాలు, ధర్నాలు, బంద్ పిలుపులు, రోడ్లపై మరియు రోడ్డు పక్కన గుమిగూడటం, రోడ్ షోలు నిర్వహించే అవకాశం ఉంది. ఒకేసారి, ఒకే చోట రోడ్ షోలు మరియు ఊరేగింపులు నిర్వహించినప్పుడు శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడానికి వివిధ పార్టీలు/సమూహాలు నిర్వహించే ఇటువంటి బహిరంగ సభలు లేదా ఊరేగింపులను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.శాంతిభద్రతలు మరి యు ప్రజల ప్రశాంతత దృష్ట్యా, ఊరేగింపులు, బహిరంగ సభలు, ర్యాలీలు మరియు ధర్నాలు మొదలైన వాటికి విజయనగరం సబ్-డివిజనల్ పోలీస్ అధికారి నుండి ముందస్తు అనుమతి లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు.

కావున, ప్రజలు గమనించాలని, తప్పనిసరిగా ముందస్తు అనుమతులు పొందాలని డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు కోరారు.

# 12 ఎం ఎల్ డి మంచినీటి శుద్ధి కర్మాగారం, సిద్ధార్థ నగర్లో సమస్యలను తక్షణం పరిష్కరించాలి





గాజువాక :పెన్ పవర్, జులై 12: జి.వి.ఎం.సి. నీటి సరఫరా విభాగం ఎస్ ఈ కే.వి .ఎన్ .రవి తో ప్లాంట్ ను 87 వ వార్డు కార్పొరేటర్ మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం సందర్శించారు.

గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధిలో 12 ఎం ఎల్ డి ట్రీట్మెంట్ ప్లాంట్ ను సందర్శించిన టీ.డీ.పీ రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం నీటి సరఫరా విభాగం

ఎస్ ఈ కె.వి.ఎన్ రవి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న 12 ఎం ఎల్ డి ట్రీట్మెంట్ ప్లాంట్ 86,87 వార్డు లకు మంచినీటి సరఫరాను అందిస్తుంది. నివాసితులు యొక్క వినియోగం పెరగడం వల్ల ప్రస్తుత నీటి సరఫరా సామర్థ్యం సరిపోవడం లేదని, ఎంవివి అండ్ ఎం కె పార్క్ మరియు అభిరామ్ కన్స్ట్రక్షన్ లాంటి పెద్ద పెద్ద అపార్ట్మెంట్లకు నీళ్లు ఇవ్వాలి అంటే మరో 12 ఎం ఎల్ డి మంచినీటి శుద్ధి కర్మాగారం అవసరమని ఈ సమస్యను పరిష్కరించ మనీ టి.డి.పి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు జరిగిన జీ.వీ.ఎం.సీ.కౌన్సిల్ సమావేశంలో మాట్లాడడం జరిగింది. పాత 12ఎంఎల్ డిప్లాంట్లో ఉన్న సమస్యలు క్లారిఫైయర్ బ్రిడ్జి పనిచేయటం లేదు, ఆలం మిక్స్ చేసే ఫ్యాన్లు మరియు మోటర్లు పనిచేయట్లేదని, ప్రస్తుతం ఉన్న ఆరు మోటర్లకు నాలుగు మోటర్లే పనిచేస్తున్నాయని, ప్రస్తుతం ఉన్న ట్రాన్స్ఫార్మర్ కెపాసిటీ సరిపోనందున దాని ప్లేస్ లో కొత్త ట్రాన్స్ఫార్మ అర్చమని, ప్రతి సంవత్సరనాకు ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ కొరకు 19. 80 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్న ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వారు మెయింటెన్స్ సరిగా చేయడం లేదు అని నివేదిక సమర్పించగా వారి ఆదేశాల మేరకు సంబంధించిన అధికారులు 87 వ వార్డు సిద్ధార్థ నగర్ లో గల ఎం ఎల్ డి మంచినీటి శుద్ధి కర్మాగారంను సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సాగి విజయరామరాజు, అధికారులు ఈ.ఈ పి.శ్రీనివాస ప్రసాద్, డిప్యూటీ ఈఈ బి.డి శ్రీనివాస్, ఏ ఈ పి కేదార్నాథ్, వాటర్ డిపార్ట్మెంట్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆ నియోజకవర్గం.. జనసేనదే.. రాసిపెట్టుకోవచ్చట.. !

జనసేన

**హైదరాబాద్ పెన్ పవర్:** అరకు పార్లమెంటు స్థానాన్ని గత ఏడాది జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీల హవా నడిచినప్పటికీ వైసీపీ దక్కించుకుంది. ఈ నియోజకవర్గంలో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా 6 ఎస్టీలకు రిజర్వ్ చేశారు. ఒకటి మాత్రమే ఎస్సీ వర్గానికి రిజర్వ్ అయింది. ఈ మొత్తం ఏడు నియోజకవర్గాల్లో కేవలం రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాత్రమే వైసిపి గెలవగా ఓవరాల్ గా ఎంపి స్థానాన్ని మాత్రం వైసిపి తన ఖాతాలో వేసుకుంది. ఇక ఇప్పుడున్న పరిస్థితి ఏంటి అనేది గమనిస్తే ప్రస్తుతం అరకు పార్లమెంటు పరిధిలో ఉన్న పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లా వంటి ఎస్టి సామాజిక వర్గం అధికంగా ఉన్న ఈ జిల్లాల్లో జనసేన పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.జనసేన నాయకులు తరచుగా అక్కడ పర్యటించడంతోపాటు ఆ పార్టీ అధినేత అక్కడ ఏం జరుగుతుందన్నది వారానికి ఒకసారి ఆరా తీస్తున్నారు. గిరిజనుల సౌకర్యాలు.. గిరిజనుల సమస్యలు.. గిరిజనులకు చేయాల్సిన పనులు వంటి అంశాలపై నిరంతరం పవన్ కళ్యాణ్ దృష్టి పెడుతున్నారు. దీనిని బట్టి అరకు పార్లమెంటుపై జనసేన ఒక విధమైన వ్యూహంతో అడుగులు వేస్తోంది అన్నది స్పష్టంగా తెలుస్తోంది. నిజానికి వైసీపీకి ఎంతో బలమైన ఈ పార్లమెంటు స్థానంలో క్షేత్రస్థాయిలో జనసేన బలపడడం, అదే సమయంలో పనులు కూడా చేస్తుండడం కేవలం మాట మాత్రమే కాకుండా చేతల ద్వారా కూడా గిరిజనులను ఆకర్షించే ప్రయత్నం ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్న దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.కొన్నాళ్ల కిందట రోడ్లు వేయించారు. తర్వాత గిరిజనులకు చెప్పులు పంచారు. ఇటీవల మామిడికాయలు పంపించారు. మనసును హత్తుకునే విధంగా గిరిజన జిల్లాల్లో జనసేన చాలా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. దీనిని బట్టి వచ్చే ఎన్నికల్లో అరకు పార్లమెంటు స్థానాన్ని జనసేన దక్కించుకుని కూటమి తరపున పోటీ చేసినా ఆశ్చర్యం లేదనేది స్థానికంగా నాయకులు మధ్య జరుగుతున్న చర్చ. దీంతో వైసిపి ఖాతా నుంచి బలమైన అరకు పార్లమెంటు పోవచ్చు అనేది కూడా వారు చెబుతున్నారు.ంప్రస్తుతం అరకు ఎంపీగా వైసీపీ నాయకురాలు తనూజా రాణి ఉన్నప్పటికీ స్థానికంగా ఎమ్మెల్యేలు మాత్రం ఆమెకు ఏ మాత్రం సహకరించటం లేదనేది అందరికీ తెలిసిన విషయమే. ఇటీవల పార్లమెంటు స్థాయి సమావేశం నిర్వహిస్తే టిడిపి కానీ జనసేన కానీ ఒకరిని కూడా పంపించలేదు. కేవలం ఇద్దరు వైసిపి ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు. దీంతో సదరు సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండానే ముగించారు. దీనిని బట్టి అరకు పార్లమెంటు స్థానంపై జనసేన గట్టి పట్టుదలతో అడుగులు వేస్తుంది అన్నది స్పష్టం అవుతుంది. వచ్చే ఎన్నికల్లో దీనిని దక్కించుకుని ఏడుకు ఏడు చోట్ల జనసేన నాయకులు పోటీ చేసినా.. ఎంపీ స్థానం నుంచి పోటీ చేసినా ఆశ్చర్యం లేదన్న చర్చ సాగుతోంది.

# పవన్ అమాయకుడు... పాపాల భైరవుడు బాబే !



**హైదరాబాద్ పెన్ పవర్:** పేరుకు టీడీపీ కూటమి ప్రభుత్వం అంటున్నారు కానీ అందులో పెత్తనం అంతా చేసేది ఒక్క టీడీపీయే అని వైసీపీ సీనియర్ నేత మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతే కాదు కూటమి అని పేరు చెబుతూ తన పాపాలను అందరికీ అంటించే ప్రయత్నం బాబు చేస్తున్నారు అని అన్నారు. నిజానికి చూస్తే కూటమి ప్రభుత్వం కాదిది, చంద్రబాబు ప్రభుత్వమే అని ధర్మాన హాట్ కామెంట్స్ చేశారు. పాపాలు అన్నీ చేస్తున్నది చంద్రబాబే అన్నారుఇటీవల వైసీపీ పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రసాదరావు మాట్లాడుతూ చంద్రబాబు మీద హాట్ కామెంట్స్ చేశారు. మోసాలు చేయడమే బాబు నైజం అన్నారు. అయినా సరే ఆయనను నమ్మి అధికారం ఇస్తున్నారని చెప్పారు. అలా మోసంతోనో మాయాజాలంతోనో అధికారం సంపాదించడమూ ఒక గొప్పతనమని టీడీపీ క్యాడర్ అంతా సంబరపడుతూ ఉంటుదని ఆయన అన్నారు.ఒక్కోసారి దొంగోడుకి కూడా పేరు వస్తుందని ఊళ్ళో దొంగతనం చేసిన వాడిని కూడా ఆరడుగుల గోడ అవలీలగా దూకేసి దొంగతనం చేశాడురా అని తెలియకుండానే పొగుడుతూంటారని ధర్మాన అన్నారు. బాబుని పొగడడం అలాంటిదే అన్నారు

చంద్రబాబు అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని ఆయన అన్ని వర్గాలను ఇపుడు మోసం చేస్తున్నారు అని ధర్మాన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు ఇచ్చే హామీలతో తమకు సంబంధం లేదని బీజేపీ మొదటే తప్పుకుందని గుర్తు చేశారు. ఇక జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కి సైతం ఏ విషయంలోనూ ఇవాల్వ్ మెంట్ లేదని అన్నారు. ఆయన అమాయకుడని ధర్మాన వ్యాఖ్యానించారు.తన రాజకీయం మీద అభద్రతాభావం తోనే పవన్ కళ్యాణ్ చంద్రబాబుని పొగుడుతున్నారే తప్ప మరేమీ కాదని అన్నారు. ఇలా కూటమి ప్రభుత్వంలో మొత్తానికి మొత్తం పెత్తనం చేస్తూ ఏడాదిగా ఏమీ చేయకుండా టీడీపీ మోసం చేస్తోంది అని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంగానే దీనిని అందుకే చూడాలని ఆయన కార్యకర్తలకు హితబోధ చేసారు.మరో వైపు చూస్తే అత్యంత వెనకబడిన బీద జిల్లా అయిన శ్రీకాకుళానికి ఏడాది పాలనలో బాబు వేయి కోట్ల రూపాయలు కూడా కేటాయించలేదని ధర్మాన మండిపడ్డారు. ఏపీ వార్షిక బడ్జెట్ రెండు లక్షల కోట్ల రూపాయలుగా ఉంటే ఒక వేయి కోట్లు శ్రీకాకుళం అభివృద్ధికి కేటాయించలేరా అని ఆయన ప్రశ్నించారు. క్యాపిటల్ ఎక్స్ పెండించర్ గా వేయి కోట్లు ఇవ్వలేని ప్రభుత్వంగా టీడీపీ ఉందని ఆయన అన్నారు.మొత్తం మీద చూస్తే చాలా కాలానికి నోరు తెరచినా ఘాటైన విమర్శలే ధర్మాన చంద్రబాబు మీద చేశారు అని అంటున్నారు. బాబు అధికారంలోకి రావడానికి మోసపూరితమైన మాటలు మాయ మాటలే చెబుతున్నారని అయితే మా బాబు ఎలాగోలా అధికారం తెచ్చేస్తాడు అన్నది ఆ పార్టీ క్యాడర్ ధైర్యం అని ధర్మాన చెప్పుకొచ్చారు. ఇక పవన్ ని అమాయకుడు ఆయనని అలా వదిలేయండి అన్ ధర్మాన చెప్పడమే విశేషం.

# ట్రంప్ కి మరో బ్రేకప్ ?

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా రాజకీయ వ్యవస్థను మరోసారి కుదిపేసే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ట్రంప్ ప్రభుత్వానికి సమీప వర్గంగా భావించే, భారత సంతతికి చెందిన ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ తన పదవికి రాజీనామా చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దేశాన్ని షేక్ చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం నేపథ్యంలో.. ఆయన ఈ నిర్ణయం తీసుకునే అవకాశముందని అమెరికా స్థానిక మీడియా ప్రచారం చేస్తోంది.



**ఎప్‌స్టీన్ ఫైల్స్.. రాజకీయ భూకంపం**

జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం వ్యవహారానికి సంబంధించిన "ఎప్‌స్టీన్ ఫైల్స్" అమెరికా వ్యాప్తంగా సంచలనం రేపాయి. ఈ కేసులో పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీలు కాంటాక్ట్‌లలో ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. విచారణ బాధ్యత ఎఫ్‌బీఐ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ (డీవోజే) చేతుల్లో ఉన్నప్పటికీ.. దర్యాప్తులో పారదర్శకత లేదని పలువురు అధికారులే విమర్శలు చేస్తున్నారు.

**డాన్ బోంగినో రాజీనామా అంచనా**

ఎఫ్‌బీఐ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న డాన్ బోంగినో ఇటీవల సెలవుపై వెళ్లిన తర్వాత, ఆయన పామ్ బాండీ వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. "బాండీ ఉండగానే తిరిగి విధుల్లోకి రావడం తనకు ఇష్టం లేదని" ఆయన పేర్కొన్నారని కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో బోంగినో రాజీనామా చేస్తే.. కాష్ పటేల్ కూడా అదే బాటలో వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది.

**కాష్ పటేల్ అసంతృప్తి కారణం**

ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కాష్ పటేల్.. పామ్ బాండీ తీరుపై అసంతృప్తిగా ఉన్నారు. ముఖ్యంగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోని కొన్ని కీలక పత్రాలను విడుదల చేయకపోవడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. "పామ్ బాండీ ఉండగానే దర్యాప్తు సరైన దిశగా సాగదనే" భావన కాష్‌లో ఏర్పడిందని స్థానిక జర్నలిస్టులు తెలిపారు.

**ట్రంప్ వర్గాల్లో ఉత్కంఠ**

ఈ పరిణామాలు ట్రంప్ శిబిరంలో తీవ్ర కలకలం రేపాయి. గతంలో ఎలాన్ మస్క్ "బిగ్ బ్యూటిఫుల్ బిల్లు" విషయంలో విభేదాలతో డోజ్ వదిలిన సందర్భం గుర్తుకు వస్తోంది. ఇప్పుడు కాష్ పటేల్ కూడా అదే తరహాలో వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఎఫ్‌బీఐ – డీవోజే వ్యవహారంపై ట్రంప్ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

**మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (MAGA) శ్రేణుల్లో అసంతృప్తి**

ఇక ట్రంప్ మద్దతుదారులైన MAGA వర్గాలు కూడా ఈ వ్యవహారంపై తీవ్రమైన అసంతృప్తితో ఉన్నాయని తెలుస్తోంది. లారా లూమర్ వంటి సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు బాండీపై విమర్శలు గుప్పిస్తున్నారు. పారదర్శకత లోపించిందని, ప్రజలకు నిజాలు తెలియకుండా మౌనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వచ్చాయి.


**కాష్ పటేల్ పరిచయం**

గుజరాత్‌కు చెందిన కుటుంబంలో జన్మించిన కశ్యప్ ప్రమోద్ పటేల్ (కాష్ పటేల్), న్యూయార్క్‌లో 1980లో జన్మించారు. మియామీలో లాయర్‌గా పనిచేసిన ఆయన, ట్రంప్‌కు దగ్గరయ్యి వెహికల్ లీగల్ అడ్వైజర్ హోదాలో పనిచేశారు. 2025 ఫిబ్రవరి 22న ఎఫ్‌బీఐ 9వ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేకత ఏమిటంటే.. ఆయన భగవద్గీత మీద చేయి ఉంచి ప్రమాణం చేశారు.

ఈ క్రమంలో ఎఫ్‌బీఐలో పై స్థాయిలో మార్పులు రావడం ఖాయంగా కనిపిస్తోంది. బోంగినో రాజీనామా చేస్తే.. వెంటనే కాష్ పటేల్ కూడా వెళ్లే అవకాశం కనిపిస్తోంది. ఎఫ్‌బీఐ%–%డీవోజే మధ్య పోరు.. ఎప్‌స్టీన్ ఫైల్స్ నిజంగా ఏమి వెలికి తీయబోతున్నాయన్న ఉత్కంఠను మరింత పెంచుతోంది. పారదర్శకత కోసం పోరాడుతున్నవారికి ఇది ఓ కీలక మలుపు కావచ్చు.

# బండి VS భూమన : తిరుమలపై మరో రచ్చ

**హైదరాబాద్ పెన్ పవర్:** కలియుగ వైకుంఠంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరచూ వివాదాలకు వేదికగా మారుతుండడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా భక్తులు పవిత్ర స్థలంగా భావించే తిరుమల, ఇటీవలి కాలంలో రాజకీయ వ్యాఖ్యలకు, వివాదాలకు కేంద్ర బిందువుగా మారడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరుస్తోంది. ఈ వివాదాలు తిరుమల పవిత్రతను దెబ్బతీయడంతో పాటు, ప్రజల విశ్వాసాన్ని కూడా బలహీనపరుస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



**బండి సంజయ్ వ్యాఖ్యలతో రాజకీయ వేడి**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తిరుమలలో మరోసారి మత రాజకీయ చర్చను రాజేశాయి. టీటీడీలో వెయ్యి మందికి పైగా అన్యమత ఉద్యోగులు ఉన్నారని, వారిని తక్షణమే తొలగించాలని ఆయన చేసిన ప్రకటన రాజకీయంగా తీవ్ర దుమారానికి దారి తీసింది. ఈ వ్యాఖ్యలు కొందరికి మతపరమైన హక్కులపై దాడిగా కనిపిస్తుండగా, మరికొందరికి ఆలయ పవిత్రత, పరిరక్షణలో భాగంగా అనిపిస్తున్నాయి. మతపరమైన ప్రాతిపదికన ఉద్యోగులను తొలగించాలనే డిమాండ్, మత స్వేచ్ఛపై చర్చను రేకెత్తించింది.

**భూమన కరుణాకర్ రెడ్డి కౌంటర్**

బండి సంజయ్ వ్యాఖ్యలపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. గతంలో టీటీడీ బోర్డు కేవలం 22 మంది అన్యమత ఉద్యోగులను మాత్రమే గుర్తించిందని స్పష్టం చేస్తూ, బండి సంజయ్ చెబుతున్న సంఖ్య పూర్తిగా అసత్యమని ఆరోపించారు. బండి సంజయ్ వ్యాఖ్యలు శ్రీవారి ఆలయ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని, దీని వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని భూమన అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తెలియకుండానే ఇటువంటి ప్రకటనలు చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

**ప్రభుత్వ మౌనంపై విమర్శలు**

బండి సంజయ్ వ్యాఖ్యలు చేసి 24 గంటలు గడుస్తున్నా, టీటీడీ అధికారులు, పాలకమండలి, ప్రభుత్వం కూడా ఎటువంటి స్పందన ఇవ్వకపోవడంపై భూమన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మౌన సమ్మతి అని అభివర్ణిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అధికార కూటమి ప్రభుత్వమే ఈ వ్యాఖ్యలను సమర్థిస్తుందా అని ఆయన గట్టి ప్రశ్నను సంధించారు. ప్రభుత్వ మౌనం ఈ వివాదాన్ని మరింత తీవ్రతరం చేయడానికి కారణమైందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**వాస్తవ పరిస్థితి ఏమిటి?**

ప్రస్తుతం టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగుల మతపరమైన ప్రాతినిధ్యంపై స్పష్టమైన లెక్కలను ప్రభుత్వం గానీ, టీటీడీ యాజమాన్యం గానీ ప్రజలకు అందుబాటులో ఉంచకపోవడం గందరగోళానికి దారితీస్తోంది. మతాన్ని ఆధారం చేసుకుని ఉద్యోగులపై ప్రశ్నలు లేవనెత్తడం సరైనదేనా? లేక ఆలయ భద్రత, పవిత్రతకు సంబంధించి వాస్తవాలను నిర్ధారించడం అవసరమా? అనే చర్చ కొనసాగుతోంది. ఈ విషయంలో పారదర్శకత లేకపోవడం అపోహలకు తావిస్తోంది.

**భక్తుల ఆందోళన**

ఇలాంటి వివాదాలు దేవస్థానం పవిత్రతను దెబ్బతీయడంతో పాటు, కోట్లాది మంది భక్తుల మనోభావాలను గాయపరుస్తున్నాయి. తిరుమల అనేది కేవలం ఒక ప్రార్థనా స్థలం కాదని, అది కోట్లాది మంది విశ్వాసానికి, భక్తికి ప్రతీక అన్నది చాలామంది అభిప్రాయం. అక్కడ జరిగే ప్రతి చర్య దేశవ్యాప్తంగా భక్తులపై ప్రభావం చూపుతుంది. తిరుమల వంటి పవిత్ర క్షేత్రాన్ని రాజకీయ వ్యాఖ్యల కేంద్రంగా మార్చకూడదన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.

టీటీడీ యాజమాన్యం, ప్రభుత్వం ఈ వివాదంపై తక్షణమే స్పష్టమైన ప్రకటన చేసి, భక్తుల అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉంది. మత స్వేచ్ఛను పరిరక్షిస్తూనే, ఆలయ పవిత్రత, పరిరక్షణను సమతుల్యంగా నిలిపే బాధ్యతను అన్ని వర్గాలూ గుర్తించాలి. పవిత్రమైన పుణ్యక్షేత్రాలను రాజకీయాలకు అతీతంగా ఉంచడం, భక్తుల విశ్వాసాన్ని కాపాడటం అందరి బాధ్యత.

# మొన్న రాజాసింగ్.. నేడు లక్ష్మణ్.. బీజేపీలో రాజుకుంటోందా?

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ బీసీ ముఖ్యమంత్రి హామీ కాకరేపుతోంది. తాజాగా రాజాసింగ్ రాజీనామా, కె. లక్ష్మణ్ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీశాయి. బీసీలకు ముఖ్యమంత్రి పదవి ఇస్తామన్న హామీ నిజంగానే అమలు అవుతుందా లేక కేవలం ఎన్నికల జిమ్మిక్కా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ముఖ్యంగా పార్టీలో అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వకపోవడంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల విమర్శలు, అంతర్గత కుమ్ములాటలు బీజేపీకి కొత్త తలనొప్పిని తెచ్చిపెట్టాయి.



**బీసీ ముఖ్యమంత్రి హామీ.. ఆచరణలో ఎంతవరకు సాధ్యం?**

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ తెలంగాణలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేస్తామని హామీ ఇచ్చింది. స్వయంగా ప్రధానమంత్రి మోదీ ఈ ప్రకటన చేశారు. రాష్ట్రంలో జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీ ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ వేసిన వ్యూహంగా ఇది కనిపిస్తుంది. కె. లక్ష్మణ్ సైతం ఇతర రాష్ట్రాల్లో బీజేపీ బీసీలను ముఖ్యమంత్రులుగా చేసిందని గుర్తు చేశారు. అయితే ఈ హామీ కేవలం ఎన్నికల కోసమేనా లేక నిజంగానే బీసీలను ముఖ్యమంత్రి చేసే నిబద్ధత బీజేపీకి ఉందా అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

**రాజాసింగ్ రాజీనామా – అంతర్గత కలహాలకు నిదర్శనమా?**

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను రాష్ట్ర బీజేపీ జాతీయ నాయకత్వానికి పంపడం, దానిని జాతీయ నాయకత్వం ఆమోదించడం బీజేపీలో అంతర్గత ఇబ్బందులను స్పష్టం చేస్తుంది. ఈ రాజీనామా వెనుక బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించే ఉద్దేశం ఉందా లేక ఇతర రాజకీయ కారణాలు ఉన్నాయా అనేది ఇంకా స్పష్టత రాలేదు. బీసీ ముఖ్యమంత్రి హామీకి, రాజాసింగ్ రాజీనామాకు నేరుగా సంబంధం ఉందా అనేది కూడా ఇంకా అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. ఇది పార్టీలోని పాత, కొత్త నాయకుల మధ్య నెలకొన్న విభేదాలకు నిదర్శనంగా కొందరు విశ్లేషిస్తున్నారు.

**బీజేపీ బీసీ నాయకత్వ చరిత్ర – తెలంగాణలో మలుపులు**

బీజేపీకి బీసీలను ముఖ్యమంత్రులుగా చేసిన చరిత్ర ఉందని కె. లక్ష్మణ్ ఉదహరించారు. ఉత్తరప్రదేశ్‌లో కల్యాణ్ సింగ్, బిహార్‌లో నితీష్ కుమార్ వంటి బీసీ నేతలు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. తెలంగాణలో కూడా చలపతిరావు, బండారు దత్తాత్రేయ, బండి సంజయ్ వంటి బీసీ నేతలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించింది. అయితే, తాజాగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీజేపీని బీసీలపై "మొసలి కన్నీరు" కారుస్తోందని, రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నాయి.

**బీసీ సామాజిక వర్గంపై ప్రభావం – అసంతృప్తి పెల్లుబుకుతోందా?**

ప్రస్తుతం బీజేపీ అధ్యక్ష పగ్గాలు బీసీలకు ఇవ్వకపోవడం పార్టీలో అంతర్గత ఒత్తిడికి దారితీసినట్లు తెలుస్తోంది. గతంలో ఈటల రాజేందర్, డీకే.అరుణ, ధర్మపురి అర్వింద్ వంటి బీసీ నేతలను ప్రముఖ పదవులకు పరిగణించినప్పటికీ, రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం బీసీ నేతను ఎంపిక చేయకపోవడం విమర్శలకు దారితీసింది. ఈ క్రమంలో రాజాసింగ్ రాజీనామా, లక్ష్మణ్ బీసీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు బీజేపీలో ఏం జరుగుతుందన్న చర్చకు దారితీశాయి. బీసీ సామాజిక వర్గంలో కూడా ఈ అంశంపై కొంత అసంతృప్తి నెలకొనే అవకాశం ఉంది.

మొత్తంగా, తెలంగాణలో బీజేపీ బీసీ ముఖ్యమంత్రి హామీ, అంతర్గత రాజకీయాలు రానున్న కాలంలో పార్టీ భవిష్యత్తును ఏ విధంగా ప్రభావితం చేస్తాయో వేచి చూడాలి. బీసీ సామాజిక వర్గాన్ని ఆకట్టుకోవడానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో, పార్టీలోని అంతర్గత విభేదాలను అధిగమించి ముందుకు సాగగలుగుతుందో చూడాలి.

# అప్పటివరకు వైట్ బాల్ సిరీస్ ఆడను..
# క్రికెట్‌కు కమ్మిన్స్ షార్ట్ బ్రేక్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా వన్డే, టెస్ట్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ క్రికెట్ కు చిన్న బ్రేక్ ఇవ్వబోతున్నాడు. కొన్ని నెలల పాటు క్రికెట్ కు దూరంగా ఉండాలనే నిర్ణయం తీసుకున్నాడు. కమ్మిన్స్ తీసుకున్న ఈ నిరణయానికి కారణం లేకపోలేదు. 2026లో ఇంగ్లాండ్ పై ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ జరగబోతుంది. ఈ మెగా సిరీస్ ను దృష్టిలో పెట్టుకొని రెస్ట్ తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిపాడు. నవంబర్ 21 నుంచి యాషెస్ స్టార్ట్ అవుతుంది. సొంతగడ్డపై జరగబోయే ఈ టెస్ట్ సిరీస్ ను ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ఆస్ట్రేలియా ఉంది. టెస్ట్ కెప్టెన్ గా కమ్మిన్స్ 5 టెస్ట్ మ్యాచ్ లు ఆడాలంటే అతనికి రెస్ట్ కావాల్సి ఉంది.

ప్రస్తుతం కమ్మిన్స్ వెస్టిండీస్ టూర్ లో ఉన్నాడు. ఈ పర్యటనలో భాగంగా మూడో టెస్టు మ్యాచ్ ఆడతాడు. ఇప్పటికే ఆస్ట్రేలియా తొలి రెండు టెస్ట్ మ్యాచ్ లు గెలిచి చివరి టెస్ట్ మిగిలి ఉండగానే సిరీస్ ను 2-0 తేడాతో గెలుచుకుంది. టెస్ట్ సిరీస్ తర్వాత జరగబోయే 5 టీ 20 మ్యాచ్ ల సిరీస్ కు తాను అందుబాటులో ఉండదని కమ్మిన్స్ ఇప్పటికే ప్రకటించాడు. తాజాగా శనివారం (జూలై 12) న సౌతాఫ్రికాతో జరగబోయే వైట్ బాల్ సిరీస్ కు దూరంగా ఉంటానని కన్ఫర్మ్ చేశాడు. సౌతాఫ్రికాతో ఆస్ట్రేలియా మూడు వన్డేలు.. మూడు టీ20 మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. తాను నెల నుంచి ఆరు వారాల పాటు ఎలాంటి క్రికెట్ ఆడబోనని.. ఈ క్రమంలో తన ఫిట్ నెస్ పై పూర్తి ఫోకస్ పెడతానని కమ్మిన్స్ తెలిపాడు. సమ్మర్ లో సొంతగడ్డపై జరగబోయే యాషెస్ సిరీస్ కు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని చెప్పుకొచ్చాడు. న్యూజిలాండ్, ఇండియాతో జరగబోయే సిరీస్ లకు తాను అందుబాటులో ఉండే అవకాశం ఉందని కంబ్యాక్ పై హింట్ ఇచ్చాడు. ఆస్ట్రేలియా డొమెస్టిక్ క్రికెట్ షెఫీల్డ్ షీల్డ్ టోర్నీ ఆడొచ్చని తెలిపాడు. ఐపీఎల్ టోర్నీ.. ఆ తర్వాత టెస్ట్ ఛాంపియన్ షిప్.. వెస్టిండీస్ తో రెండు మ్యాచ్ ల సిరీస్ తో కమ్మిన్స్ గత నాలుగు నెలలుగా బిజీ క క్రికెట్ ఆడుతున్నాడు.

# సిరీస్‌లో రెండోది.. ఇంగ్లాండ్‌లో నాలుగోది: లార్డ్స్‌లో సెంచరీతో చెలరేగిన రాహుల్





**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ పుట్టినిల్లు లార్డ్స్ లో సెంచరీ కొట్టడం ఎవరికైనా ప్రత్యేకమే. ముఖ్యంగా టెస్టుల్లో ఈ ఘనతను అందుకుంటే అంతకంటే గొప్ప విషయం మరొకటి ఉండదు. టీమిండియా వెటరన్ బ్యాటర్ కేఎల్ రాహుల్ లార్డ్స్ లో సెంచరీ చేసి ఆకట్టుకున్నాడు. ఇంగ్లాండ్ తో జరుగుతున్న మూడో టెస్టులో 176 బంతుల్లో రాహుల్ తన సెంచరీ మార్క్ అందుకున్నాడు. కేఎల్ ఇన్నింగ్స్ లో 13 ఫోర్లు ఉన్నాయి. రాహుల్ టెస్ట్ కెరీర్ లో ఇది 10 సెంచరీ కాగా.. ఈ సిరీస్ లో రెండోది. అంతకముందు లీడ్స్ టెస్టు రెండో ఇన్నింగ్స్ లో రాహుల్ సెంచరీ కొట్టాడు.

మూడో రోజు లంచ్ తర్వాత 66 ఓవర్ నాలుగో బంతికి ఆర్చర్ బౌలింగ్ లో సింగిల్ తీసి రాహుల్ ప్రతిష్టాత్మక గ్రౌండ్ లో శతకాన్ని అందుకున్నాడు. ఇంగ్లాండ్ గడ్డపై రాహుల్ టెస్టుల్లో ఇది నాలుగో సెంచరీ కావడం విశేషం. ఈ సిరీస్ లో సూపర్ ఫామ్ లో ఉన్న రాహుల్ లార్డ్స్ టెస్టులో ఒక్కడే పోరాడుతూ టీమిండియాను ముందుకు తీసుకెళ్తున్నాడు. ప్రస్తుతం తొలి ఇన్నింగ్స్ లో టీమిండియా 5 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. సెంచరీ తర్వాత రాహుల్ బషీర్ బౌలింగ్ లో స్లిప్ లో క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో టీమిండియా ఐదో వికెట్ ను కోల్పోయింది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 112.3 ఓవర్లలో 387 రన్స్‌కు ఆలౌటైంది. జో రూట్ (104) సెంచరీ పూర్తి చేసుకోగా.. బ్రైడన్ కార్స్ (56), జేమీ స్మిత్ (51) ఫిఫ్టీలతో రాణించారు. బుమ్రా ఐదు వికెట్లు పడగొట్టగా.. సిరాజ్ (2/85) రెండు వికెట్లు తీశాడు.

# ఆ రూల్ ఉంటే కోహ్లీ మరింత రెచ్చిపోయి ఆడేవాడు.. బీసీసీఐపై రైనా అసహనం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాలో బోర్డర్%-%గావస్కర్ ట్రోఫీలో ఇండియా 1%-%3తో ఓడిన తర్వాత బీసీసీఐ కొన్ని కొత్త రూల్స్ తీసుకొచ్చింది. 45 కంటే ఎక్కువ రోజులు జరిగే టూర్‌లో ఆటగాళ్ల కుటుంబ సభ్యులు 14 రోజులు మాత్రమే వారితో ఉండవచ్చు. షార్ట్ టూర్లలో ప్లేయర్ల భార్యాపిల్లాలు లేదా గర్ల్‌ఫ్రెండ్స్ ఒక్క వారం మాత్రమే ఉండేలా పరిమితి విధించింది. ఈ రూల్ పై కోహ్లీతో సహా దిగ్గజ క్రికెటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా టీమిండియా మాజీ క్రికెటర్ సురేష్ రైనా బీసీసీఐ తీసుకొచ్చిన ఫ్యామిలీ రూల్ పై తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. టీమిండియా స్టార్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీని రైనా ఉదాహరణగా తీసుకొని తన యూట్యూబ్ ఛానెల్‌లో రణవీర్ అల్లాబాడియాతో మాట్లాడాడు. " విదేశీ పర్యటనలో కుటుంబం ఉండటం చాలా ముఖ్యం. నేను బీసీసీఐ రూల్ ను వ్యతిరేకిస్తున్నాను. కుటుంబని ఖచ్చితంగా అనుమతించాలి. ఫామ్ లో లేని ఆటగాళ్లు తమ ఫామ్‌ను తిరిగి పొందడానికి కుటుంబం సహాయపడుతుంది. కోహ్లీ వాళ్ళ కూతురు స్టాండ్స్ లో నించొని చప్పట్లు కొడుతుంటే ఒకసారి ఊహించుకోండి. కోహ్లీకి ఇది గర్వించే క్షణం. విరాట్ (కోహ్లి) అత్యుత్తమ ఫామ్‌లో లేకుంటే.. అతని కుమార్తెను చూస్తే పరుగుల వరద పారిస్తాడు". అని రైనా చెప్పుకొచ్చాడు.

ఈ సందర్భంగా 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో చాలా బాగా ఆడిన తన వ్యక్తిగత అనుభవాన్ని కూడా రైనా పంచుకున్నాడు. "కుటుంబంతో కలిసి ఉండాలి. నా భార్య లేకపోతే, నేను 2018లో (దక్షిణాఫ్రికాపై) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలిచి ఉండే వాడిని కాదు". అని రైనా అన్నాడు. ఈ విషయంపై ఆర్‌సీబీ ఇన్నోవేషన్ ల్యాబ్ సమ్మిట్‌లో కోహ్లీ నాలుగు నెలల క్రితం తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు. 'కుటుంబం ఎంత ముఖ్యమో చెప్పడం కష్టం.

మైదానంలో ఎంతటి ఒత్తిడి ఎదురైనా తిరిగొచ్చి కుటుంబంతో గడిపితే మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఆటలో నిరాశకు గురైనప్పుడు మనకు ఇష్టమైన వారు పక్కనే ఉంటే ఆ బాధ నుంచి కోలుకోవచ్చు. నా వరకు గదిలో ఒంటరిగా కూర్చొని బాధపడటం ఇష్టం లేదు. అందరిలానే సాధారణ జీవితాన్ని కొనసాగించాలనుకుంటాను. ఆడటం నా బాధ్యత, కానీ కుటుంబంతో గడిపే సమయం నా నిజమైన ఆనందం.అందుకే నేనెప్పుడూ కుటుంబంతో గడిపే సమయాన్ని కోల్పోకుండా చూసుకుంటా. నేనే కాదు ఏ ఆటగాడైనా కుటుంబం తమతోనే ఉండాలని అంటాడు. కానీ ఈ విషయం గురించి కొందరు సంబంధం లేని వ్యక్తులు చర్చలు జరపడం చూసి బాధ కలుగుతోంది' అని విరాట్ పేర్కొన్నాడు. ఇక, తన ఫిట్‌నెస్, తీసుకునే డైట్ విషయంలో తల్లిని ఒప్పించడం ఎంతో కష్టమైందని కోహ్లీ చెప్పాడు.



సోనాల్ కుక్రేజా యొక్క కలర్ ఛాయిస్ ఆన్‌లైన్‌లో హృదయాలను గెలుచుకుంది

# అందాల హద్దులు దాటిన కీర్తి ఆ శృతి మించడం లేదు..!



మహానటి ఫేం కీర్తి సురేష్ కెరీర్ ఆరంభం నుంచి స్కిన్ షో కి దూరం గా ఉంటూ వచ్చింది. ముఖ్యంగా సినిమాల్లో అడుగు పెట్టిన కొన్ని సంవత్సరాల పాటు కనీసం నడుము అందాన్ని కూడా చూపించకుండా సినిమాల్లో నటిస్తూ వచ్చింది. కీర్తి సురేష్ కేవలం నటనతో గుర్తింపు దక్కించుకుంటుంది, అందాల ఆరబోత చేయకుండానే ఇంతటి పాపులారిటీని సొంతం చేసుకుంటే ఇక స్కిన్ షో చేస్తే ఏ స్థాయిలో ఈమె స్టార్‌డం దక్కించుకుంటుందో కదా అంటూ చాలా మంది కామెంట్ చేశారు. చాలా మంది చాలా రకాలుగా ప్రయత్నించినా కూడా కీర్తి సురేష్ కెరీర్ ఆరంభంలో స్కిన్ షోకి ఓకే చెప్పలేదు. ఏ ఒక్క సినిమాలో కనీసం చిన్న రొమాంటిక్ సీన్స్‌లో కూడా ఈమె నటించలేదు.

స్కిన్ షోకి, రొమాంటిక్ సీన్స్‌కి దూరంగా ఉండటం వల్ల టాలీవుడ్‌లో ఆఫర్లు తగ్గాయి, కోలీవుడ్‌లోనూ ఈమెకు స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కడం లేదు. దాంతో మెల్ల మెల్లగా తాను కూడా రూట్ మారాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అందుకే స్కిన్ షో కి ఈ అమ్మడు రెడీ అయింది. ఆ మధ్య మహేష్ బాబు హీరోగా వచ్చిన సర్కారు వారి పాట సినిమాలో ఒక మోస్తరు స్కిన్ షో చేసింది. అంతే కాకుండా ఆ సినిమాలో కాస్త మహేష్ బాబుతో రొమాంటిక్ యాంగిల్ ఉన్న పాత్రలో కనిపించింది. కీర్తి సురేష్‌ను ఆ సినిమాలో చూసి చాలా మంది షాక్ అయ్యారు. ఇక బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన బాబీ జాన్ సినిమాతో మరో మెట్టు ఎక్కింది. రొమాంటిక్ సీన్స్, స్కిన్ షోకి ఈ అమ్మడు దాదాపుగా ఓకే చెప్పినట్లే అని దాంతో క్లారిటీ ఇచ్చింది.సౌత్ ఇండియాలోనే కాకుండా ఎక్కడైనా సినిమాల్లో హీరోయిన్స్ అలరించాలంటే ఖచ్చితంగా స్కిన్ షో చేయాల్సిందే, స్టార్ డం దక్కాలంటే రొమాంటిక్ సీన్స్ చేయాల్సిందే. ఈ మధ్య కాలంలో స్టార్ హీరోల సినిమాల్లో లిప్ లాక్ సీన్స్ కామన్ అయ్యాయి. అందుకే చాలా మంది హీరోయిన్స్ లిప్ లాక్ సీన్స్‌కు ఇష్టం లేకున్నా ఓకే చెబుతున్నారు. ఆఫర్లు రావాలంటే కొన్ని విషయాల్లో చూసి చూడనట్లు ఉండాలని, అన్నింటికి ఓకే చెప్పాలని కొందరు హీరోయిన్స్ అంటూ ఉంటారు. అలా ఉంటేనే ఇండస్ట్రీలో ముఖ్యంగా కమర్షియల్ సినిమాల్లో నటించే అవకాశాలు వస్తాయని అంటారు. కీర్తి మాత్రం అందంగా కనిపించే విషయంలో హద్దులు దాటింది కానీ ముద్దు విషయంలో మాత్రం శృతి మించను అంటోంది.ఒక మోస్తరు వరకు స్కిన్ షో చేయడానికి ఈ అమ్మడు రెడీ అంటోంది. ఇప్పటి వరకు చేసిన దానితో పోల్చితే కీర్తి సురేష్‌ను ఇంకాస్త ఎక్కువగానే స్కిన్ షో లో చూసే అవకాశాలు ఉన్నాయి. కానీ రొమాంటిక్ సీన్స్ ముఖ్యంగా లిప్ లాక్ సీన్స్‌లో ఆమెను చూసే అవకాశం లేదని అంటున్నారు. పెళ్లి తర్వాత సహజంగా హీరోయిన్స్ స్కిన్ షో కి దూరంగా ఉంటారు. కానీ కీర్తి సురేష్ ఇన్నాళ్లు స్కిన్ షో చేయకుడా ఉండి, పెళ్లి అయిన తర్వాత ఇప్పుడు స్కిన్ షోకు ఓకే చెప్పడం విడ్డూరంగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కీర్తి సురేష్ ముందు ముందు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి. త్వరలో ఈమె తెలుగులో విజయ్ దేవరకొండతో సినిమాను చేసే అవకాశాలు ఉన్నాయి. ఆ విషయమై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరో వైపు తమిళ్, హిందీలోనూ ఈమె ప్రాజెక్టులు చేస్తూనే ఉంది.



గ్రేస్ మెట్స్ బోల్డ్‌నెస్: దేవియాని శర్మ యొక్క అద్భుతమైన చీర లుక్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com